ఎఎంఆర్ అపార్డ్
AMR-APARD

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 6 సంచిక: 12

జనవరి, 2015

ఎడిటర్
**జె. రేమండ్ పీటర్** ఐ.ఏ.ఎస్.
కమీషనర్, అపార్డ్

ఎడిటోరియల్ బోర్డు
**కె. యాదయ్య**
**హెచ్. కూర్మారావు**
**ఆర్. సూర్యనారాయణరెడ్డి**
**డా॥ కె. ఆసయ్య**
**ఎ. నాగేశ్వరరావు**

కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్
**సెంటర్ ఫర్ మీడియా పబ్లికేషన్స్, అపార్డ్**
**కాక్స్‌టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్**
హైదరాబాద్

ప్రచురణ

ఎ.ఎం.ఆర్. -అపార్డ్
రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005
E-mail : editorsthanikapalana@gmail.com
Website: www.apard.gov.in

ఈ సంచికలో రచయితలు
వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా
ప్రభుత్వానికి గాని, అపార్డ్‌కి గాని చెందినవిగా
భావించనక్కరలేదు.

# విషయ సూచిక

సంపాదకీయం ........ 4
రూ. 1,765 కోట్లతో బీటీ రోడ్ల పునరుద్ధరణ ........ 5
జెడ్.పి.టి.సి.లు గ్రామాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలి ........ 5
పౌల్ట్రీ ఎక్స్‌పో - 2014 ........ 6
వాటర్‌గ్రిడ్ పథకానికి సిద్దిపేట నీటి సరఫరా రోల్ మోడల్ ........ 6
6 నెలల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాలన సమీక్ష కోసం అవసరమయ్యే అంశాలు ........ 7
జిల్లా ప్రజాపరిషత్ ప్రాదేశిక నియోజక వర్గ (జెడ్‌పిటిసి) సభ్యుల విధులు-అధికారాలు. 12
మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో నర్సరీ పెంపకం - తగిన సూచనలు ........ 14
మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ పథకాలు ........ 16
ఉపాధి హామీలో పారిశుద్ధ్య సౌకర్యాల కల్పన ........ 18
రక్తహీనతను అధిగమించటం ఎలా ? ........ 21
'లీపు' వీరుడు మొరార్జీ దేశాయ్ ........ 23
మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వ పథకాలు ........ 25
చెరువుల పునరుద్ధరణ వలన బోరుబావుల ద్వారా నీరు లభ్యత మెరుగు ! ........ 27
సమగ్రాభివృద్ధికి సంపూర్ణ అక్షరాస్యత - స్థానిక ప్రభుత్వాల పాత్ర ........ 29
చెట్ల క్రింద గ్రామ ప్రజాస్వామ్యం - ఆసరా! ఆశల జీవనభృతి !! (కవితలు) ........ 31
చిరుధాన్య పంటల ప్రాముఖ్యం ........ 32
భారత్ నిర్మాణ్ వాలంటీర్ల అపూర్వ విజయాలు ........ 34
జెడ్.పి.టి.సి.లు బాధ్యతాయుతంగా తమ విధులను నెరవేర్చాలి ........ 36
ఎమ్ఓటి/టిఓటి ల మూడు రోజుల శిక్షణ ప్రారంభం ........ 36
నువ్వుల సాగులో మెళుకువలు ........ 37
భారతదేశంలో బిటి ప్రత్తి ఆవశ్యకత - ప్రస్తుత పరిస్థితి ........ 39
పశువులకు మేత పెంచే విధానాలు ........ 41
1989 నాటి ఎస్.సి.ఎస్.టిలపై అత్యాచారాల నిరోధక చట్టం ఏం చెప్తుంది ? ........ 43
గిరిజనుల వ్యవసాయ రంగానికి నిధుల కోత ! ........ 47
సేవే పరమార్ధం - అదే గణపతి మార్గం ........ 48
ప్రజాకవి కాళోజీ నారాయణరావు ........ 49
నీలం నుంచి నల్లారి వరకు ముఖ్యమంత్రులు ........ 50
నీరు - చెట్టు (కవిత) ........ 54
సుస్థిరాభివృద్ధికి స్థానిక సంస్థలు ........ 55
పంచాయతీరాజ్ సంస్థల బలోపేతానికే
రాజీవ్‌గాంధీ పంచాయతీ స్వశక్తీకరణ్ యోజన ........ 58
విపత్తుల నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ నష్టాలు అధిగమించాలి ........ 59
వాతావరణ మార్పులను గమనిస్తూ విపత్తుల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి ........ 59
ఎం.జి.ఎన్.ఆర్.జి.ఎలో 'శ్రామిక గ్రూపుల వ్యవస్థీకరణ' పై జాతీయ వర్క్‌షాప్ ........ 60
గ్రామపారిశుద్ధ్య మెరుగుదలకై గ్రామ సర్పంచ్ విన్నపం ........ 61
సంక్రాంతి - సామాజిక క్రాంతి ........ 63
గ్రామ పంచాయతీల బలోపేతానికి రాజీవ్ సశక్తీకరణ అభియాన్ ........ 66

# మానవతా విలువలతో నడుస్తున్న ప్రభుత్వం



మానవతా విలువలతో నడుస్తుంది తెలంగాణ నూతన ప్రభుత్వం అనేందుకు మొదటి ముఖ్యమంత్రి కెసిఆర్ చేసిన వాగ్దానాలను నిలుపుకోవటమే తార్కాణమని చెప్పవచ్చును. వృద్దులకు, ఏ ఆధారము లేక కేవలం ప్రభుత్వ ఆసరాతో బ్రతుకుతున్న జనానికి దేవుడిచ్చిన వరంగా పింఛన్ల పెంపుదల వచ్చింది. ఒక్కసారిగా రూ. 200 నుండి రూ. 1000 కి వృద్ధాప్యపు పింఛను పెంచడం, వికలాంగులకు ఇస్తున్న పింఛను రూ. 500 నుండి రూ. 1500కు పెంచడం మామూలు విషయం కాదు. 'ప్రభుత్వాధినేతకు ఎంత ధైర్యం ఉంటే ఈ సహాయాన్ని పెంచగలరు' అని అందరు ముఖ్యంగా పింఛను పొందుతున్న ఏ ఆధారం లేని జనం ముఖ్యమంత్రి కెసిఆర్‌ను పొగడమే గాక, ఆయన విగ్రహాలకు పాలాభిషేకం చేయడాన్ని గుర్తించాలి. అదేవిధంగా ఉమ్మడి ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయాలను కొన్నింటిని తమ తెలంగాణ రాష్ట్ర ప్రజల అవసరాలను తీర్చే విధంగా మలచుకోవడాన్ని చాలామంది ప్రజలు హర్షిస్తున్నారు.

ముఖ్యంగా తెలంగాణా ప్రభుత్వం చేస్తున్న వాగ్దానాలలో ప్రతి గృహానికి పైపుల ద్వారా మంచినీరు అందించాలనే లక్ష్యంతో వాటర్‌గ్రిడ్ పథకాన్ని అమలు చేయటానికి నిశ్చయించడం జరిగింది. ఇది ఉన్నత విలువలతో ప్రజల అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం నడుం బిగించినట్లయింది. అందుకు కావలసిన నిధులలో వెంటనే రూ. 450 కోట్లు కేటాయించడం ఎంతో సాహసోపేత చర్య అని చెప్పక తప్పదు. నేడు త్రాగునీరు ప్రాథమిక హక్కుగా మారింది. అందుకు ముఖ్యమంత్రి పూనుకొని కేవలం అనుకున్న మూడు నెలల్లో వాటర్‌గ్రిడ్‌కు శంకుస్థాపన చేయడం అసాధారణం.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేతల ప్రభుత్వంగా చూపటానికి పూనుకున్నారు. గుజరాత్‌లో అమలైన వాటర్‌గ్రిడ్ పథకం స్ఫూర్తిగా ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు తన గత నియోజకవర్గం మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్లలో వాటర్ గ్రిడ్‌ను తలపెట్టడం ఎంతో ముదావాహం.

మరో కొత్త పథకం ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ప్రతి గ్రామంలో చెఱువులున్నాయి. వాటిని పునరుద్ధరించడం ద్వారా గ్రామాలలో సాగునీరు, త్రాగునీటి కొరతను తీర్చేందుకు పూనుకోవడం మరింత అభినందించదగ్గది. చెఱువులు నిండుకుండలా ఉంటే భూమిలో నీటి శాతాన్ని పెంచవచ్చు. బోరుబావుల ద్వారా వచ్చే నీరు లభ్యత పెరిగే విధంగా చేయవచ్చు. వ్యవసాయానికి ఎక్కువ సాగునీరు అందివ్వవచ్చును. రాష్ట్రంలో ఉన్న 870 చెఱువులను పూడికతీసి తిరిగి నీరు నింపడం, నిల్వ వుంచి ఎక్కువ రోజులుండేట్లు చేయడానికి నిశ్చయించడం హర్షించదగిన విషయాలు. చెఱువులు వాడకం అనేది మన ప్రాచీన కాలం నుండి వస్తున్న సాంప్రదాయిక పద్ధతి. దీనివలన ఎంతోమంది గ్రామీణులకు కావలసిన నీరు లభ్యమవటమే కాక, భూగర్భ జల నిల్వ స్థాయిని మదుపు పెట్టేందుకు మంచి అవకాశం రైతుకు దొరుకుతుంది. తద్వారా తమ పంటల స్వాంతనను పెంచుకొనేందుకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రారంభించిన ప్రతి ఒక్క కార్యక్రమం ఒక కలికితురాయిగా మిగిలిపోతుంది. ఆటోలపై టాక్స్‌ని రద్దు చేయడం, బడుగు కులాల యువతుల వివాహానికి 'భరోసా' కల్పించి 50 వేల రూపాయలు అందించడం అనేది ఎంతో మానవత్వంతో కూడిన 'ఆసరా' పథకం పేరుతో పలువురికి చేయూతనందించడం సాహస చర్యేనని చెప్పాలి. కాని ఈ పథకాల పరిపూర్ణ ఫలితాలు క్రింది అధికారుల పనితీరు మీద ఆధారపడి ఉంటుంది. కనుక పథకాలను అధికారగణం విజయవంతం చేయడంలో చిత్తశుద్ధి ముఖ్యం.

ఈ అభివృద్ధి కార్యక్రమాలు అమలు జరిగితే నిజంగా తెలంగాణ రాష్ట్రం 'బంగారు తెలంగాణా'గా ఏర్పడుతుందనే దానిలో ఎటువంటి సందేహం లేదు. తెలంగాణాలో వనరులకు కొరత లేదు. సంకల్పబలం,. కష్టపడే నైజాన్ని అలవర్చుకొని పొదుపుతో ముందుకు సాగితే దశాబ్దకాలంలోనే తెలంగాణా రాష్ట్రం అభివృద్ధి చెందిన రాష్ట్రంగా చరిత్రపుటల్లోకి ఎక్కుతుందనటంలో సందేహం లేదు.

( జె. రేమండ్ పీటర్ )

# రూ. 1,765 కోట్లతో బీటీ రోడ్ల పునరుద్ధరణ



## పంచాయతీరాజ్ శాఖ మంత్రి కేటీఆర్

రాష్ట్రంలో ప్రతి గ్రామాన్ని రోడ్లతో అనుసంధానం చేయడమే లక్ష్యంగా బీటీ (తారు) రోడ్ల పునరుద్ధరణకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి కె. తారకరామారావు తెలిపారు.

తొలిదశలో రూ. 1.765 కోట్లతో 12,006 కిలోమీటర్ల బీటీరోడ్ల పునరుద్ధరణ పనులు చేపడుతామన్నారు. పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇన్ ఛీఫ్, ఇతర ఉన్నతాధికారులతో బీటీ రోడ్ల పునరుద్ధరణ పనులపై మంత్రి కేటీఆర్ సమీక్షించారు.

కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం ఉండదని, అయితే నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయకపోతే జరిమానా విధించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గడువు పెంచే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (పీఎంజీఎస్వై) ప్రమాణాల మేరకు రహదారులను నిర్మించడంతోపాటు, ఐదేళ్లపాటు నిర్వహణ బాధ్యత కూడా కాంట్రాక్టర్లదేనని కేటీఆర్ చెప్పారు.

పునరుద్ధరణ పనులకు సంబంధించి నాణ్యత విషయంలో కఠినంగా వ్యవహరించాలని, నాణ్యత లోపిస్తే అధికారులపైనా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. సబ్ కాంట్రాక్టుల విధానానికి స్వస్తి పలికేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 4,160 కిలోమీటర్ల మట్టిరోడ్లను బీటీ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు రూ. 2,035 కోట్లు, సుమారు 20 వేల కిలోమీటర్ల మట్టి రోడ్ల పటిష్టానికి కూడా రూ. 600 కోట్లు కేటాయించామన్నారు. ◆

# జెడ్.పి.టి.సి.లు గ్రామాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలి



గ్రామ స్వరాజ్యం స్థాపనలో జెడ్.పి.టి.సిలు తాము భాగస్వాములుగా ఉంటూ గ్రామాభివృద్ధికి తమవంతు సమన్విత సహకారాలు అందించాల్సిన అవసరం ఉందని ఎ.ఎం.ఆర్. అపార్డు జాయింట్ డైరెక్టర్ కె. యాదయ్య అన్నారు.

డిసెంబర్ 4న అనంతపూర్ జిల్లా జెడ్.పి.టి.సిల శిక్షణా కార్యక్రమాన్ని అపార్డ్‌లో ప్రారంభించి ప్రసంగించారు. జెడ్‌పిటిసిలు తమ విధులను అంకితభావంతో, ప్రజలకు అందుబాటులో వుండి, ప్రజాసేవ చేయాలని, ప్రభుత్వ పథకాలు అమలులో అధికారుల సమన్వయంతో లక్షిత వర్గాలకు పథకాలు అందేలా చూడాలని చెప్పారు.

ప్రజాసేవ చేయడానికి తగిన ఉత్సాహం, అభిరుచిని కలిగి ఉన్నప్పుడు తమ ఆశయాలను కలిసికట్టుగా పనిచేయటం ద్వారా సాధించు కొనవచ్చుని కె. యాదయ్య అన్నారు. అనంతపురం జిల్లా నుండి వచ్చిన 50 మంది జెడ్.పి.టి.సిలు మూడురోజుల శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ శిక్షణ కార్యక్రమాన్ని పరిపాలన మరియు ప్రణాళిక వికేంద్రీకరణ కేంద్రం హెడ్ ఆర్. సూర్యనారాయణరెడ్డి నేతృత్వంలో పర్యవేక్షించబడింది.

ఈ మూడురోజుల శిక్షణలో జెడ్‌పిటిసిల అధికారం, విధులు, బాధ్యతలు, జిల్లాపరిషత్ పనులు, ప్రణాళికలు, కార్యక్రమాలు, నైతిక విలువలు, పాలనా పద్ధతులను గూర్చి ప్రత్యేక నిపుణులు వీరికి వివరించటం జరిగింది.

*- సి.ఎం.పి.*



# పౌల్ట్రీ ఎక్స్‌పో - 2014

**హై**టెక్స్‌లో ఎనిమిదో వార్షిక పౌల్ట్రీ పదర్శన - 2014 ను తెలంగాణా ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పౌల్ట్రీ పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణా రాష్ట్రం అన్ని విధాలుగా అనువైందని ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే సంస్థలకు సకల సహకారాలు అందజేస్తామని తెలియజేశారు. పౌల్ట్రీ ఉత్పత్తులు పరంగా తెలంగాణా రాష్ట్రం ఇప్పటిదాకా దేశంలో నెంబర్‌వన్‌గా ఉందని రానున్న కాలంలో కూడా నంబర్‌వన్‌గా కొనసాగుతుందని వ్యక్తం చేశారు.

ఇందుకోసం అన్ని రకాల ప్రోత్సహకాలను ప్రభుత్వం అందిస్తుందని హామీ ఇచ్చారు. గతంలో పౌల్ట్రీ రంగానికి కేటాయించిన బడ్జెట్ 90 కోట్ల రూపాయలు మాత్రమే ఉంటే తాము 220 కోట్ల రూపాయలకు పెంచామని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. రంగానికి ఊతం లభించేలా ఐసిడిఎస్ (ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీస్) కేంద్రాలకు గుడ్ల పంపిణి 3 కోట్ల నుండి 5.25 కోట్ల పెంచామన్నారు.

హాస్టల్ విద్యార్థులకు ఇంతకు ముందు వారానికి రెండు గుడ్లు ఇస్తే ఇప్పుడు వారానికి మూడు గుడ్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు కోడిమాంసం, గుడ్లు మంచి పౌష్టిక ఆహారం అని ఆయన పేర్కొన్నారు. అమెరికా నుండి చికెన్ లెగ్స్ దిగుమతులపై నియంత్రణ పాటించాలని సిఎం కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. అందుబాటు ధరల్లో దాణాను అందజేస్తున్నామని పేర్కొన్నారు. అదే విధంగా పౌల్ట్రీ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు సహకారం అందజేస్తామని చెప్పారు. తెలంగాణా రాష్ట్రంలో పౌల్ట్రీ రంగానికి తమ ప్రభుత్వం వ్యవసాయ హోదాను కల్పించిందని, ఇదే విధంగా కేంద్ర ప్రభుత్వం కూడా పౌల్ట్రీ వ్యవసాయ హోదాను ఇవ్వాలని కోరారు. కోళ్ళ పరిశ్రమలకు యూనిట్ రూ. 2.20 విద్యుత్ రాయితీ ఇవ్వాలని తెలంగాణా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. దీనికోసం పశుసంవర్ధకశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారని తెలియజేశారు.

అనంతరం కేంద్ర వ్యవసాయశాఖ సహాయమంత్రి శ్రీ సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా కోళ్ళ పరిశ్రమ అన్యూహ్యాంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. 12వ పంచవర్ష ప్రణాళికలో కోళ్ళ పరిశ్రమ అభివృద్ధి కోసం రూ. 280 కోట్లు కేటాయించామన్నారు. వ్యవసాయ అనుబంధ రుణాల్లో కోళ్ళ పరిశ్రమే వేగంగా దూసుకుపోతుందన్నారు .

ఈ కార్యక్రమంలో రాష్ట్రమంత్రులు శ్రీ పోచారం శ్రీనివాస్, ఈటెల రాజేందర్, ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీ చక్రధర్‌రావు, దేశ విదేశాలకు చెందిన 250 పైగా సంస్థలు పాల్గొన్నాయి. ◆

# వాటర్‌గ్రిడ్ పథకానికి సిద్దిపేట నీటి సరఫరా రోల్ మోడల్

**రాష్ట్రంలో చేపట్టిన వాటర్‌గ్రిడ్ పథకానికి కరీంనగర్ జిల్లాలోని లోయర్ మానేరు డ్యాంపై నిర్మించిన సిద్దిపేట తాగునీటి సరఫరా పథకాన్ని ఆదర్శంగా తీసుకుంటామని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు.**

'సిద్ధిపేట నియోజకవర్గానికి సమగ్ర నీటి సరఫరా పథకం -విజయోత్సవం (2000-2014)లో భాగంగా నవంబర్ 10న బెజ్జంకి మండలం హన్మాజీపల్లి గ్రామం నుంచి సిద్దిపేటకు తాగునీరు సరఫరా చేస్తున్న ఇన్‌టెక్‌వెల్ కమ్ పంప్ హౌజ్ నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ



పథకంతో విజయవంతంగా మారుమూల ప్రాంతాలకు కూడా తాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిగారు స్వయంగా తాగునీటి సరఫరా పథకాన్ని అధికారులకు, ఇంజినీర్లకు విశ్లేషించారు. ఈ పథకం నిర్మాణానికి తాను వ్యక్తిగతంగా ఎంతో శ్రమ పడినట్లు తెలిపారు. సిద్దిపేట నియోజకవర్గంలోని ఈ వాటర్ గ్రిడ్ ద్వారా 180 గ్రామాలకు తాగునీటిని అందించగలిగామని వివరించారు.

ఈ పథకం ద్వారా కొమటి చెరువును ఒక అందమైన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయగలిగామని తెలిపారు. సిద్దిపేట, నంగునూర్, చిన్నకోడూర్ సెగ్మెంట్లుగా విభజించినట్లు వివరించారు. పక్కనే ఉన్న మైలారం గుట్టలో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను ఎత్తున నిర్మించడం ఈ ప్రాజెక్టు యొక్క ప్రత్యేకత అని తెలిపారు. ఈ ప్రాజెక్టు సాంకేతికత అంశాల గురించి వారికి తెలిపారు. సిద్దిపేట ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నాగేశ్వరరావు తాగునీటి సరఫరా గురించి ముఖ్యమంత్రికి వివరించారు.

ప్రిన్సిపల్ సెక్రటరీ రేమండ్ పీటర్, ముఖ్యమంత్రి సహాయ కార్యదర్శి స్మితా సబర్వాల్, జిల్లా కలెక్టర్ యం. వీరబ్రహ్మయ్య, నీటి పారుదల శాఖ ఇంజనీర్లు, జిల్లా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

- సి.ఎం.పి.

# 6 నెలల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాలన సమీక్ష కోసం అవసరమయ్యే అంశాలు



తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఇప్పటికి 6 నెలలు అయింది. ఈ క్రమంలో రాష్ట్ర పురోగతి కొరకు ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్‌ గారు అనేకమైన కీలక నిర్ణయాలను తీసుకున్నారు. అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకొని సమగ్ర సంక్షేమానికి వేసిన అడుగులు ఈ క్రింది విధంగా వివరిస్తున్నాం.

### రైతుల పంట రుణాల మాఫీ రూ. లక్ష

టిఆర్‌ఎస్‌ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలోని రైతులందరికీ రూ. లక్ష లోపు పంట రుణాలను మాఫీ చేసింది. రూ. 17 వేల కోట్ల రూపాయల వరకు రుణ మాఫీ జరుగుతుంది. ఇందులో మొదటి విడతగా రూ. 4250 కోట్లను విడుదల చేశారు. దీనితో బ్యాంకర్లు రైతులకు రుణాలను రీషెడ్యూల్‌ చేశారు.

### ఇన్‌పుట్‌ సబ్సిడీ అందించడం

పంట రుణాలను మాఫీ చేయడమే కాకుండా, రైతులకు చెల్లించాల్సిన బకాయిలను కూడా ప్రభుత్వం చెల్లించింది. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో రైతులకు ఇవ్వాల్సిన ఇన్‌పుట్‌ సబ్సిడీని విడుదల చేసింది. వడగండ్లు, భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం కూడా అందించింది. ఇందుకోసం ప్రభుత్వం దాదాపు 480 కోట్ల రూపాయలు విడుదల చేసింది.

### దళితులకు మూడెకరాల భూ పంపిణీ

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి దళితుల అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టినప్పటికి ఆశించిన ఫలితాలు దళితుల అభివృద్ధిలో జరగలేదు. కాని ఇప్పటికి 90 శాతం మంది దళితులు నిరుపేదలగానే వున్నారు. దీనికోసం ముఖ్యమంత్రి కెసిఆర్‌ దళితులకు మూడెకరాల భూ పంపిణీ చేయాలని నిర్ణయించుకున్నారు. ప్రతి దళిత కుటుంబానికి మూడెకరాల భూమి వుండాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ భూమిలో బోరు, మోటారు, కరెంట్‌ సదుపాయంలాంటి వసతులు కూడా కల్పిస్తున్నది. ఆగష్టు 15న ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. రాష్ట్ర బడ్జెట్‌లో కూడా ప్రత్యేక కేటాయింపులు చేయాలని నిర్ణయించారు. దళితులకు భూ పంపిణీ కార్యక్రమం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని తెలియజేశారు. జిల్లా కలెక్టర్లు ఈ కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

### కాంట్రాక్టు ఉద్యోగల క్రమబద్ధీకరణ

ఎన్నో సంవత్సరాలైనా ప్రభుత్వ కార్యక్రమాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్‌ చేస్తామని ఎన్నికల సందర్భంగా టిఆర్‌ఎస్‌ హామీనిచ్చింది. కాంట్రాక్ట్‌ ఉద్యోగులు గత ప్రభుత్వాలకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్‌ చేయలేదు. కాని టిఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్‌ చేయాలని నిర్ణయించారు.

### అమరవీరుల కుటుంబాలకు చేయూత

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు త్యాగం చేసిన అమర వీరుల కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి విడతగా 462 మంది అమర వీరుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నది.

### ఉద్యమ కారులపై కేసుల ఎత్తివేత

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రజాస్వామ్యయుతంగా, శాంతియుతంగా పోరాడుతున్న ఉద్యమకారులపై అప్పటి సీమాంధ్ర ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించింది. కేసుల ఎత్తివేత కోసం ఎన్నోసార్లు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా న్యాయం జరగలేదు. వేధింపులు ఎక్కువయ్యాయే తప్ప తక్కువ కాలేదు. తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమం సందర్భంగా ఉద్యమకారులపై నమోదయిన కేసులన్నింటిని మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

### ఉద్యోగులకు తెలంగాణ ఇంక్రిమెంట్‌

తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించి సకల జనుల సమ్మెలాంటి అద్భుత పోరాటాలు చేసిన ఉద్యోగులను కడుపులో పెట్టుకుని చూసుకుంటామని టిఆర్‌ఎస్‌ మాట ఇచ్చింది. దాని ప్రకారమే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే ప్రభుత్వ ఉద్యోగులందరికి స్పెషల్‌ తెలంగాణ ఇంక్రిమెంట్‌ ప్రకటించింది. తద్వారా తెలంగాణ ఉద్యోగులు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు.

### రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సెంట్రల్‌ స్కేల్‌

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ సెంట్రల్‌ గవర్నమెంట్‌ వేతనాలతో సమానంగా జీతాలు ఇవ్వాలని నిర్ణయించింది. దీనివల్ల తెలంగాణ ఉద్యోగుల కుటుంబాల్లో జీవన ప్రమాణాలు పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది.

### ఎంప్లాయ్‌ ఫ్రెండ్లీ గవర్నమెంట్‌

చీటికి మాటికి ఉద్యోగులను వేధించే సంకుచిత బుద్ధిని తెలంగాణ ప్రభుత్వం ప్రదర్శించకూడదని నిర్ణయించుకుంది. తెలంగాణలో ఎంప్లాయ్‌ ఫ్రెండ్లి గవర్నమెంట్‌ నడుస్తుంది. తరచు బదిలీలు వుండవు. ప్రత్యేక పరి స్థితుల్లో తప్ప ఉద్యోగులను రెండేళ్ళ వరకు బదిలీ చేయవద్దని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా ఆశించిన ఫలితాలను పొందవచ్చు.



## గల్ఫ్ బాధితులకు ప్యాకేజి

పుట్టి పెరిగిన ఊర్లో పని దొరకని దుర్భర పరిస్థితుల్లో, కుటుంబాన్ని పోషించుకోవడం కోసం గల్ఫ్ లాంటి దేశాలకు వెళ్లిన తెలంగాణ బిడ్డలు ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కుంటున్నారు. వారిని ఆదుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం కృత నిశ్చయంతో వుంది. అందుకే అలాంటి ఎన్ఆర్ఐల కోసం కేరళ తరహా ప్యాకేజిని తెలంగాణ ప్రభుత్వం అందిస్తోంది. అక్కడ కష్టాలు పడుతున్న వారికి అన్ని విధాల ప్రభుత్వం అండగా వుంటోంది.

## సేఫ్ అండ్ స్మార్ట్ సిటీగా హైదరాబాద్

హైదరాబాద్ తెలంగాణ గుండెతో సమానమని సగర్వంగా చాటుకున్నాం, అలాంటి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ కాపాడటానికి తెలంగాణ ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకొంటున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నగర ప్రజలు సుఖంగా, ప్రశాంతంగా జీవనం గడిపేందుకు, ఇక్కడ ఉద్యోగులు, మహిళలు ఎలాంటి భయాలు లేకుండా విధులు నిర్వర్తించేందుకు శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతోంది. హైదరాబాద్ నగరంలోని ప్రతి మూలను 24 గంటల పాటు పర్యవేక్షించేందుకు నిఘా కెమెరాలు పనిచేస్తున్నాయి. ప్రజల భాగస్వామ్యంతో నిఘా వ్యవస్థను పటిష్టపరుస్తున్నారు. సిసి కెమెరాల సంఖ్యను ఇంకా బాగా పెంచుతున్నారు.

## హైదరాబాద్‌లో పోలీస్ వ్యవస్థ ఆధునీకరణ

హైదరాబాద్‌లో పోలీస్ వ్యవస్థను పటిష్టపరిచేందుకు, ఆధునీకరించేందుకు సరైన చర్యలు తీసుకున్నారు. జిపిఎస్ , ఇంటర్నెట్‌తో కూడిన ల్యాప్‌టాప్, ఇతర ఆధునిక వసతులతో కొత్త వాహనాల కొనుగోలుకు 350 కోట్ల రూపాయల నిధులు విడుదల చేసింది. 3600 మంది ఉద్యోగుల నియామకానికి కూడా ప్రభుత్వం అనుమతినిచ్చింది.

## నగరంలో టాస్క్ ఫోరస్‌లు

హైదరాబాద్ నగరంలో మహిళలపై, మహిళా ఉద్యోగులు, యువతల పై అఘాయిత్యాలు జరుగకుండా అరికట్టేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు. నగరంలోని అన్నివైపులా ఈ టాస్క్‌ఫోర్స్ కార్యకలాపాలు వుంటాయి. వాటిని కమీషనరేట్‌లో ప్రత్యేకంగా మానిటరింగ్ విభాగాన్ని చేస్తున్నారు.

## వైఫై నగరంగా హైదరాబాద్

హైదరాబాద్ నగరాన్ని వైఫై నగరంగా మార్చేందుకు ప్రైవేటు కంపెనీలతో కలిసి ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. త్వరలోనే హైదరాబాద్ నగరం 4 జి వైఫై నగరంగా మారుతుంది. హైదరాబాద్‌ను ఐటి ఇంక్యుబేటర్‌గా మార్చడానికి శరవేగంగా ప్రయత్నాలు సాగుతున్నాయి.

## వుమెన్ ప్రొటెక్షన్ మిషన్

మహిళలు, బాలికల భద్రత, రక్షణ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నది. మహిళల సమస్యలను అధ్యయనం చేయడానికి సీనియర్ ఐఎఎస్ అధికారిణి పూనం మాలకొండయ్య నేతృత్వంలో సెప్టెంబర్ 2న ఏర్పాటైన కమిటీ వివిధ శాఖల అధికారులతో, వర్గాలతో సంప్రదించింది. స్వచ్ఛంధ సంస్థలు, స్వయం సహాయక బృందాలు, టీచర్లు, విద్యార్థులు, ఐటి ఉద్యోగులు, సంఘటిత, అసంఘటిత కార్మికులు, మీడియా ఉద్యోగులు సాధారణ గృహిణుల నుండి అభిప్రాయాలు సేకరించింది. గుజరాత్, కేరళ రాష్ట్రాల్లో పర్యటించి అక్కడ ప్రభుత్వాలు మహిళల కోసం చేసిన చట్టాలు, కార్యక్రమాలను అధ్యయనం చేసింది. తెలంగాణ రాష్ట్రంలో తక్షణం అమలు చేయడానికి 77 ప్రతిపాదనలు చేసింది.

త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి, చట్టసభల సభ్యులు, స్థానిక సంస్థల ప్రతినిధులతో సమావేశం అవుతారు. ఈ కమిటీ ఇచ్చిన మధ్యంతర నివేదిక ప్రకారం ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు చర్యలు ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళల భద్రతకు అత్యంత కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించారు. మహిళా ఉద్యోగులకు ఏదైనా అన్యాయం జరిగితే సంబంధిత శాఖాధిపతులే బాధ్యత వహించేలా ఉత్తర్వులు జారీచేయనున్నారు.

పభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో మహిళల కోసం లంచ్ రూములు, టాయిలెట్లు తప్పనిసరిగా వుండాలని నిర్ణయించారు. పోలీసుల్లో కూడా 33 శాతం మంది మహిళలే వుండే విషయాన్ని పరిశీలిస్తున్నారు. సినిమాల్లో, టీవిల్లో మహిళలను అవమానించే, అసభ్యంగా చూపించే దృశ్యాలను నియంత్రించేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రతి శాఖలో మహిళల కోసం గ్రీవియన్స్ సెల్ ఏర్పాటు చేయాలని, రాష్ట్రస్థాయిలో కూడా ఇలాంటి సెల్ నెలకొల్పాలని నిర్ణయించారు.

సిటీ బస్సుల్లో మహిళలంతా ప్రత్యేకంగా ఒకవైపు కూర్చొనే విధంగా బస్సు మధ్యలో గ్రిల్స్ ఏర్పాటు చేశారు. ప్రస్తుత చట్టాలను పరిశీలించి అవసరమైతే మరికొన్ని కొత్త చట్టాలను కూడా తీసుకు రావాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. రాష్ట్రస్థాయిలో ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఏర్పాటు చేసి దాని కోసం ఒక ప్రత్యేక భవనం కేటాయించాలని నిర్ణయించారు.

మహిళల భద్రత, మహిళలకు సంబంధించిన సమస్యల సత్వర పరిష్కారానికి 24 గంటలు పనిచేసే 181 టోల్‌ఫ్రీ నంబరుతో హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ఈవ్ టీజింగ్ అరికట్టేందుకు గాను ఈవ్ టీజర్లకు కౌన్సిలింగ్ నిర్వహించడం, అలాగే ఈవ్ టీజర్ల తల్లిదండ్రులకు, కళాశాల యాజమాన్యాలకు కూడా లేఖలు రాయాలని నిర్ణయించారు. హైదరాబాద్‌తో పాటు వివిధ నగరాలు, పట్టణాల్లో 'షి' ఆటోలు, ట్యాక్సీలు నడపాలని, మహిళా డ్రైవర్లకు 50 శాతం సబ్సిడీపై వాహనాలను సమకూర్చాలని నిర్ణయించారు.

## సింగిల్ విండో పారిశ్రామిక విధానం

తెలంగాణ ఆర్థికాభివృద్ధి, తెలంగాణలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచడానికి పరిశ్రమలు రావలసిన అవసరం వుంది. దేశ విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు తెలంగాణ మరియు హైదరాబాద్‌ల మీదు ఆసక్తి కలిగే విధంగా అద్భుత పారిశ్రామిక విధానాన్ని ప్రభుత్వం సిద్ధం చేసింది. పరిశ్రమలకు అనుమతులిచ్చేందుకు పూర్తి పారదర్శక, సరళమైన అవినీతి రహిత విధానాలను ప్రభుత్వం అనుసరిస్తుంది.

సింగిల్‌విండో సిస్టం ద్వారా అనుమతులిస్తుంది. ఇందుకోసం ముఖ్యమంత్రి గారి కార్యాలయంలోనే స్పెషల్ చేజింగ్ సెల్ ఏర్పాటవుతుంది. పారిశ్రామికవేత్తలు అనుమతుల కోసం కార్యాలయాలకు తిరగకుండా, వారికి కావలసిన భూమి, నీరు, కరెంట్, ఇతర మౌలిక సదుపాయాలన్ని సిద్ధం చేసి, అనుమతులు కూడా టిఎస్ఐఐసి ద్వారా తీసుకుని పరిశ్రమలకు కావల్సిన ఏర్పాట్లన్ని ప్రభుత్వమే చేస్తుంది.

## ఇండస్ట్రియల్ లాండ్ బ్యాంక్

తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకు దాదాపు 5 లక్షల ఎకరాల భూమితో ప్రభుత్వం లాండ్ బ్యాంక్ ఏర్పాటు చేస్తుంది. ఆ భూమిని టిఎస్ఐఐసికి కేటాయించి, పారిశ్రామికవాడలను ఏర్పాటు చేస్తుంది. అందులో మౌలిక సదుపాయాల కల్పన, టౌన్‌షిప్పుల ఏర్పాటు తదితర కార్యక్రమాలను కూడా టిఎస్ఐఐసి పర్యవేక్షిస్తుంది.

## విశ్వనగరంగా హైదరాబాద్

హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక సిద్ధం అవుతోంది. కిక్కిరిసిన జనాభాతో హైదరాబాద్ నగరంలో బాగా రద్దీ ఎక్కువైపోయింది. ట్రాఫిక్‌జాంలు ఎక్కువయ్యాయి. ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీనిని



అధిగమించడానికి ఐటిఐఆర్ లాంటి ప్రాజెక్టులు కూడా వస్తుండటంతో హైదరాబాద్ నగరాన్ని మరింత సౌకర్యవంతమైన నగరంగా తీర్చిదిద్ద వలసిన అవసరం వుంది. దాదాపు రెండు కోట్ల జనాభా నివసించేందుకు, భవిష్యత్ అవసరాలన్ని తీర్చేవిధంగా హైదరాబాద్ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. ప్లాన్ తయారీ కోసం కన్సల్టెన్సీని నియమించుకోవాలని కూడా నిర్ణయించారు.

## గండిపేట, హిమాయత్‌సాగర్‌ల శుద్ధి

హైదరాబాద్ నగరంలో ప్రజలకు మంచినీరు అందిస్తున్న హిమాయత్‌సాగర్, గండిపేట చెరువులు కాలుష్య కోరల్లో చిక్కుకోకుండా కాపాడాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ చెరువుల్లో ఇప్పటికే కలుషిత నీరు వస్తుండటంతో దాన్ని ఆపడానికి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకొన్నది.

## మైనార్టీ కార్పొరేషన్‌కు రూ. 1000 కోట్లు

మైనార్టీల అభివృద్ధి మాటలకే పరిమితం అవుతోంది. కాని మైనార్టీ వర్గాల్లోని పేదల ఉపాధికి కావలసినంత ప్రోత్సాహం ప్రభుత్వం నుండి అందడం లేదు. అందుకే మైనార్టీ కార్పొరేషన్‌ను బలోపేతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మైనార్టీ కార్పొరేషన్‌కు రూ. 1000 కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించారు. తద్వారా మైనార్టీలకు తగిన ఉపాధి అవకాశాలు పొందే అవకాశం ఉంది.

## వక్ఫ్ బోర్డుకు జ్యుడిషియల్ అధికారాలు

తెలంగాణ రాష్ట్రంలో ఈ రోజు ఇంత ప్రభుత్వ భూమి ఉందంటే అది నిజాం పాలకుల చలవే. ముస్లిం మైనార్టీల కోసం కూడా అప్పుడే కొంత భూమిని కేటాయించారు. ఇలా వక్ఫ్ భూములుగా చాలా స్థలం వుంది. కాని సీమాంధ్ర పాలనలో వక్ఫ్ ఆస్తులన్నీ అన్యాక్రాంతం అయిపోయాయి. పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తలు, స్వార్ధపరులు వక్ఫ్ ఆస్తులు కొల్లగొట్టారు. వక్ఫ్‌బోర్డు ఉన్నప్పటికీ దానికి అధికారాలు లేకపోవం వల్ల నామమాత్రంగా మిగిలిపోయింది. అందుకే వక్ఫ్ భూముల రక్షణకు ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాటు చేస్తోంది. కొత్తగా వక్ఫ్ ట్రిబ్యునల్ కూడా ఏర్పాటు చేస్తున్నారు.

## ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్

అన్ని వర్గాలకు వారి జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ దక్కాలనేది తెలంగాణ ప్రభుత్వం ఉద్దేశ్యం. తెలంగాణలో ముస్లింలు వారి జనాభాకు అనుగుణంగా అవకాశాలు పొందడం లేదు. అందుకే తెలంగాణలో ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఈ విషయంలో న్యాయపర, ఇతర అంశాలను అధ్యయనం చేయడానికి రిటైర్డ్ జడ్జ్ నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేస్తోంది.

## ముస్లిం వధువు కోసం షాదీ ముబారక్

పేదరిక కుటుంబంలో ఉన్న ముస్లిం అమ్మాయిల వివాహం కోసం అయ్యే ఖర్చు పెనుభారంగా మారుతుంది. ఈ విషయాన్ని గమనించి రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం వధువుకు రూ. 51 వేల ఆర్థిక సహాయం అందించే 'షాదీ ముబారక్' అనే పథకాన్ని ప్రారంభించారు.

## గ్రామ పంచాయతీలుగా గిరిజన తండాలు

గిరిజన తండాలు, ఆదివాసి గూడేలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా గుర్తించమని గిరిజన సోదరులు ఎన్నో ఏళ్ల నుంచి పోరాటం చేస్తున్నారు. ధర్నాలు, రాస్తారోకోలు ఎన్నో చేశారు. వివిధ రూపాలలో ఉద్యమించారు. అన్ని రాజకీయ పార్టీలను వేడుకున్నారు. అయినా వారికి న్యాయం జరగలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలోని గిరిజన తండాలు, ఆదివాసి గూడేలను గ్రామ పంచాయతీలుగా మార్చాలని నిర్ణయం తీసుకున్నారు.

## ఎస్టీలకు 12 శాతం రిజర్వేషన్

నాగరిక ప్రపంచానికి దూరంగా, మౌలిక సదుపాయాలు కూడా లేకుండా రాష్ట్రంలో ఎస్టీలు వున్నారు. అలాంటి ఎస్టీల ఉపాధి, ఉద్యోగ అవకాశాలను పెంచడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇప్పటికే ఎస్టీకులాల్లో ఉన్నవారితో పాటు వాల్మీకి బోయ కులస్తులను కూడా ఎస్టీల్లో కలపాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందరికి కలిపి 12 శాతం రిజర్వేషన్ కల్పించి వారికి విద్య, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచాలని ముఖ్యమంత్రి దృఢసంకల్పంతో వున్నారు.

## మైదాన ప్రాంత గిరిజనుల కోసం ఐటిడిఏ తరహా పథకాలు

రాష్ట్రంలో ముఖ్యంగా రెండు రకాల ఎస్టీలున్నారు. కొండకొనల్లో నివసించే తెగలు కొన్నయితే, మరికొన్ని మైదాన ప్రాంతాల్లో ఉంటున్నాయి. అందరూ షెడ్యూల్డ్ ట్రైబ్స్ పరిధిలోకి వచ్చినప్పటికి రాజ్యాంగం కొన్ని ప్రాంతాలను మాత్రమే షెడ్యూల్డు ప్రాంతాలుగా గుర్తించింది. దీనివల్ల ఐటిడిఏ పథకాలు ఆ ప్రాంతాల వారికే దక్కుతున్నాయి. మైదాన ప్రాంత గిరిజనుల కోసం మరో ప్రత్యామ్నాయం లేదు. అందుకే మైదాన ప్రాంత గిరిజనుల కోసం ఐటిడిఏ తరహా కార్యక్రమాలను ప్రభుత్వం రూపొందిస్తున్నది.

## కళ్యాణ లక్ష్మి

ఆడపిల్ల పుట్టిందనగానే కన్నవారు వారి పెళ్లి ఎలా చేయాలా అని బాధపడే రోజులివి. ముఖ్యంగా దళిత, గిరిజన కుటుంబాల్లో ఆడపిల్లల పెళ్లిళ్లు చేయలేక, ఆడపిల్ల పుట్టగానే చంపేసే దుర్భర పరిస్థితులున్నాయి. అందుకే దళిత, గిరిజన ఆడపిల్లల పెళ్లికి 51 వేల రూపాయల ఆర్థిక సాయం చేయాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు నిర్ణయించి, కళ్యాణలక్ష్మి అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. భారతదేశ చరిత్రలో ఇంతవరకు ఇలాంటి పథకం ఏ రాష్ట్రంలో కూడా అమలు కాలేదు. ఇంతటి గొప్ప కార్యక్రమం తెలంగాణలోనే అమలవుతుండడం మనందరికి గర్వకారణం. ముఖ్యంగా నిరుపేద దళిత, గిరిజన కుటుంబాల భారం తగ్గడం మనందరికీ ఆనందకరమైన విషయం.

## ఆటోలు, ట్రాక్టర్లపై ట్యాక్స్ రద్దు

నిరుపేద, మధ్య తరగతి నిరుద్యోగ యువకులు ఉపాధి కొరకు ఆటోలు నడుపుతూ జీవిస్తున్నరు. వారు రోజు సంపాదించే సంపాదన పన్నులు చెల్లించడానికి సరిపోతుంది. దీన్ని గమనించిన ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపించి, ఆటోరిక్షాలపై విధిస్తున్న రవాణా పన్నును రద్దు చేశారు. వ్యవసాయానికి ఉపయోగించే ట్రాక్టర్లపై కూడా రవాణా పన్ను మినహాయించారు. గతంలో వున్న 76 కోట్ల రూపాయల బకాయిలను కూడా రద్దు చేశాయి.

## పెన్షన్ల పెంపు

వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఇచ్చే పెన్షన్ ఏ మాత్రం సరి పోవడం లేదని, దాన్ని పెంచాలని టిఆర్ఎస్ పార్టీ గతంలో డిమాండ్ చేసింది. కాని ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు. అందుకే టిఆర్ఎ-స్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పెన్షన్లు పెంచుతామని ఎన్నికల సమయంలో కేసిఆర్ ప్రకటించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి వృద్ధులు, వితంతువులకు 1000 రూపాయలు, వికలాంగులకు 1500 రూపాయల పెన్షన్ ఇవ్వాలని నిర్ణయించింది. వికలాంగులకు సరిఫికెట్లు ఇవ్వడానికి ఏరియా ఆసుపత్రులలో వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేస్తారు.

## విద్యార్థుల కోసం ఫాస్ట్

తెలంగాణ పిల్లలు ఆర్థిక స్థోమత లేకపోవడం వల్ల మంచి చదువులకు దూరం కాకూడదనే ఉద్దేశ్యంతో 'అసిస్టెన్స్ ఫర్ స్టూడెంట్స్ ఆఫ్ తెలంగాణ' (ఫాస్ట్) పేరుతో కొత్త పథకాన్ని ప్రారంభించారు. వృత్తి విద్య, ఉన్నత విద్యను అభ్యసించే పేద విద్యార్థుల భారాన్ని ప్రభుత్వమే మోస్తుందని సగర్వంగా ప్రకటించారు.

## హైదరాబాద్ కల్లు దుకాణాల పునరుద్ధరణ

లిక్కర్ మాఫియా ఒత్తిళ్లకు తలొగ్గి గత ప్రభుత్వాలు కల్లు గీత కార్మికుల పై కక్ష గట్టాయి. హైదరాబాద్‌లో కల్లు దుకాణాలను మూసి వేయించారు. దీనివల్ల గీత కార్మికుల కుటుంబాలు బాగా నష్టపోయాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దసరా పండుగ నుండి హైదరాబాద్‌లో కల్లు దుకాణాలు పునరుద్ధరించింది.

## ఆర్ఎంపి, పిఎంపిలకు ప్రభుత్వ గుర్తింపు

గ్రామాలలో ప్రజలకు అందుబాటులో వుంటూ వైద్యం అందించే ఆర్ఎంపి, పిఎంపిలు అనేక అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. వారి గౌరవం పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. వీరికి ప్రభుత్వం ద్వారా శిక్షణనివ్వాలని, శిక్షణ పూర్తి కాని వారికి శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## క్రీడలు, క్రీడాకారులకు ప్రోత్సాహం

రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం సమగ్ర క్రీడా విధానాన్ని రూపొందిస్తుంది. క్రీడాకారులు అంతర్జాతీయ క్రీడలలో పాల్గొనడానికి ఆర్థిక ఇబ్బందులు కూడా వస్తున్నాయి. కాబట్టి అంతర్జాతీయ క్రీడలలో పాల్గొనే వారికి మూడు లక్షల రూపాయలు ఖర్చుల కోసం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

అంతర్జాతీయ పోటీలో స్వర్ణ పథకం సాధించిన వారికి 50 లక్షల రూపాయలు, రజత పథకం సాధించిన వారికి 25 లక్షల రూపాయలు, కాంస్య పథకం సాధించిన వారికి 25 లక్షల రూపాయల నగదు ప్రోత్సాహం ఇవ్వాలని విధానపరమైన నిర్ణయం తీసుకున్నాం. పథకాలు సాధించిన క్రీడాకారుల కోచ్‌లకు కూడా క్రీడాకారులతో సమానంగా నగదు ప్రోత్సాహం ఇవ్వాలని నిర్ణయించారు.

## ఎవరెస్ట్ విజేతలకు నగదు ప్రోత్సాహం

ఎవరెస్ట్ శిఖరం అధిరోహించి తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన గిరిజన,దళిత బిడ్డలు పూర్ణ మరియు ఆనంద్‌లకు చెరో 25 లక్షల రూపాయల చొప్పున నగదు ప్రోత్సాహం కూడా ప్రభుత్వం అందించింది. వారికి నగదు ప్రోత్సాహం అందించడంతో పాటు, గోల్కొండ కోటలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఆనంద్ చెంపపై ముద్దు పెట్టుకుని యావత్ దళిత జాతి పొంగిపోయేట్లు చేశారు. ఈ ఇద్దరు పిల్లల కోచ్ శేఖర్‌కు కూడా రూ. 25 లక్షల నగదు ప్రోత్సాహం అందించారు.

## మన ఊరు- మన ప్రణాళిక

ప్రభుత్వ కార్యక్రమాలు హైదరాబాద్‌లో కూర్చొని తయారు చేయడం వల్ల అనుకున్న ఫలితాలు రావడం లేదని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు భావించారు. అందుకే ఎవరి ఊరి ప్రణాళిక వారు తయారు చేయాలని, ఎవరి మండలం ఎలా వుండాలో ఆ మండలం వారే నిర్ణయించుకోవాలని కేసిఆర్ ఆలోచన. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా మన ఊరు-మన ప్రణాళిక కార్యక్రమం నిర్వహించారు. అందులో వచ్చిన ప్రణాళికలు, సూచనల ప్రకారమే నిధుల విడుదల, రాష్ట్ర ప్రణాళిక తయారీ వుంటుంది. ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికలు రూపొందించడం ఇదే మొదటిసారి.

పైన పేర్కొన్న పథకాలే కాకుండా మరిన్ని సంక్షేమ పథకాలను రూపొందిస్తూ బంగారు తెలంగాణ నిర్మాణ దిశగా మన రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

## తెలంగాణకు హరిత హారం

తెలంగాణాలో గ్రీన్ కవర్ పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ పచ్చదనం 230 కోట్ల మొక్కలు పెంచాలని నిశ్చయించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో సగటున 40 లక్షల మొక్కలు పెంచాలని నిర్ణయించారు. ఇందుకోసం గ్రామాలలోనే నర్సరీలు ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే రెండేళ్ళ ప్రణాళికల రూపొందించి దాని ప్రకారం మొక్కల పెంపకం చేపడతారు.

## రాష్ట్ర స్థాయి సలహా మండలి

మేధావులు, నిపుణులు, అనుభవజ్ఞుల సలహాలు, సూచనలు తీసుకొనేందుకు రాష్ట్ర స్థాయిలో స్టేట్ అడ్వయిజరీ కౌన్సిల్ ఏర్పాటు చేస్తున్నారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, నిష్ణాతులు వుండే ఈ మండలి సూచనలను, సిఫార్సులను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వ పాలన సాగించాలని ముఖ్యమంత్రి కేసిఆర్ నిర్ణయించారు.

## సమగ్ర సామాజిక, ఆర్థిక సర్వే

ప్రభుత్వం వద్ద సరైన లెక్కలు లేకపోవడం వల్లే ప్రభుత్వ పథకాల ాదుర్వినియోగం అవుతున్నాయి. రేషన్‌కార్డులు, గృహనిర్మాణం, పెన్షన్లు ఇంకా ఇతర పథకాల్లో అవినీతికి కూడా ఇదే కారణం. దీనిని దృష్టిలో పెట్టుకొని తెలంగాణలో ఎవరి పరిస్థితి ఎలా వుంది అని తెలుసుకోవడం కోసం ఆగష్టు 19న రాష్ట్రంలో ప్రతి కుటుంబంలో సమగ్ర, సామాజిక, ఆర్థిక 'ఇంటింటి సర్వే' చేపట్టారు. ఒకే రోజు తెలంగాణ అంతటా ఈ సర్వే జరిగింది.

## పవర్‌లూమ్ కార్మికులకు రుణాలు మాఫీ

రైతులతో పాటు, ఆత్మహత్యలు ఆశ్రయించాల్సిన దుర్భర పరిస్థితుల్లో బతుకుతున్న మరో కుల వృత్తిదారులు పవర్‌లూమ్ కార్మికులు. కార్మికులను ఆదుకునేందుకు వారికున్న రుణాలను లక్ష రూపాయల వరకు మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## దళిత మైనార్టీలకు ఉప ముఖ్యమంత్రి పదవులు

తెలంగాణ రాష్ట్రంలో దళితులు, మైనార్టీలకు సరైన గుర్తింపు, గౌరవం, అవకాశాలు దక్కాలన్నది ప్రభుత్వం ఉద్దేశ్యం. అందుకే చరిత్రలో ఎన్నడూ లేని విధంగా దళిత, మైనార్టీలకు ఉప ముఖ్యమంత్రి పదవులు ఇచ్చారు.

## ఎస్సీ, ఎస్టీలకు నేరుగా నిధులు

ఎస్సీ, ఎస్టీలకు వారి జనాభా ఆధారంగా నిధులు కేటాయించాలని రాజ్యాంగం నిర్దేశించింది. అందుకే గత ప్రభుత్వాలు ఈ విషయంలో చిత్తశుద్ధితో వ్యవహరించలేదు. ఎస్సీ, ఎస్టీల పేరుతో నిధులు కేటాయించి, వాటిని వివిధ శాఖలకు పంపేవారు. అట్లా కేటాయించిన నిధులను ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి, సంక్షేమం కోసం ఖర్చు చేయకుండా వేరే రంగాలు, పనుల కోసం ఆ నిధులను మళ్లించారు.ు.

తెలంగాణ ప్రభుత్వం ఈ విషయంలో సమూల మార్పులు చేసింది. ఎస్సీ, ఎస్టీలకు బడ్జెట్‌లో ఎంత బడ్జెట్ కేటాయిస్తారో, ఆ నిధులన్నీ నేరుగా ఎస్సీ, ఎస్టీ డెవలప్‌మెంట్ శాఖకే వెళ్తుంది. దీనివల్ల నిధుల మళ్ళింపు జరుగదు. ఎస్సీల కోసం తయారు చేసే పథకాలు, కార్యక్రమాలు కూడా గ్రామీణ ప్రాంతాలు, అర్బన్ ప్రాంతాలు, సెమి అర్బన్ ప్రాంతాలకు వేరువేరుగా వుంటాయి.

## ముఖ్యమంత్రి ఆధ్వర్యంలోనే సంక్షేమ శాఖలు

గత చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అన్ని వర్గాల సంక్షేమ మంత్రిత్వ శాఖలను ముఖ్యమంత్రి స్వయంగా నిర్వహిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మహిళా, మైనార్టీ, వికలాంగుల సంక్షేమం కోసం గతంలో ఎన్నో పథకాలు తీసుకు వచ్చినా అవేవి సత్ఫలితాలను ఇవ్వలేదు. అందుకే వారి సంక్షేమాన్ని ముఖ్యమంత్రి ఓ సవాలుగా స్వీకరించారు. స్వయంగా తానే ఆ బాధ్యతలు భుజాన వేసుకున్నారు.

## ఎస్సీ, ఎస్టీ, బిసిలకు మార్కెట్ కమిటీల్లో రిజర్వేషన్లు

గత చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మార్కెట్ కమిటీలలో ఎస్సీ, ఎస్టీ, బిసిలకు మార్కెట్ కమిటీలలో రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## ఎస్సీ, ఎస్టీ, బిసి స్టడీ సర్కిల్స్

యూపిఎస్సీ, టిఎస్‌పిఎస్సి లాంటి పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడం పేద విద్యార్థులకు భారంగా మారింది. పైగా మంచి శిక్షణకు హైదరాబాద్‌లో తప్ప ఇతర చోట్ల స్టడీ సర్కిళ్లు లేవు. అందుకే ప్రభుత్వం జిల్లా స్థాయిలోనే ఎస్సీ, ఎస్టీ, బిసి లకు స్టడీ సర్కిల్లు ఏర్పాటు చేయాలని సంకల్పించింది.

## బిసిలకు చట్ట సభల్లో రిజర్వేషన్

జనాభా నిష్పత్తి ప్రకారం అన్ని వర్గాలకు అవకాశాలు రావాలనేది టిఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యం. రాజ్యాంగం ప్రకారం ఎస్సి, ఎస్టీలకు జనాభా నిష్పత్తి ప్రకారం చట్టసభల్లో రిజర్వేషన్ వుంది. కాని బిసిలకు రిజర్వేషన్ లేదు. దీనికోసం పార్లమెంటులో చట్టం చేయాలి. బిసిలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలనే విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోంది. దీనికోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నది.. పార్లమెంటులో ఈ విషయం ప్రస్తావించింది. ముఖ్యమంత్రి ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు.

## గ్యాంబ్లింగ్ సెంటర్లు, పేకాట క్లబ్బుల మూసివేత

చాలామంది జీవితాలను ఆర్థికంగా చిన్నాభిన్నం చేస్తున్న గ్యాంబ్లింగ్ సెంటర్లు, పేకాట క్లబ్బులను మూసివేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది. హైదరాబాద్ నగరంలో పేకాట క్లబ్బులను ఇప్పటికే మూసివేశారు. జిల్లాల్లో కూడా క్లబ్బుల మూసివేతకు ఉత్తర్వులు వచ్చాయి. తెలంగాణ రాష్ట్రంలో అక్రమదందాలు, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు ఉండకూడదనేది ప్రభుత్వ ఉద్దేశ్యం.

## బడి పిల్లల ప్రదర్శనలు రద్దు

విఐపిలకు స్వాగతం చెప్పడానికి బడి పిల్లలను రోడ్లపైకి తీసుకురావడాన్ని తెలంగాణ రాష్ట్రంలో పూర్తిగా నిషేధించారు. గంటల తరబడి రోడ్లపై నిలబడడం వల్ల అలసటకు గురై అనారోగ్యానికి గురౌతున్నారు అంతేకాకుండా ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. అందుకే తెలంగాణ రాష్ట్రంలో బడి పిల్లలు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకున్నారు.

## నాలుగు నగరాలపై దృష్టి

హైదరాబాద్‌తో పాటు వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్ నగరాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం అన్ని నగరాలకు రింగురోడ్లు, ఇంటర్నల్ రోడ్లు వేయాలని, రాబోయే 30 సంవత్సరాలకు సరిపోయే మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.

*– ఐ&పిఆర్*

ఏ స్థాయిలో జరగాల్సిన పనులు ఆ స్థాయిలోనే జరగడానికి వీలుగా పంచాయతీ రాజ్‌లో మూడంచెల వ్యవస్థను ఏర్పాటు చేసి, ఆయా సంస్థలకు నేరుగా సభ్యులను ఎన్నుకొనే ఏర్పాటు 73వ రాజ్యాంగ సవరణ ద్వారా కల్పించబడింది. (సెక్షన్ 179)

పంచాయతీరాజ్ వ్యవస్థలో జిల్లా స్థాయి అయిన జిల్లా ప్రజాపరిషత్తులు, జిల్లా సమగ్రాభివృద్ధికి నడుంకట్టాలి. ఈ బాధ్యతలను నెరవేర్చడానికి తగిన అధికారాలను చట్టం కల్పించింది. ప్రజాస్వామ్యంలో అధికారాలను సమిష్టిగా ఉపయోగించుకొని సంస్థల బాధ్యతలను నెరవేర్చడంలో జిల్లా ప్రజాపరిషత్ సభ్యులు కీలక పాత్ర వహిస్తారు.

జిల్లా ప్రజాపరిషత్ చేసే ప్రతి కార్యక్రమం మెజారిటీ సభ్యులు నిర్ణయాల మేరకు జరుగుతుంది. జడ్.పి.టి.సి. సభ్యులకు ఈ క్రింది విషయాలలో ముఖ్యపాత్ర ఉంటుంది.

ఏర్పాటు చేసుకొని ఆ ప్రత్యేక విషయాన్ని చర్చించి నిర్ణయాలు తీసుకోవచ్చు. ఈ విధంగా తీసుకొన్న నిర్ణయాలకు చట్టబద్ధత ఉంటుంది.

### జిల్లా ప్రజాపరిషత్ సమావేశాలలో పాల్గొనడం

- ప్రజాస్వామ్య బద్ధంగా జిల్లా ప్రజాపరిషత్ సమావేశంలో జరిగే చర్చలలో చురుకుగా పాల్గొని జిల్లాలోని సమస్యలపై చర్చించి తగిన పరిష్కార మార్గాలు సభ్యుల సహకారంతో కనుగొనవచ్చు. సమావేశాలలో తప్పని సరిగా పాల్గొని నిర్ణయాలను ప్రభావితం చేయవచ్చు.
- సమావేశానికి 6 రోజులు ముందుగానే నోటీసు అందుతుంది. కాబట్టి అజెండాలో విషయాలను కూలంకషంగా తెలుసుకొని, అవసరమైనంత మేరకు సంబంధిత సమాచారాన్ని సేకరించుకొని సమగ్ర అవగాహనతో సమావేశాలకు హాజరు అయ్యి, చర్చలలో పాల్గొని నిర్ణయాలు చేయవచ్చు.
- జిల్లా ప్రజాపరిషత్ కార్యక్రమాలకు సంబంధించిన సమస్యలను

# జిల్లా ప్రజాపరిషత్ ప్రాదేశిక నియోజక వర్గ (జెడ్‌పిటిసి) సభ్యుల విధులు-అధికారాలు

### జిల్లా ప్రజాపరిషత్తు పనులు మొదలగు వాటి గూర్చి సంబంధిత వారి దృష్టికి తీసుకువచ్చే హక్కు (సె. 194)

ఏ సభ్యుడైనను జిల్లా ప్రజాపరిషత్తు చేయవలసిన నిర్మాణపు పనిలో ఏవైనా నిర్లక్ష్యం, ఆస్తి ఏదైనా వ్యర్థమగుటగాని లేదా ఏదేని ప్రాంత అవసరాల ను జిల్లా ప్రజాపరిషత్ ఛైర్‌పర్సన్ లేదా ముఖ్య కార్యనిర్వహణాధికారి దృష్టికి తేవచ్చును మరియు వాటి అభివృద్ధికి తగు సూచనలు చేయవచ్చును.

### జిల్లా ప్రజాపరిషత్ ఛైర్ పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నికలో పాత్ర

జిల్లా ప్రజాపరిషత్ ఛైర్‌పర్సన్, వైస్ పర్సన్‌లకు ఎన్నుకోవటానికి ఎన్నికైన జడ్.పి.టి.సి. సభ్యులు మాత్రమే ఓటు హక్కు కలిగి వున్నారు. అంటే జిల్లా ప్రజాపరిషత్ దిశా నిర్దేశం చేసే టీం లీడర్ల ఎన్నిక బాధ్యత పూర్తిగా జడ్.పి.టి.సి. సభ్యులకు ఇవ్వబడింది. అలాగే మైనారిటీ వర్గానికి చెందిన ఇరువురు సభ్యులను కో-ఆప్ట్ చేసుకునే అధికారం సభ్యులకు ఉంటుంది.

ప్రస్తుతం ఉన్న జిల్లా ప్రజాపరిషత్ పరిపాలన సరిగా లేదని భావించినా, ఛైర్‌పర్సన్ లేదా వైస్ ఛైర్‌పర్సన్ సభ విశ్వాసం కోల్పోయాడని భావించినా ప్రస్తుత నాయకత్వ మార్పును కోరుతూ నిబంధనలకు అనుగుణంగా అవిశ్వాస తీర్మానాలను ప్రవేశపెట్టవచ్చు. అయితే, ఎన్నికైన 4 సంవత్సరాల వరకు అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టటానికి వీలు లేదు (మెమో.నెం. 28499/మం-2-ఎ/2008, తేది.16.03.2009.)

### ప్రత్యేక సమావేశం ఏర్పాటు

ఒక ప్రత్యేక విషయాన్ని గురించి చర్చించాలని భావించినప్పుడు అప్పుడు జిల్లా ప్రజాపరిషత్‌లో గల సభ్యులలో 1/3 వంతు సభ్యులు రాత పూర్వకంగా ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయమని కోరినప్పుడు జిల్లా ప్రజాపరిషత్తు ఛైర్‌పర్సన్ ఏర్పాటు చేయని యెడల సభ్యులందరూ కలిసి సమావేశం

ఎజెండాలో చేర్చటానికి ముందుస్తు తీర్మానాల ప్రతిపాదనలు పంపవచ్చును.

- 15 రోజుల నోటీసుతో ప్రశ్నలను జిల్లా ప్రజాపరిషత్‌కు పంపి, వాటిని సమావేశాలలో చర్చించడం ద్వారా సంస్థలలో జావాబుదారీతనాన్ని తీసుకురావచ్చు.
- 8 రోజుల నోటీసుతో సమావేశాలలో తీర్మానాలను ప్రతిపాదించవచ్చును.
- సమావేశాలలో శాఖల / అధికారుల పనితీరును సమీక్షించవచ్చును.
- ముందస్తు నోటీసుతో జిల్లా ప్రజాపరిషత్ ప్రొసీడింగులను, రికార్డు నకలును పొందవచ్చును. (జి.ఓ.నెం. 224 తేది : 10.4.1995)

### జిల్లా ప్రజాపరిషత్ ఆర్థిక వనరుల నిర్వహణలో

- ఆదాయ వనరులను జాగ్రత్తగా పరిశీలించి, అభివృద్ధి కార్యక్రమాలకు తగు నిధులు కేటాయించడం ద్వారా మంచి బడ్జెట్ రూపకల్పనకు తోడ్పడవచ్చును. ఆ సంవత్సరంలో తాము సాధించదలుచుకొన్న పనులన్నీ బడ్జెట్‌లో ప్రతిబింబిస్తుంటాయి.
- జిల్లా ప్రజాపరిషత్తు ఆదాయ వ్యయాలను మదింపు చేసి, వచ్చిన ఆదాయంతో, ఉన్న వనరులలో ఏఏ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టవచ్చు అనే కీలక నిర్ణయాలు జిల్లా ప్రజాపరిషత్ సమావేశాలలో తీసుకోవలసి ఉంటుంది. ఈ నిర్ణయాలు తీసుకోవడానికి వీలుగా జిల్లా ప్రజాపరిషత్ ఆర్థిక పరిస్థితి గురించి ప్రతి 3 నెలలకు సి.ఇ.ఓ. సభ్యులకు ఒక నిర్ణీత ఆర్థిక నివేదిక అందజేయాలి. వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలి.
- జిల్లా ప్రజాపరిషత్ వ్యవహారాలు ఎలా జరుగుతున్నదీ లోకల్ ఫండ్ ఆడిటరు ప్రతిసంవత్సరం తన నివేదికను జిల్లా ప్రజాపరిషత్‌కు సమర్పిస్తాడు. ప్రతి సభ్యుడు ఈ నివేదికను పరిశీలించి ఎటువంటి లోపాలు జరుగుతున్నాయో గుర్తించి, భవిష్యత్తులో అవి పునరావృతం కాకుండా జిల్లా ప్రజాపరిషత్తు తగు నిర్ణయాలు తీసుకోవాలి.

**వివిధ కమిటీలలో మెంబరుగా**

- ✯ స్థాయి సంఘంలో మెంబరుగా సంబంధిత సంఘం సమావేశాలలో పాల్గొని వివిధ శాఖల పనితీరును సమీక్షించవచ్చును. జిల్లా ప్రజా పరిషత్తుకు సంబంధించిన ఏ రికార్డునైన పరిశీలన కొరకు స్థాయి సంఘం ముందుంచమని కోరవచ్చును. (సెక్షన్ 191)
- ✯ మండల మరియు నియోజక వర్గపు నీటి వినియోగ పరిరక్షణ కమిటీ యందు సభ్యుని హోదాలో నీటి పరిరక్షణకు చర్యలు చేపట్టవచ్చును. (జి.ఓ.నెం. 311 పంచాయతీరాజ్ తేది : 16.8.2003)
- ✯ మండల స్థాయి ఆహార సలహా కమిటీలో సభ్యుడుగా ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా జరుగుటకు, లోపాల సవరణకు తగు సూచనలు చేయవచ్చును. (జి.ఓ.యం.యస్.నెం. 7 (కన్స్యూమర్ ఎఫైర్స్, ఆహారము మరియు పౌర సరఫరా) తేది : 1.2.2006). మండల ఆహార సలహా సమావేశాన్ని ద్వైమాసికంగా రెండవ సోమవారం నాడు నిర్వహించాలి.
- ✯ ఎసైన్‌మెంటు రివ్యూ కమిటీలో సభ్యుడుగా వ్యవహరిస్తారు. జి.ఓ.నెం. 590 రెవెన్యూ (భూ సంస్కరణలు) తేది : 11.11.95, జి.ఓ.నెం. 146 రెవెన్యూ తేది : 5.2.96, 3. జి.ఓ.యం.యస్ నెం. 227 రెవెన్యూ తేదీ 4.3. 96
- ✯ ఎనర్జీ నియోజక వర్గ కమిటీలో సభ్యుడుగా ఉంటాడు. (జి.ఓ.యం.యస్. నెం. 145 ఎనర్జీ (పవం III) తేది : 9.11.95)

**ఇతర అధికారాలు**

- ✯ జడ్.పి.టి.సి. పరిధిలోని మండల ప్రజాపరిషత్ సమావేశంలో శాశ్వత ఆహ్వానితుని హోదాలో పాల్గొని మండల సమస్యలను చర్చించవచ్చును. వీటిని జిల్లా ప్రజాపరిషత్తు దృష్టికి కూడా తీసుకొని వెళ్ళవచ్చును.
- ✯ అన్ని ప్రభుత్వ మరియు జిల్లా ప్రజాపరిషత్ అధికార ఉత్సవాలకు జిల్లా ప్రజాపరిషత్ సభ్యులను ఆహ్వానించాలి. (మెమోనెం. 1289/మండల్సు III/96 తేది : 17-1-96)
- ✯ జిల్లా ప్రజాపరిషత్తు మహిళా సభ్యులకు వసతి గృహాలలో ప్రాధాన్యతా పూర్వక కేటాయింపు జిల్లా ప్రజాపరిషత్ సాధారణ సభ స్థాయి కమిటీ సమావేశాలు జరిగే రోజున జిల్లా ప్రజాపరిషత్ వసతి గృహాలలో వసతి కల్పించటానికి మహిళా సభ్యులకు అత్యధిక ప్రాధాన్యతనివ్వాలి. ఇతర రోజులో వారికి ఎం.ఎల్. ఏ.ల కు ఎం.పి.లకు వసతి కేటాయించిన తరువాత ప్రాధాన్యతనివ్వాలి. (జి.ఓ.యం.యస్.నెం. 117 మండల్సు III తేది : 7-3-1996)
- ✯ జిల్లా ప్రజాపరిషత్ సభ్యులకు గౌరవ భృతి నెలకు రూ. 2,250 లు మరియు సిట్టింగ్ ఫీజ రూ. 150లు చెల్లించబడతాయి (జి.ఓ.యం. ఎస్.నెం. 279, పం.రా గ్రామ. అ, తేది. 17.9.09 జి.ఓ.ఎం.యస్. నెం. 13న8, పి.ఆర్ ఆర్. డి (పం. 4) శాఖ, తేది.17.04.2010) మరియు ప్రయాణ, దిన భత్యములు ఆంధ్రప్రదేశ్ ప్రయాణ భత్యాల నియమావళి, IIIవ భాగంలోని 13(ఎ) నియమానుసారంగా చెల్లించాలని జి.ఓ.ఎం.యస్. నెం. 376, పం.రా. గ్రా. ఆ (మండలర్IIఎ) తేది. 14.12.2004 ద్వారా తెలియజేయడమైనది.
- ✯ **కో ఆప్ట్ చేసుకోబడిన జిల్లా ప్రజాపరిషత్ సభ్యులకు గౌరవ వేతనం :** జడ్.పి.టి.సి. సభ్యులతో సమానంగా కో-ఆప్ట్ చేసుకోబడిన సభ్యులకు కూడా గౌరవ వేతనం మరియు ప్రయాణ భత్యం చెల్లించబడతాయి.
- ✯ **జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలల సందర్శన :** జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలల పరిస్థితులను మెరుగు పరచే ఉద్దేశ్యంతో తమ నియోజక వర్గంలో గల జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలల ను దర్శించి వాటి పరిస్థితిని, విద్యాస్థాయి పెంచేందుకు తగు సలహాలు ఇవ్వటానికి జడ్.పి.టి.సి సభ్యులకు అధికారం ఇవ్వబడినది. (జి.ఓ.యం.యస్ నెం. 285 మండల్స్ III తేది : 4.7.96)
- ✯ **ఆర్.టి.సి. బస్సులలో సీట్ల ప్రాధాన్యత:** అన్ని రకాల బస్సులలో శాసన సభ్యులు, పార్లమెంటు సభ్యులకు ప్రత్యేకించిన 4 సీట్లకు నిర్ణీత గడువులో వారు రానప్పుడు ప్రాధాన్యత ప్రాతిపదికపై జిల్లా ప్రజాపరిషత్ ప్రాదేశిక సభ్యులకు, మండల ప్రజాపరిషత్ సభ్యులకు కేటాయించాలని, శాసన సభ్యులకు పార్లమెంటు సభ్యులకు ప్రత్యేకించినవి కాబట్టి సీట్ల కోసం అడిగినప్పుడు, అందుబాట్లకు లోబడి, వారికి రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని ఆర్.టి.సి. సంస్థ తెలియజేసింది. (ప్రభుత్వ మెమో నెం. 35820 మండల్స్ III తేది : 7.12.1996)

**సెక్రటేరియట్లలో ప్రవేశించుటకు గుర్తింపు కార్డులు**

జెడ్.పి.టి.సి. సభ్యులు, మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు సెక్రటేరియేట్‌లో ప్రవేశించటానికి ఆయా జిల్లా ప్రజాపరిషత్ సి.ఇ.ఓ.లు సంతకం మరియు సీలుతో ఇచ్చిన ఫొటో గుర్తింపు కార్డుల ప్రకారం రిసెప్షన్‌లో పాస్‌లు జారీచేయబడతాయి.

*– సిడిపిఎ*

# అంగన్‌వాడీల్లో పౌష్టికాహార పరిమాణం పెంపు

గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహార పరిమాణాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. ప్రస్తుతం కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు అమలు చేస్తున్న ఒక పూట భోజనం (కోడిగుడ్డు, పాలతో పాటు) పథకాన్ని, పిల్లలకు ఇస్తున్న కోడిగుడ్డును అన్ని అంగన్ వాడీ కేంద్రాలకు విస్తరించింది.

సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసిడిఎస్) సప్లిమెంటరీ న్యూట్రిషన్ ప్రోగ్రామ్ (ఎస్ఎన్‌పీ) క్రింద అన్ని ప్రాజెక్టుల్లో డిసెంబర్ 1 నుంచి మార్చి 31 వరకు ఒకపూట భోజన పథకాన్ని అమలు చేసేందుకు రూ. 94.8 కోట్లను విడుదల చేసింది.

ఈ మేరకు మహిళా, శిశు సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి పూనం మాలకొండయ్య ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 35,973 అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్తిగా నెలరోజుల పాటు గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

దీనిలో భాగంగా గర్భిణులు, బాలింతలకు ఒక పూట భోజనం, 200 మిల్లీలీటర్ల పాలు, ఒక గుడ్డును ప్రతిరోజు అందిస్తారు.

ఆరేళ్లలోపు పిల్లలకు రోజుకు ఒకటి చొప్పున కోడిగుడ్డును నెల రోజుల పాటు అందించేలా చర్యలు తీసుకోనున్నారు.

◆

# మహాత్మాగాంధీ ఉపాధి హామి పథకంలో నర్సరీ పెంపకం - తగిన సూచనలు

**మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 40 లక్షల మొక్కలు రాష్ట్రమంతటా 10 కోట్ల మొక్కలు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో నాటాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడమైనది.**

## నర్సరీ పెంచడానికి అర్హులు

- జాబ్ కార్డు కలిగి వున్న ఎస్సీ/ఎస్టీ చిన్న మరియు సన్నకారు రైతులందరూ అర్హులు.

## నర్సరీ పెంచడానికి కావలసిన పద్ధతులు

- నర్సరీలలో పెంచిన మొక్కలను వర్షాకాలంలో రవాణా చేయుటకు వీలుగా ఉండేలా రోడ్డు పక్కనే నర్సరీ ఉండాలి.
- సంవత్సరం పొడవునా నీరు అందించగల నీటి వసతి ఉండాలి.
- నర్సరీ కోసం ఎంపిక చేసిన నేల వర్షాకాలంలో బురదమయం కాకుండా ఉండాలి.

## నర్సరీలు పెంచే విధానం మరియు నర్సరీ పెంచే రైతులకు చేకూరే ఆదాయం

*నర్సరీ కోసం ఎంపిక చేసిన నేలను శుభ్రం చేయుట.* నర్సరీ కోసం ఎంపిక చేసిన నేలలో రాళ్ళు ఉన్నట్లయితే ఏరివేయాలి. చెత్తను తీసివేయాలి. మరియు ఏవైన పొదలు ఉంటే వేళ్ళతో సహా తొలగించి నేలను చదును చేయాలి.

ఎ) ఆ స్థలంలో ఇంతకు ముందు నర్సరీ పెంచినట్లయితే ఒక బెడ్‌కి రూ. 9.61 , చొప్పున 50 బెడ్స్‌కి రూ. 480 రైతుకు మస్టర్ ద్వారా చెల్లిస్తారు.

బి) ఆ స్థలం కొత్తది అయితే ఒక బెడ్‌కి రూ. 34.84 చొప్పున 50 బెడ్స్‌కి రూ. 1742 రైతుకు మస్టర్ ద్వారా చెల్లిస్తారు.

## పాలిథిన్ సంచులు సేకరించుట

- ఈ సారి నర్సరీ పెంచటానికి 5 X 9 సైజ్ మరియు 200 గేజ్ మందం గల పాలిథీన్ సంచులను ఉపయోగించాలని నిర్దేశించడమైనది.
- పాలిథీన్ సంచులను జిల్లా నీటి యాజమాన్య సంస్థ వారు కొనుగోలు చేసి రైతులకు సరఫరా చేయడం జరుగుతుంది. 50 వేల మొక్కలు పెంచడానికి 5 X 9 సైజు మరియు 200 గేజ్ మందం గల పాలిథీన్ సంచులు 143.4 కిలోలు అవసరం అవుతాయి.

## ఎర్రమట్టి, ఇసుక మరియు పశువుల ఎరువు సేకరించటం

- నర్సరీ స్థలాన్ని శుభ్రం చేసిన వెంటనే రైతులు పాలిథీన్ సంచులలో నింపుటకు అవసరం అయ్యే ఎర్రమట్టి, ఇసుక మరియు పశువుల ఎరువును 3:1:1 పాళ్ళలో సేకరించాలి. అంటే 3 పాళ్లు ఎర్రమట్టి, 1 పాలు ఇసుక మరియు 1 పాలు పశువుల ఎరువు 50 వేల మొక్కలు పెంచటానికి ఎర్రమట్టి 15 ట్రాక్టర్ లోడ్స్, ఇసుక 5 ట్రాక్టర్ లోడ్స్ మరియు పశువుల ఎరువు 5 ట్రాక్టర్ లోడ్స్ అవసరం అవుతాయి.
- 50 వేల నర్సరీలకు సరిపడా ఎర్రమట్టి, ఇసుక మరియు పశువుల ఎరువు సేకరించటానికి రూ. 24000 రైతులకు చెల్లిస్తారు.

## ఎర్రమట్టి, ఇసుక మరియు పశువుల ఎరువు మిశ్రమం తయారుచేసి, పాలిథీన్ సంచులలో నింపి, బెడ్స్‌లో అమర్చడం

- సేకరించిన ఎర్రమట్టి, ఇసుక మరియు పశువుల ఎరువును 3:1:1 నిష్పత్తిలో ఉండేలా మిశ్రమం తయారు చేయాలి. దానిలో ఏమైనా మట్టి గడ్డలు ఉన్నట్లయితే పగలగొట్టాలి. రాళ్ళు ఉన్నట్లైతే జల్లెడ పట్టి మొత్తటి మిశ్రమాన్ని పాలిథీన్ సంచులలో నింపాలి.
- మట్టి మిశ్రమం తయారు చేసి సంచులలో నింపి బెడ్‌లలో అమర్చటానికి ఒక బెడ్‌కి రూ. 867.66 చొప్పున 50 బెడ్స్‌కి రూ. 43383 మస్టర్ ద్వారా చెల్లిస్తారు.

- మట్టి మిశ్రమం నింపిన పాలిథీన్ సంచులను ఒక బెడ్‌లో 1000 సంచులు వచ్చే విధంగా అంటే అడ్డంగా 10 మరియు నిలువులో 100 సంచులు అమర్చాలి.
- బెడ్‌కి బెడ్‌కి మధ్యలో 0.5 మీటర్ స్థలం ఖాళీగా ఉంచాలి. దీనివలన నర్సరీలలో పనులు సులువుగా చేయవచ్చును.

## టేకు వేర్లను సేకరించటం

- 8" – 9" ఇంచుల పొడవు మరియు పెన్సిల్ మందం గల టేకు వేర్లను తీసుకోవాలి.
- జిల్లా నీటి యాజమాన్య సంస్థ వారు టేకు వేర్లను సేకరించి రైతులకు సరఫరా చేయడం జరుగుతుంది.

## టేకు వేర్లను పాలిథీన్ సంచులలో పెట్టటం

- జిల్లా నీటి యాజమాన్య సంస్థ వారు సరఫరా చేసిన టేకు వేర్లకు ప్రక్క వేళ్ళు, పిల్ల వేర్లు ఉన్నట్లయితే వాటిని కత్తిరించి వేయాలి. వేళ్ళను బావిస్టిన్ ద్రావణంలో ముంచాలి.
- తర్వాత టేకు వేరును పాలిథీన్ సంచిలో ఒక రంధ్రం చేసి ఒక ఇంచు బయటకు కనబడెలా టేకు వేరును పెట్టి దాని చుట్టు మట్టిని చేతివేళ్లతో గట్టిగా నొక్కాలి.
- టేకు వేర్లను పాలిథీన్ సంచులలో పెట్టటానికి ఒక బెడ్‌కి రూ. 101.84 చొప్పున 50 బెడ్స్‌కి రూ. 6110 చొప్పున చెల్లిస్తారు.

## నీళ్ళు పట్టడం

- పాలిథీన్ సంచులలో మట్టి మిశ్రమాన్ని నింపినప్పటి నుండి రోజుకు రెండు సార్లు నీళ్ళు పట్టాలి.
- నీరు పట్టినందుకు ఒక బెడ్‌కి రూ. 121.60 చొప్పున 50 బెడ్స్‌కి రూ. 60,800 చెల్లిస్తారు.

## కలుపు తీయడం

- పాలిథీన్ సంచులలో వచ్చే కలుపును ఎప్పటికప్పుడు తీసివేయాలి.
- నర్సరీ కాలంలో 6 సార్లు కలుపతీయాలి.
- కలుపు తీయడం కోసం ఒక బెడ్‌కి రూ. 21.35 చొప్పున 50 బెడ్స్‌కి 6 సార్లకు రూ. 6405 చెల్లిస్తారు.

## షిఫ్టింగ్ మరియు గ్రేడింగ్

- టేకు మొక్క పాలిథీన్ సంచిలో పెరుగుతున్నప్పుడు దాని వేళ్ళు పాలిథీన్ సంచులలో నుండి బయటికి వచ్చి నేలలోకిపోతాయి.
- అలా వేర్లు నేలలోకి వేళ్ళకుండా బ్యాగులను కదపాలి. ఒక వేళ వేర్లు భూమిలోకి వెళితే వాటిని పదునైన కత్తితో కత్తిరించాలి.
- కదిలించిన బ్యాగులను బెడ్స్‌లో ఎత్తులవారిగా అమర్చాలి.
- నర్సరీకాలంలో బ్యాగులను కదిలించి ఎత్తుల వారిగా అమర్చడం 4 సార్లు చేయాలి.
- దీనికి గాను ఒక బెడ్‌కి రూ.114.70 చొప్పున 50 బెడ్స్‌కి 4 సార్లకు రూ. 22940 చెల్లిస్తారు.

## ఎరువులు మరియు సస్యరక్షణ మందులు అందించడం

- ఎరువులు మరియు సస్యరక్షణ మందులకోసం ఒక బెడ్‌కి రూ. 125 చొప్పున 50 బెడ్స్‌కి రూ. 1250 చెల్లిస్తారు.

## కంచె వేయడం

- పశువుల నుండి నర్సరీని రక్షించుటకు నర్సరీ చుట్టు కంచె ఏర్పాటు చేయాలి.
- నర్సరీ చుట్టు ముళ్ళ కంచె వేయుటకు రూ. 7524 చెల్లిస్తారు.
- పశువుల పచ్చిపేడ సేకరించడం మరియు పశువుల పేడ ద్రావణం తయారు చేసి మొక్కలను అందించడం.
- పశువుల పచ్చిపేడ సేకరించి దానిని నీటిలో కలిపి ద్రావణంలా తయారుచేసి మార్చి నెల ముందు ఒకసారి మార్చి నెల తరువాత ఒకసారి మొక్కలను అందించాలి.
- దీనికి గాను ఒక బెడ్‌కి రూ. 118.65 చొప్పున 50 బెడ్స్‌కి రెండు సార్లు అందించడానికి రూ. 11866 చెల్లిస్తారు.

## భూమి మరియు నీరు అద్దె విలువ

- భూమి మరియు నీటి అద్దె కోసం నెలకు ఒక బెడ్‌కి రూ .26.75 చొప్పున 10 నెలలకు 50 బెడ్స్‌కి రూ. 13375 చెల్లిస్తారు.

## నర్సరీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేయటం

- ఈ సంవత్సరంలో కొత్తగా ప్రారంభించిన నర్సరీ స్థలంలో నీళ్ళ ట్యాంకులు కొనటానికి మరియు పైపులైన్లు ఏర్పరచటానికి బెడ్‌కి రూ. 1000 చొప్పున 50 బెడ్స్‌కి రూ. 50000 చెల్లిస్తారు.
- నర్సరీలో అవసరమున్న పైపులు, పారలు, తట్టలు, రోజ్‌క్యాన్, కత్తెర మొదలైనవి కొనడానికి రూ. 13562 చెల్లిస్తారు.

### *జిల్లా నీటి యాజమాన్య సంస్థ నర్సరీ*

డ్వామా నర్సరీ ద్వారా చేపట్టిన నర్సరికీ సంబంధించిన మొత్తం కూలీ శ్రమ శక్తి సంఘాలకు చెల్లించబడును. మెటీరియల్‌కు సంబంధించిన డబ్బులు సప్లయర్‌కు చెల్లించబడును. లీజ్‌కు సంబంధించిన డబ్బులు సంబంధిత భూమి హక్కుదారునకు చెల్లిస్తారు. నర్సరీ పర్యవేక్షణకుగాను ఒక వన సేవకుడిని నియమించి అతనికి ఉపాధి హామీ నిధుల నుండి మాస్టర్ ద్వారా చెల్లించబడును.

### *రైతు నర్సరీ*

రైతు నర్సరీలో రైతుల ద్వారా 50,000 మొక్కల వరకు పెంచటానికి అవకాశం ఇవ్వబడును. ఇట్టి నర్సరీని రైతు మాత్రమే నిర్వహించాలి. దానికి సంబంధించిన మెటిరియల్ ఖర్చులను అతనికే చెల్లించబడును. కూలీ డబ్బులను తన కుటుంబ సభ్యులు లేదా శ్రమ శక్తి గ్రూపుల ద్వారా పని చేయించినచో వారికి చెల్లించబడును. అటువంటి నర్సరీ భూమి కిరాయి రైతుకే చెల్లించబడును. రైతు మొక్కలను చక్కగా పెంచి జూలై, ఆగష్టు నెలలో డ్వామా సూచించిన రైతులకు సరఫరా చేయాల్సిన అవసరం ఉంటుంది. తద్వారా పచ్చని చెట్లు ప్రగతికి మెట్టు అవ్వడానికి నర్సరీలు కీలకమైన పాత్ర వహిస్తాయి.

*– టి.యం.కె. గాంధీ, ఫ్యాకల్టీ, సిఎన్ఆర్ఎమ్*

# మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ పథకాలు

**దేశ జనాభా మొత్తంలో సగం మంది మహిళలు అయినప్పటికీ పురుషులతో పోలిస్తే మహిళల విద్య, ఆరోగ్య, ఉపాధి మొదలైన రంగాలలో ఎంతో వెనుకబడి వున్నారు. అందువలన కేంద్ర ప్రభుత్వం వారి సామాజిక, ఆర్థికాభివృద్ధి, సంక్షేమాల కోసం మహిళలు, బాలికలపై ఉన్న వివక్షలను తొలగించడానికి  మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా  అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోంది.**

మనదేశంలో అధిక సంఖ్యలో పిల్లలు పేదరికం, పారిశుద్ధ్య లోపంతో జీవించడం ద్వారా వారి శారీరక, మానసిక అభివృద్ధి ప్రస్తుతం ఒక సవాళ్ళుగా మారుతోంది. తద్వారా  శిశు మరణాల రేటు 44 గాను, 5 సంవత్సరాల లోపు పిల్లల మరణాలు 93 గాను నమోదైంది..

నవజాత శిశువులలో 25% తీవ్ర పోషణ, పోషణ, వ్యాధి నిరోధక టీకాలు, విద్యాలోపాలతో బాధ పడుతున్నారు. పై కారాణాలన్ని పరిశీలించి కేంద్ర ప్రభుత్వం పిల్లల జాతీయ విధానానికి అనుగుణంగా వారి సంక్షేమం కోసం సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకాన్ని ప్రారంభించారు.

ఉభయ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమాల అమలు మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యలో నిర్వహిస్తున్నాయి. సమగ్ర శిశు అభివృద్ధి సేవల ద్వారా మహిళలు, పిల్లల్లో ఉన్న పోషకాహార లోపాన్ని తగ్గించటం, మాతృ మరియు శిశు మరణాలను తగ్గించడం, సాధికారత ద్వారా చట్ట పరమైన మరియు సంస్థాగత మద్దతు ద్వారా మహిళలకు, పిల్లలకు రక్షణ కల్పించడం ఈ శాఖ ముఖ్య ఉద్దేశ్యం. ఈ ప్రయత్నాలన్నీ మహిళా సాధికారతను సాధించడానికి, జాతీయాభివృద్ధిలో పురుషులతో సమానమైన భాగస్వామ్యం పొందడానికి దారీ తీస్తాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళ, శిశు సంరక్షణ కోసం ఈ క్రింది కార్యక్రమాలు అమలు చేస్తున్నాయి.

### సమగ్ర శిశు అభివృద్ధి సేవలు

సమగ్ర శిశు అభివృద్ధి సేవల ద్వారా మహిళలు మరియు పిల్లలలో వున్న పోషక లోపాన్ని, మాతృ మరియు శిశు మరణాలను తగ్గించడం. ఈ పథకం ముఖ్యకుద్దేశ్యం, ఈ లక్ష్యాన్ని సాధించడానికి 7 నెలల నుండి 6 సంవత్సరాల పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు, 15–45 సంవత్సరాల మహిళలకు అంగన్‌వాడి కేంద్రం ద్వారా ఈ క్రింది సేవలు అందించడం జరుగుతుంది.

- ✯ అనుబంధ పోషకాహారం
- ✯ ఆరోగ్య తనిఖీలు
- ✯ వ్యాధి నిరోధక టీకాలు
- ✯ సలహాలు సంప్రదింపులు
- ✯ పూర్వ ప్రాథమిక విద్య.

### అనుబంధ పోషకాహారం

సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం ద్వారా అందించే ప్రధాన సేవలలో అనుబంధ పోషకాహారం ఒకటి. అనుబంధ పోషకాహారంలో  భాగంగా ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్‌లో అంగన్‌వాడి కేంద్రం ద్వారా 7 నెలల నుండి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు, బాలింతలు పౌష్టికతను పెంచడానికి పోషకాహారం పంపిణీ చేయబడుతుంది.

ఇందిరమ్మ అమృతహస్తం పథకం అమలులో వున్న ప్రాంతాలలో గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు అన్నం, పప్పు, కూరగాయాలతో కూడిన ఆహారం, ఉడికించిన గ్రుడ్డు, 200మిలి పాలు అంగన్‌వాడి కేంద్రాలలో ఇవ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి రోజుకు ఒక మహిళకు రూ. 20 ఖర్చు చేయడం జరుగుతుంది.  రోజుకు అవసరం అయ్యే కిలో కాలరీలు, ప్రోటీన్లు, కాల్షియం 40 శాతం అందించడం జరుగుతుంది.

### వ్యాధి నిరోధక టీకాలు, ఆరోగ్యతనిఖీలు, సలహాలు సంప్రదింపులు పోషణ మరియు ఆరోగ్య విద్య

పైన తెలిపిన ఆరోగ్యసేవలు ఆరోగ్య శాఖ సమన్వయంలో నిర్వహింపబడతాయి. అంగన్‌వాడి కార్యకర్త వ్యాధి నిరోధక టీకాలు, ఆరోగ్య తనిఖీల లబ్ధిదారులను గుర్తించి, ప్రతినెల వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సంప్రదించి వారు నిర్ణయించిన తేదీలలో ఆశా కార్యకర్త ఎఎన్ఎమ్‌ల సహకారంతో పోషణ, ఆరోగ్య దినంగా వ్యాధినిరోధక టీకాలు, ఆరోగ్యతనిఖీలు నిర్వహించి పిల్లల, గర్భిణీ స్త్రీల, బాలింతల బరువు తూయడం, పోషణ మరియు ఆరోగ్య విద్యతోపాటు అనుబంధ పోషకాహారం ఇంటికి తీసుకువెళ్ళె రేషన్ పంపిణీ చేయడం జరుతుంది.

### పూర్వ ప్రాథమిక విద్య

అంగన్‌వాడి కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమాలు 3 నుండి 6 సంవత్సరాల బాల బాలికలకు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించబడుతుంది. బాలల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్‌లో కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

### బాలికా శిశు సంరక్షణ పథకం

బాలికల పట్ల అన్ని రకాల వివక్షతను తొలగించే ముఖ్య ఉద్దేశ్యంతో బాలికలు పాఠశాలలో చేరడం, కనీసం ఇంటర్మీడియేట్ వరకు చదువుకోవడం. 18 సంవత్సరాల తర్వాతే వివాహం చేసుకోవడం.

## బంగారు తల్లి పథకం

2013 మే 1 నుంచి పుట్టిన ఆడపిల్లలకు బంగారుతల్లి పథకం వర్తిస్తుంది. తెల్లరేషన్‌కార్డు కలిగిన కుటుంబాలలో ఇద్దరు ఆడపిల్లలకు మాత్రమే ఈ పథకము వర్తిస్తుంది. రెండవ కాన్పులో కవలలు జన్మించినట్టయితే ఆ ఆడపిల్లలు కూడా ఈ పథకానికి అర్హులు. బంగారు తల్లి మైలురాయి లక్ష్యాలు సాధించగానే లభించే లబ్ధి వివరాలు.

వివిధ వాయిదాలలో రూ. 5500 మరియు 21 సంవత్సరాలు నిండగానే ఒకేసారి ప్రోత్సాహకం లభిస్తుంది. ఇంటర్మీడియట్ పూర్తయితే రూ. 50,000, డిగ్రీ పూర్తయి రూ. 1,00,000 లభిస్తాయి.

## కిశోర బాలికా పథకం

కిశోర బాలికల పోషణ, ఆరోగ్యం, వ్యక్తిగతాభివృద్ధి సమగ్ర జీవనాభివృద్ధి విధానపు కార్యక్రమాలను నిర్వహించటానికి కిశోర బాలికా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కౌమార దశలో 11 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల లోపు వయస్సులో వున్న బాలికలను వృత్తి నైపుణ్య శిక్షణ, వృత్తి విద్య శిక్షణలో మెరుగుపరచటం ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యము.

## కిశోర బాలికల సాధికారతకై రాజీవ్ గాంధీ పథకం 'సబల'

సబల పథకం అమలవుతున్న జిల్లాలో 11-14 సంవత్సరాల కిశోర బాలికలకు, 15-18 సంవత్సరాల కిశోర బాలికలందరికీ అనుబంధ పోషకాహారం ఇంటికి తీసుకొని వెళ్ళే రేషన్ పథకం ద్వారా అందించడం జరుగుతుంది. ప్రతి నెల కిశోర బాలికలకు 3 కిలోల బియ్యం, 1 కిలో పప్పు, 500 గ్రాముల నూనె మరియు 16 గ్రుడ్లు ఇవ్వడం జరుగుతుంది. ఇది ఒకరోజుకు ఇచ్చే పోషకాహారంలో 600 కాలరీల శక్తి, 18-20గ్రా ప్రోటీనులు మరియు సూక్ష్మ పోషకాలుంటాయి.

## సమగ్ర బాలల పరిరక్షణ పథకం (ఐ.సి.పి.ఎస్)

కేంద్ర ప్రభుత్వం స్త్రీ, శిశు సంక్షేమ మరియు ఇతర శాఖల ద్వారా పిల్లల రక్షణ కొరకు అమలు చేసే పథకాలన్ని ఒకే చోట సంఘటిత పరచి అందజేయడం జరుగుతుంది. ఈ పథకం పిల్లల రక్షణకు పిల్లలకు హాని కలగకుండా వారి హక్కుల పురోగతికి తోడ్పడుతుంది. ఈ పథక పరిధిలో వచ్చే పిల్లలు.

- ✯ బాలలకు అవసరమైన రక్షణ మరియు సంరక్షణ కలిగించడం.
- ✯ నిర్భాగ్య బాలనేరస్తులకు ఆప్యాయత, రక్షణ, చికిత్స, వికాసం, పునరావాసం చేకూర్చటం.
- ✯ ఏదైనా పరిస్థితులలో చట్ట ప్రకారం బాధితులైన పిల్లలు లేదా సాక్షులుగా వున్న పిల్లలు

***ఐసిపిఎస్ పథకం క్రింద అమలులో వున్నా పథకాలు***

- ✯ అన్ని వేళలలో అత్యవసర పరిస్థితులలో బాలల సహాయమునకు టోల్ ఫ్రీ నం. (చైల్డ్ లైన్)1098.
- ✯ పట్టణ మరియు జిల్లా స్థాయిలో బాలల సంరక్షణ ఆవశ్యకతకై రక్షణ కేంద్రాలను అన్ని వేళలలో నడుపుట
- ✯ కుటుంబపరమైన సంరక్షణ - దత్తత, అలన పాలన క్రమంలో సంరక్షణ

● సంరక్షణ బాధ్యత అనాథలకు తాత్కాలిక సంరక్షణ

● పిల్లల దత్తత, ప్రత్యేకమైన దత్తత సంస్థ -స్పెషలైజ్డ్ అడాప్షన్ ఏజెన్సీలు. (శిశు గృహ / శిశు విహార్ల ద్వారా)

***తదనంతర సంరక్షణ కార్యక్రమాలు***

1) రక్షిత గృహాలు 2) బాలసదనము 3) పరిశీలన గృహాలు4) ప్రత్యేక సదనములు

***దత్తత:*** అనాథలు, వదిలివేయబడిన పిల్లలను మరియు తల్లిదండ్రులు గాని, బంధువులుగాని సంరక్షించలేని స్థితిలో అప్పగించిన పిల్లలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ద్వారా చట్టపరంగా అనాథలుగా నిర్ధారించాలి అర్హులైన తల్లిదండ్రులకు దత్తత ఇవ్వడం జరుగుతుంది.

## ఇందిరా గాంధీ మాతృత్వ సహాయోగ యోజన పథకం

భారత ప్రభుత్వం మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మాతృత్వ సహాయోగయోజన అనబడే నియంత్రిత నగదు బదిలీ పథకాన్ని ప్రారంభించడం జరిగింది. గర్భిణీల, బాలింతల మరియు శిశువుల ఆరోగ్య, పోషణస్థితిని మెరుగుపరచటం ఈ పథకం ఉద్దేశ్యం.

## ప్రభుత్వం తరపున బాధిత మహిళలకు అందించే ఆర్థిక సహాయం

తెలుగు రాష్ట్రాలలో మహిళలపై జరుగుతున్న అకృత్యాలను, అత్యాచారాలను, దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం బాధిత మహిళలకు తక్షణ సహాయ నిమిత్తం నగదు రూపంలో ఆర్థిక సహాయం అందిస్తుంది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ క్రింద వివిధ రకాల అత్యాచారాలకు గురైన మహిళలకు ప్రభుత్వం లక్ష రూపాయల వరకు ఆర్థిక సహాయం అందిస్తుంది.

రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా వున్న స్వదార్ సదనాలలో ఈ పథకం క్రింద నిస్సహాయ మహిళలకు ఆశ్రయం కల్పించి, కౌన్సిలింగ్ న్యాయపరమైన సహాయం నైపుణ్యాభివృద్ధి శిక్షణ, పునరావాసం వంటి సేవలు మహిళలకు కల్పించబడతాయి.

రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా వున్న రాజ్యల సదనాలలో ఈ పథకం క్రింద రవాణాకు గురైన వారికి ఆశ్రయం కల్పించి, ఆహారం, బట్టలు, కౌన్సిలింగ్, న్యాయపరమైన సహాయం, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, పునరావాసం వంటి సేవలు మహిళలకు కల్పించబడతాయి.


### మహిళా మరియు బాలసదనం

1. సేవా సదనాలు
2. రాష్ట్ర సదనాలు
3. ఉద్యోగిని వసతి గృహాలు
4. వయోవృద్ధుల సదనాలు
5. కళాశాల బాలిక సదనాలు
6. బాలసదనాలు

***– సి. పద్మజ,*** *8897986674*

# ఉపాధి హామీలో పారిశుద్ధ్య సౌకర్యాల కల్పన

**మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలోని షెడ్యూల్ 1 లోని పేరా 1 లో పేర్కొన్న పనుల జాబితాను విస్తృతపరుస్తూ గ్రామీణ ప్రాంతాలలో పారిశుద్ధ్య సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు వీలుగా పనులను చేపట్టేందుకు భారత ప్రభుత్వం సవివరమైన విధి విధానాలను జారీ చేసింది. దీని వలన గ్రామీణ ప్రాంతాలలో పారిశుద్ధ్య సౌకర్యాల కల్పన జరిగి, తద్వారా పరిశుభ్రమైన పరిసరాలు ఏర్పడి ప్రజలు నాణ్యమైన జీవితాన్ని పొందేందుకు వీలు కలుగుతుంది.**




భారత ప్రభుత్వం జారీ చేసిన విధివిధానాలకు అనుగుణంగా మన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని గ్రామాలలో పారిశుద్ధ్య సౌకర్యాల కల్పనకు అవకాశం కల్పిస్తూ గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ క్రింద అమలులో ఉన్న నిర్మల్ భారత్ అభియాన్ (సంపూర్ణ పారిశుద్ధ్య ఉద్యమం) ను మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో సమ్మిళితం చేస్తూ స్పష్టమైన విధి విధానాలను జారీ చేయడం జరిగింది.

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమలుకై జారీచేసిన నూతన విధివిధానాలు క్రింది అంశాలను దృష్టిలో ఉంచుకొని జారీ చేశారు.

### ఉద్దేశ్యం

- ⋆ గ్రామీణ ప్రజలకు జీవనోపాధుల కల్పన ప్రధానాంశంగా వారి జీవనంలో నాణ్యతను పెంచడం.
- ⋆ పారిశుద్ధ్య సౌకర్యాల కల్పనకు వీలుగా దీర్ఘకాలం మన్నే ఆస్తులను ఏర్పరచడం.
- ⋆ పారిశుద్ధ్య సౌకర్యాల కల్పన ద్వారా ముఖ్యంగా, మహిళలకు గోప్యతను, గౌరవాన్ని అందించడం.

### కార్యకలాపాలు

గ్రామీణ నీరు మరియు పారిశుద్ధ్య శాఖ పరిపాలనా పరిధిలో నిర్మల్ భారత్ అభియాన్ పథకానికి లోబడి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించిన కార్యక్రమాలను అనుమతిస్తారు.

### నమూనా/ డిజైన్స్

ఎ. భారత ప్రభుత్వపు గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ వారి సూచనల మేరకు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలకు సంబంధించిన నమూనాలను మరియు వాటి వ్యయ అంచనాలను పొందుపరచారు. ఈ నమూనాలకు ప్రాంతీయ అవసరాల దృష్ట్యా, పరిస్థితులను బట్టి మార్పులు అవసరం అనుకుంటే తగు ప్రతిపాదనలను రాష్ట్ర నీరు మరియు పారిశుద్ధ్య మిషన్ వారికి పంపించాలి.

***ఎ.సి. షీటు పైకప్పు మరియు రెండు లీచ్ పిట్‌లు కలిగిన 3-4 అడుగుల కొలతలతో వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణం:***

- ⋆ వ్యయ అంచనా: 10,500
- ⋆ మరుగుదొడ్డి పరిమాణం 3 అడుగులు. 4 అడుగులు
- ⋆ రెండు గుంతలతో 'లీచ్ పిట్ సాంకేతికత'
- ⋆ ఒక్కో గుంత 1 మీటరు పరిమాణం, 1.20 మీటర్ల లోతు కలిగి ఉండాలి
- ⋆ ఎ.సి. రేకు 1.05 మీటర్లు. 1.5 మీటర్లు పరిమాణంతో పైకప్పు
- ⋆ 26 పని రోజుల కల్పన

(అంచనా లెక్కింపు (2011-12) ప్రస్తుత సం.రపు యస్.యస్.ఆర్ రేట్లు ఆధారంగా జరగాలి)

బి. ఎవరైనా లబ్దిదారు స్నానపు గదితో కూడిన వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించాలనుకుంటే దానికి సంబంధించిన నమూనా/ వ్యయ అంచనాలను అనెక్సర్-2 లో పొందుపరచడం జరిగింది. అయితే చెల్లింపు మొత్తం నిర్మల్ భారత్ అభియాన్ మరియు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిబంధనలకు లోబడి జరుగుతుంది.

*రెండు లీచ్ పిట్‌లు, 6 అడుగుల ఆరంగుళాలు X 4 అడుగుల పరిమాణంతో స్నానపు గదితో కూడిన వ్యక్తిగత మరుగుదొడ్డి*

- ★ అంచనా వ్యయం: రూ.16000/-
- ★ మరుగుదొడ్డి పరిమాణం 41X6 1/21 స్నానపు గది పరిమాణం 31X41
- శ రెండు గుంతలు - లీచ్ పిట్ టెక్నాలజీ
- ★ ఒక్కోగుంత 1మీ. పరిమాణం 1.20 మీ. లోతు
- ★ AC షీటు పైకప్పు 1.05 మీ. 1.5 మీ.
- ★ 26 పని రోజుల కల్పన

*(2011-12 అనగా ప్రస్తుత సంవత్సరపు యస్.యస్.ఆర్. లెక్కల ప్రకారం వ్యయ అంచనా జరగాలి)*

## అర్హత

- ★ నివాసం కలిగిన పేదరిక రేఖకు దిగువన ఉన్న అన్ని కుటుంబాలు, షెడ్యూల్ కులాలు/ తెగలకు సంబంధించిన పేదరిక రేఖకు ఎగువన ఉన్న కుటుంబాలు, చిన్న, సన్నకారు రైతులు మరియు భూమిలేని కూలీలు
- ★ ఇందిరా ఆవాస్ యోజన లేదా మరే ఇతర రాష్ట్ర ప్రభుత్వపు గృహ నిర్మాణ పథకాల క్రింద గృహనిర్మాణం చేపట్టి, మరుగుదొడ్డి నిర్మాణం జరగని లబ్దిదారులు కూడా నిర్మల్ భారత్ అభియాన్ క్రింద ప్రోత్సాహానికి అర్హులు.
- ★ గతంలో ఏ పథకం ద్వారానైనా లబ్ది పొందిన వారు, ఇప్పటికే వ్యక్తిగత మరుగు దొడ్డి కలిగి ఉన్న కుటుంబాల వారు ఈ పథకం క్రింద అర్హులు కారు.

## ప్రణాళికీకరణ మరియు అంచనాల తయారీ

- ★ జిల్లా నీరు మరియు పారిశుద్ధ్య మిషన్ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయితీలకు సంబంధించిన నిర్మల్ భారత్ అభియాన్ ప్రణాళికను తయారుచేయవలసినదిగా గ్రామ పంచాయితీలను కోరుతుంది. ఈ ప్రణాళికలో ప్రతి ఇంటా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం ఒక ముఖ్యాంశం.
- ★ గ్రామపంచాయితీ వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి అర్హులైన మరియు అంగీకారం తెల్పిన వారి జాబితా తయారీకి, మహిళా స్వయం సహాయక సంఘాల సహకారం తీసుకొంటుంది. సెర్ప్ ముఖ్యకార్య నిర్వహణాధికారి మహిళా స్వయం సహాయక సంఘాల ను అవగాహనకై ఐ.ఇ.సి కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- ★ యం.జి.యన్.ఆర్.ఇ.జి.యస్. పథకం క్రింద పనుల మంజూరీ పొందేందుకు వీలుగా గ్రామపంచాయితీ లబ్దిదారుల జాబితాను గ్రామసభలో ఉంచి ఆమోదం పొందాలి.
- ★ పని సంఖ్య కేటాయింపు, పనుల/ఆస్తుల రిజిష్టర్‌లో నమోదు, గ్రామసభ ద్వారా సోషల్ ఆడిట్ మరియు విజిలెన్స్, మానిటరింగ్ కమిటీలతో పని మూల్యాంకీకరణ వంటివి సులభతరం చేయడం కొరకు వ్యక్తిగత మరుగుదొడ్డి యూనిట్ మొత్తాన్ని మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం క్రిందనే గుర్తిస్తారు.
- ★ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకపు మండల కంప్యూటర్ సెంటరులో ఇన్‌పుట్ డాటాషీట్స్ నింపి, సాఫ్ట్ వేర్ ఆధారంగా అంచనాలు తయారు చేస్తారు. ఈ అంచనాలు అనెక్సర్ 1 మరియు 2 లలోని నమూనాలు/ ప్రత్యేకతల ఆధారంగా అంచనాలు తయారుచేయాలి.
- ★ ఇంజనీరింగ్ కన్సల్టెంట్/ ఉపాధి హామీ పథకపు ఇంజనీరు/ గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ ఇంజనీరు/ జిల్లా ప్రోగ్రాం కో-ఆర్డినేటరుచే గుర్తించబడిన ఎవరైనా అసిస్టెంట్ ఇంజనీరు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి కావలసిన సాంకేతిక ఆమోదం మంజూరు చేస్తారు.
- ★ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మరియు నిర్మల్ భారత్ అభియాన్‌ల సంయుక్త నిధులతో నిర్మితమయ్యే వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి కావలసిన పరిపాలనా ఆమోదాన్ని జిల్లా కలెక్టరు సూచించిన మేరకు మహాత్మా గాంధీ హామీ చట్టం ప్రకారం జిల్లా ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ మరియు జిల్లా నీరు మరియు పారిశుద్ధ్య మిషన్ అధ్యక్షులు జారీ చేస్తారు.

## కార్యక్రమ అమలు

- ★ అమలు బాధ్యత గ్రామ పంచాయితీదే
- ★ ప్రతి లబ్దిదారుడు తన వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణ పనిలో తప్పనిసరిగా పాల్గొనాలి. ఈ పనికి మస్టర్ రోల్ వాడాలి. మండల స్థాయి ప్రోగ్రాం ఆఫీసరు మస్టర్ రోల్స్‌ను మేట్‌లకు జారీచేసి పని ప్రదేశంలో అందుబాటులో ఉంచాలి. మస్టర్ రోల్స్ నకలు గ్రామపంచాయితీ కార్యాలయంలో అందుబాటులో ఉంచాలి.
- ★ వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణం పూర్తయిన తదుపరి, వాడకం చేపట్టిన తర్వాత మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలోని టెక్నికల్ అసిస్టెంట్ పని విలువను లెక్కించి కొలతల పుస్తకంలో నమోదు చేయాలి. తదుపరి జిల్లా కలెక్టరు వారి ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎక్జిక్యూటివ్ ఇంజనీరు కన్సల్టెంట్ చెక్ మేజర్ చేస్తారు. లబ్ధిదారునితో పాటు, మరుగుదొడ్డి ఫొటోను కూడా అప్‌లోడ్ చేయడం తప్పని సరి.
- ★ మస్టరు రోల్ మరియు యం.బుక్ ఆధారంగా మండల కంప్యూటర్ సెంటర్‌లో వేతనం విలువ, మెటీరియల్ సామాగ్రి విలువ కలిపి ఒకే ఒక్క పే-ఆర్డర్ జనరేట్ చేసి చెల్లింపులు జరుపుతారు. నిర్మల్ భారత్ అభియాన్ క్రింద ప్రోత్సాహం మరియు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద చెల్లించవలసిన మొత్తాన్ని కలిపి చెల్లిస్తారు.
- ★ ఎలక్ట్రానిక్-పే-ఆర్డర్ ద్వారా లబ్ధిదారుని ఖాతాకు మొత్తం

విలువ నేరుగా జమ అవుతుంది. కూలీ మొత్తం ప్రస్తుతం అమలులో ఉన్న విధానం ద్వారా కూలీలకు పంపిణీ జరుగుతుంది.

- ★ మరుగుదొడ్డి నిర్మాణంలో కాంట్రాక్టర్లకు గానీ, మిషన్లకు గానీ అవకాశం లేదు
- ★ ప్రతి గ్రామ పంచాయితీ తప్పని సరిగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద నిర్మించిన మరియు ఇతర వ్యక్తిగత మరుగుదొడ్లతో కూడిన జాబితాను నిర్వహించాలి. అంతేకాక, ఆస్తుల రిజిష్టరులో: సంపూర్ణ పారిశుద్ధ్య ఉద్యమం క్రింద రాష్ట్ర ప్రభుత్వపు ప్రోత్సాహం, లబ్ధిదారుని వాటా మరియు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం క్రింద చెల్లింపులను విడివిడిగా చూపిస్తూ నిర్వహించాలి.
- ★ మేట్/ ఫీల్డ్ అసిస్టెంట్ క్రింది వాటికి బాధ్యత వహించాలి
  1. తమకు కేటాయించిన గ్రామ పంచాయితీ/ గ్రామం/ ప్రాంతంలోని అన్ని వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించిన మస్టర్ రోల్స్‌ను నిర్వహించడం
  2. నైపుణ్యం గల కూలీలు నైపుణ్యత లేని కూలీల హాజరును నమోదు చేయడం
  3. గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ వారు సూచించిన నమూనాలో నిర్మాణం జరిగేలా చూసి దానిని ధృవీకరించాలి.
  4. లబ్ధిదారునికి కేటాయించిన వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణం పూర్తయిన తదుపరి మస్టర్ రోల్‌లోని కూలీల హాజరును ధృవీ కరిస్తూ సంతకం చేసి తదుపరి చర్యలకై టెక్నికల్ అసిస్టెంట్‌కు అందజేయడం
  5. టెక్నికల్ అసిస్టెంట్ అన్ని యూనిట్‌ల మెజర్‌మెంట్‌లను యం. బుక్‌లో నమోదు చేయాలి.
- ★ మరుగుదొడ్ల నిర్మాణానికి గాను పని విలువను లెక్కించడం టెక్నికల్ అసిస్టెంట్ బాధ్యత. దానికి నిర్దేశించిన ఇంజనీరు చెక్ మెజర్ చేస్తారు
- ★ గ్రామ పంచాయితీ వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలకై కావలసిన ఏర్పాట్లు అనగా మెటీరియల్ సేకరణకు తగు ప్రణాళిక తయారీ, అమలు విధానాన్ని నిర్ణయించుకొని నిర్దేశిత లక్ష్యం చేరుకోవడానికి తగు చర్యలు తీసుకోవాలి

## వ్యయ విధానం

- ★ వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో యం.జి.యన్.ఆర్.ఇ.జి.యస్ నిధుల నుండి మస్టర్ రోల్ ప్రకారం క్రింది కార్యక్రమాలకు చెల్లింపులు జరుపవలసి ఉంటుంది.
  1. అనెక్చర్ 1 లో పేర్కొన్న విధంగా వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణానికి నైపుణ్యత గల కూలీలను 3.5 రోజులు, నైపుణ్యత అవసరం లేని కూలీలను 15 రోజులు మించరాదు. అనెక్చర్ 2 లో పేర్కొన్న మేరకు స్నానపుగదితో కూడిన మరుగుదొడ్డి నిర్మాణానికి నైపుణ్యతగల కూలీలు 6 రోజులు, నైపుణ్యత అవసరం లేని కూలీలు 20 రోజులకు మించరాదు. ఈ మేరకు యం.జి.యన్.ఆర్.ఇ.జి.యస్ నిధుల నుండి చెల్లింపులు మొత్తం రూపాయలు 4500/- లకు ఎట్టి పరిస్థితులలోనూ మించరాదు.
  2. నైపుణ్యత గల కార్మికునికి, మేట్‌కు చెల్లించవలసిన మొత్తం మెటీరియల్ కాంపోనెంట్ క్రింద చెల్లించడం జరుగుతుంది.
- ★ వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణంలో అవసరమగు ఇతర వస్తు సామాగ్రికి అయ్యే ఖర్చు 'నిర్మల్ భారత్ అభియాన్' పథకం క్రింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరీ ద్వారా ప్రోత్సాహం చెల్లించడం, లబ్ధిదారుడు తన వాటాగా కొంత సమకూర్చడం జరుగుతుంది.
- ★ ఈ ప్రాజెక్టు క్రింద నిధుల మంజూరీ ఇలా జరుగును.

| వివరం | మొత్తం (రూ.లు) |
|---|---|
| 1. నిర్మల్ భారత్ అభియాన్ క్రింద ప్రోత్సాహకం | |
| ఎ) కేంద్ర ప్రభుత్వ వాటా | 3,200/- |
| బి) రాష్ట్ర ప్రభుత్వ వాటా | 1,400/- |
| మొత్తం | 4,600/- |
| 2. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద చెల్లింపు | |
| ఎ) అన్‌స్కిల్డ్ లేబర్ (గరిష్ట పనిరోజులు 20) | 2,740/- |
| బి) స్కిల్డ్ లేబర్ (గరిష్ట పనిదినాలు 6) | 1,710/- |
| సి) మేట్ వేతనం (ఒక్కో యూనిట్‌కు సరాసరి) | 50/- |
| మొత్తం | 4,500/- |
| 3. లబ్ధిదారుని వాటా | 900/- |
| వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణంకు యూనిట్ వ్యయం | 10,000/- |

కొండ ప్రాంతాలు, ఇతర క్లిష్టమైన ప్రాంతాలలో నిర్మల్ భారత్ అభియాన్ క్రింద అదనపు ప్రోత్సాహంగా రూ.500 కేటాయిస్తారు.

- ★ నిర్మల్ భారత్ అభియాన్ ప్రోత్సాహకం కూడా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకపు చెల్లింపులతో పాటు ఇ-యఫ్.యం.యస్ పద్ధతిలో ఏకమొత్తం చెల్లింపు జరుగుతుంది.

## మానిటరింగ్ మరియు రిపోర్టింగ్

- ★ యం.జి.యన్.ఆర్.ఇ.జి.యస్ క్రింద పారిశుద్ధ్య సౌకర్యాలకై నిర్మాణాల ప్రగతిని ఎప్పటికప్పుడు జిల్లా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ మరియు జిల్లా నీరు మరియు పారిశుద్ధ్య మిషన్ అధ్యక్షులు పర్యవేక్షించడం/ సమీక్షలు నిర్వహిస్తారు.
- మానిటరింగ్ కై వెబ్ రిపోర్ట్‌లు అందుబాటులో ఉంటాయి. చెల్లింపుల తీరు తెన్నులు, పనుల ప్రగతిలను www.nrega.ap.gov.in ద్వారా తెలుసుకోవచ్చు.
- గ్రామీణాభివృద్ధి మరియు గ్రామీణ నీటి సరఫరా మరయు పారిశుద్ధ్య శాఖలు వారి వారి క్షేత్ర స్థాయి అధికారులను ఉత్సాహపరచడం ద్వారా నిర్మల్ భారత్ అభియాన్ లక్ష్యం అయిన 3 సంవత్సరాల కాల వ్యవధిలో అన్ని గ్రామాలూ పూర్తి స్థాయి పారి శుద్ధ్యం సాధించేందుకు కృషి చేయాలి.

(ఆధారం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీచేసిన గవర్నమెంటు ఆర్డర్ 250, తేది 27.8.2012)

◆

ఆరోగ్యంగా ఉండటం అంటే కేవలం జబ్బులు లేకుండా ఉండటం మాత్రమే కాదు, మానసికంగా, శారీరకంగా, ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండటం కూడాను. మన దేశంలో దాదాపుగా 75% మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు. స్త్రీలలో రక్తహీనతకు గల ముఖ్య కారణం సరైన పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోకపోవడమే. భారతదేశంలో కిషోర బాలికలు, స్త్రీలు రక్తహీనత (అనిమిమా)తో బాధపడడం సర్వసాధారణం. రక్తహీనత, దానికి గల కారణాలు ఏ విధంగా గుర్తించాలి, అధిగమించాలంటే ఏం చేయాలో ఈ ఆర్టికల్‌లో చూద్దాం.....

## రక్తహీనత అంటే ఏమిటి?

మన రక్తంలో ఉండాల్సిన హిమోగ్లోబిన్ అనే పదార్థం ఉండాల్సిన స్థాయి కన్నా తక్కువగా ఉండటమే రక్తహీనత.

**100 మి.లీ రక్తంలో ఉండాల్సిన హిమోగ్లోబిన్ మోతాదు**

| | | |
|---|---|---|
| స్త్రీలు | - | 12-16 గ్రా. |
| పురుషులు | - | 14-17 గ్రా. |
| పిల్లలు | - | 11 గ్రా. |

కానీ పురుషులలోనూ మూత్రపిండాల సమస్య కానీ, మలేరియా కానీ, వస్తే రక్తహీనతకు గురిఅవుతారు..

## రక్తహీనత కారణాలు

* శరీరానికి తగినంత పరిమాణంలో ఇనుము లభించనప్పుడు రక్తహీనత కలుగుతుంది.
* ఎర్ర రక్తకణాలు సరిగా ఏర్పడకపోవటం వలన కూడా రక్తహీనత

# రక్తహీనతను అధిగమించేటం ఎలా ?

## స్త్రీలలోనే ఎందుకు ఉంది. పురుషులలో ఎందుకు లేదు?

* ప్రాణ వాయువును ($O_2$) ఊపిరితిత్తుల నుంచి శరీరంలోని వివిధ అవయవాలకు సరఫరా చేయటానికి రక్తం చాలా అవసరం.
* ఎర్రరక్తకణాలు (ఆర్.బి.సి) ప్రాణవాయువును సరఫరా చేస్తాయి. ఈ ఎర్ర రక్తకణాలలోని హిమోగ్లోబిన్‌లో ఇనుము, ప్రోటీన్లతో కూడిన అణువులు ఉంటాయి.
* హిమోగ్లోబిన్ అనేది ఒక ప్రొటీన్. ఎర్ర రక్త కణాల్లో తగినంత హిమోగ్లోబిన్ లేకపోతే, రక్తంలో ఆక్సీజన్ శాతం తగ్గి, అది రక్త హీనతకు దారి తీస్తుంది.
* ఆ హిమోగ్లోబిన్‌కు అవసరమైన ఇనుము మన ఆహారం ద్వారా లభ్యమవ్వాలి. మన శరీరానికి కొన్ని మిల్లీ గ్రాముల ఇనుము అవసరముంటుంది.
* రక్త పరీక్షలో (ఆర్.బి.సి. సంఖ్యలో) హిమోగ్లోబిన్ మోతాదు తక్కువగా ఉన్నట్లైతే దానిని రక్తహీనతగా నిర్ధారిస్తారు.
* స్త్రీలు రక్తహీనతకు గురి కావడానికి ముఖ్య కారణం వారి నెలసరి ఋతుస్రావం.
* *గర్భధారణ :* గర్భంతో ఉన్నప్పుడు, ప్రసవ సమయంలో రక్తహీనతకు గురయ్యే అవకాశం ఎక్కువ.
* పురుషులకు పై సమస్యలు లేవు కనుక వారిలో రక్తహీనత అరుదు.

కలుగును. దీనినే మెగాలోబాస్టిక్ అనేమియా అందురు.

* విటమిన్ బి (ఫోలిక్ ఆసిడ్), విటమిన్-సి ప్రోటీన్ లోపం వలన కూడా రక్తహీనత కలుగును.

*స్త్రీలలో రక్తహీనతకు గల కారణాలు...*

* ఋతుస్రావం
* కాపర్ 'టి' ఉపయోగం వలన వారికి నెలసరి సమయంలో అధిక రక్తస్రావం కలుగును.
* గర్భసంచి (యుటరస్) లో (ఫైబ్రాయిడ్స్) కణితలు కలిగినచో అధిక రక్త స్రావం అవును.
* భారతదేశంలో 87.6% స్త్రీలు గర్భధారణ సమయంలో చివరి త్రైమాసికంలో అధిక రక్తహీనతకు లోనవుతున్నారు.
* ఇంకా మలేరియా, మూత్ర పిండాల సమస్యలు గానీ, కడుపులో నులి పురుగులు ఉన్నను రక్తహీనత కలుగును.

## రక్త హీనతను మనం ఎలా గుర్తిస్తాం?

* రక్త పరీక్ష ద్వారా (ఆర్.బి.సి. కౌంట్) నిర్ధారించవచ్చు. అయితే దాని కంటే ముందు మన శరీరంలో ఈ క్రింది లక్షణాలు కన్పించినప్పుడు రక్తహీనత ఉన్నట్లు గుర్తించవచ్చు.
* నీరసంగా ఉండటం.

**ఈ క్రింది 100 గ్రా. తిండి పదార్థాలలో - ఇనుము పరిమాణం**

| | | |
|---|---|---|
| రాగులు | - | 8 మి.గ్రా |
| మరమరాలు | - | 6.6 మి.గ్రా |
| పుట్నాలపప్పు | - | 9.5 మి.గ్రా |
| ఉలవలు | - | 6.8 మి.గ్రా |
| శనగలు | - | 8.6 మి.గ్రా |
| సోయాబీన్స్ | - | 10.4 మి.గ్రా |
| బీట్ రూట్ ఆకులు | - | 16.2 మి.గ్రా |
| తమలపాకులు | - | 10.6 మి.గ్రా |
| గంగవాయిల కూర | - | 14.8 మి.గ్రా |
| ఎండు సుందకాయ | - | 22.2 మి.గ్రా |
| ఎండు కలువకాడలు | - | 60.6 మి.గ్రా |
| నల్ల నువ్వులు | - | 56.7 మి.గ్రా |
| జీలకర్ర | - | 11.7 మి.గ్రా |
| పుచ్చకాయ | - | 7.9 మి.గ్రా |
| ఎండు ఖర్జూర | - | 7.3 మి.గ్రా |
| నూనె తీసిన ఎండు కొబ్బరి | - | 69.4 మి.గ్రా |

అన్ని మసాలా దినుసులలోను ఇనుము ఉంటుంది. పై పదార్థాలను రోజూ ఆహారంలో గ్రహించడం ద్వారా సులభంగా రక్తహీనత నుండి స్త్రీలు తమని తాము కాపాడుకోవచ్చు.

* కళ్ళు తిరగటం.
* ఉన్నట్లుండి చీకట్లు కమ్మడం.
* త్వరగా అలసిపోవడం.
* ఏ పనిలోను శ్రద్ధ పెట్టలేకపోవడం.
* కీళ్ళ నొప్పులు ఉండడం.

### రక్తహీనతను సులభంగా ఎలా నివారించగలము

* పప్పులు, ఎండబెట్టిన పళ్లు, ఖర్జూరం, పుచ్చకాయ, పచ్చని కూరగాయలు, ఆకుకూరల్లో, గుడ్లు, మాంసం, చేపలు, కోళ్ల ఉత్పత్తుల నుండి కూడా ఇనుమును పొందవచ్చు.
* విటమిన్-సి బాగా కలిగి ఉన్న నిమ్మ, ఉసిరి, జామ, నారింజ లాంటి పుల్లటి పళ్లు, శరీరం ఇనుమును గ్రహించటాన్ని మెరుగుపరుస్తాయి.
* శాకాహార పదార్థాల నుండి ఇనుము శరీరంలో తక్కువగా గ్రహించబడుతుంది. అదే జంతు సంబంధ ఆహార పదార్థాల నుండి ఎక్కువగా గ్రహించబడుతుంది.
* టీలాంటి పానీయాలు ఆహారంలోని ఇనుముతో కలిసిపోయి, శరీరానికి ఇనుము అందకుండా చేస్తాయి. అందుకే అలాంటి పానీయాలను భోజనానికి ముందు, భోజనం చేస్తున్నప్పుడు లేదా భోజనమైన వెంటనే గాని తీసుకోరాదు. ◆

# ఎ.ఎం.ఆర్ అపార్డు నందు ల్యాండ్ సెల్ అధిపతి అస్తమయం



**ఎ.ఎం.ఆర్ - అపార్డులో ల్యాండ్ సెల్ కేంద్రం, హెడ్‌గాను, సీనియర్ కన్సల్టెంటుగా పనిచేస్తున్న బొందలపాటి వెంకటేశ్వరావు (రిటైర్డు జిల్లా రెవెన్యూ అధికారి పశ్చిమ గోదావరి జిల్లా) 28.12.2014న ఉదయం స్వర్గస్థులైనారు.**

అపార్డు ఇతర సిబ్బంది వెంకటేశ్వరరావు గారి ఆత్మ శాంతికి సూచికంగా మౌనం పాటించి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

బి. వెంకటేశ్వరరావు గుంటూరు జిల్లా భట్టిప్రోలు గ్రామంలో జన్మించారు. అదే జిల్లాలో ప్రొబేషనరి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగంలో చేరారు. వివిధ స్థాయిలలో డిప్యూటీ కలెక్టరుగా ప్రమోషన్ పొంది శ్రీకాకుళం, నెల్లూరు, పశ్చిమగోదావరిలో పనిచేశారు. పశ్చిమగోదావరి జిల్లా రెవెన్యూ అధికారిగా రిటైరయ్యారు.

అనంతరం అపార్డు నందు కన్సల్టెంటుగా చేరి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల రెవెన్యూ అధికారులకు రెవెన్యూపై వివిధ శిక్షణనిచ్చారు. రెవెన్యూ చట్టాలు, విధి విధానాలు వంటి అనేక పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. ఆయన రెవెన్యూ సంబంధమైన అంశాలపై మంచి ప్రావీణ్యం పొందిన అధికారిగా గుర్తించబడ్డారు మరియు అందరి చేత ప్రశంసించబడ్డారు.

*- సి.ఎం.పి.*

**భారతదేశాన్ని పాలించిన ప్రధానమంత్రులలో మొరార్జీదేశాయ్ ఒక గొప్ప వ్యక్తిత్వం ఉన్న వ్యక్తిగా పెద్దలు అభివర్ణిస్తారు. ఆయన 1896 ఫిబ్రవరి 29న ఆయన జన్మించడం కారణంగా అందరిలాగే మొరార్జీ పుట్టిన రోజు పండుగ ప్రతి సంవత్సరం జరుపుకునే వీలులేకుండా పోవడం, లీపు సంవత్సరంలో జన్మించిన కారణంగా నాలుగేళ్లకో పర్యాయం జరుపుకోవడం చిత్రంగా అనిపిస్తుంది.**

ఆయన తండ్రి రంచోడ్జీ దేశాయ్ ఒక చిన్న బడిపంతులు. అంటే ఆ రోజుల్లో బడిపంతులు.

రంచోడ్జీ దేశాయ్‌కి ఏడుగురు సంతానం. పైగా అప్పట్లో కుటుంబ నియంత్రణకి అంతగా అమలు కాని రోజులని ప్రత్యేకంగా చెప్పేపనిలేదు. మొరార్జీదేశాయ్ తండ్రి గంపెడు సంసారాన్ని పోషించలేక ఆత్మహత్య చేసుకున్న వైనం చాలామందికి తెలియని విషయం. బాల్యంలో మొరార్జీ కటిక దారిద్ర్యాన్ని అనుభవించారు. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి, అవమానాలను అధిగమించి, తిరస్కారాలను అతి సహనంతో భరించి, స్వయంకృషితో అభివృద్ధిలోకి వచ్చిన ప్రతిభావంతుడు. ఇక్కడ ఆయన వ్యక్తిత్వం గురించి మనం కొంతైనా చెప్పుకోవాల్సి అవసరం ఉంది.

దేశాయ్‌కి చిన్నతనం నుండీ ఆత్మగౌరవం ఎక్కువ. బాల్యం నుండీ కూడా ఆయన ఆశావాది. మిన్ను విరిగి మీద పడ్డా చలించని వ్యక్తిత్వం ఆయనది. అదే ఆయన భావి జీవితానికి రాచబాట వేసిందని భావించవచ్చు.




పనిచేస్తున్న జిల్లా కలెక్టర్‌తో అభిప్రాయబేధం వచ్చింది. వెంటనే మొరార్జీ ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. అదే ఆయన రాజకీయ అరంగేట్రానికి నాంది అయ్యింది. గాంధీ మహాత్ముని దర్శనం చేసుకుని దేశాయ్ నేనింక ప్రభుత్వోద్యోగంలో ఇమడలేనని చెప్పడం జరిగింది.

ఆనాటి నుండీ ఆయన దేశసేవ చేసేటందుకుగాను నడుం బిగించారని మనం అర్థం చేసుకోవచ్చు. దేశ రాజకీయాలలో మొరార్జీదేశాయ్ చాలా నిబద్ధతతో వ్యవహరిస్తూ, మిక్కిలి క్రమశిక్షణతో నడుచుకునేవారు.

# 'లీపు' వీరుడు మొరార్జీ దేశాయ్

భావనగర్ మహారాజా కాలేజీ వారు దేశాయ్ తెలివితేటల్ని గుర్తించి పది రూపాయల విద్యార్థి వేతనం ఇస్తూ ప్రోత్సహించారు. చదువుతో బాటు కొంత గృహావసరాలకూ ఆ సొమ్ము వాడుకునే పరిస్థితి ఉండేది. కాలేజీలో బి.ఎ. చదివేటప్పుడు ఆంగ్లేయుల పాలనలో దేశం మగ్గుతున్నందున ఆయనకి క్లాసులో విధిగా బైబిల్ బోధ ఎవరో ఒకరు చేస్తూ ఉండటం జరిగేది. ఆ సమయంలో మొరార్జీ క్లాసులో ఉండేవారు కాదు. వా విషయం ప్రిన్సిపాల్ నోటీసులోకి వెళ్లింది. ఆయన్ని పిల్చి మందలించడమూ జరిగింది. ఆనాటి నుండీ మొరార్జీదేశాయ్ ప్రిన్సిపాల్‌కి నమస్కరించడం మానుకున్నారు.

డిగ్రీ ఫస్టుక్లాసులో పాసైన తర్వాత ప్రభుత్వోద్యోగానికి దేశాయ్ దరఖాస్తు చేసుకున్నారు. అప్పుడు ప్రిన్సిపాల్ దరఖాస్తుతో పాటు, రికమండేషన్ లెటరు ఇస్తానన్నాడట. అభిమానధనుడైన మొరార్జీ "నాకెవరి సిఫార్స్ అక్కర్లేదు" అని నిర్మొహమాటంగా చెప్పారట. నా సర్టిఫికెట్ నాకిస్తే చాలు అని చెప్పి దానినే తీసుకున్న స్వాభిమాని.

ఆనాటి తెల్లదొరతనం భారతదేశ ప్రజల్ని నిరంకుశంగా అణిచి పాలిస్తున్నది. దేశం పరాయిపాలనలో మగ్గిపోతున్న రోజులవి. బొంబాయి ప్రభుత్వ రెవెన్యూ శాఖలో మొరార్జీ దేశాయ్ డిప్యూటీ కలెక్టర్‌గా జీవితం ప్రారంభించారు. బ్రిటిష్ సామ్రాజ్యవాద పాలనలోనూ ఆయన ఖద్దరు ధరించి ఉద్యోగం చేయసాగారు. అనంతరం ఆయన పి.ఎ.గా

కాంగ్రెస్ పార్టీ ఒకసారి ఒక నిర్ణయం తీసుకుంటే దానిని అంతా బద్ధులై పాటించాలనే ఉద్దేశం కలిగి ఉండే వ్యక్తి దేశాయ్. అందుకే ఆ పార్టీ నాయకుడు ఒక మాట చెబితే దాన్ని కార్యకర్తలెవ్వరూ ధిక్కరించకూడదన్నదే ఆయన లక్ష్యం. బొంబాయిలో ఆయన రెవెన్యూ మంత్రిగా 1938లో పనిచేసినప్పుడు తన పట్ల దురుసుగా ప్రవర్తించిన ఆంగ్లేయ ఐ.సి.ఎస్. అధికారికి ఫుల్‌గా క్లాసు తీసుకున్నారు.

ఆ ఐ.సి.ఎస్. ఆఫీసరు మంత్రిగా వున్న మొరార్జీదేశాయ్ దగ్గరకు ధూమపానం చేస్తూ వచ్చాడు. మంత్రి పట్ల అది చులకన భావంగా గ్రహించిన మొరార్జీ అతనితో మాట్లాడకుండా మౌనంగా కూర్చుని ఉండిపోయారు. అతనికి బుద్ధి రావాలని మీ దేశపు వ్యక్తియైన గవర్నర్ దగ్గరకు మీరు వెళ్తే ఈ విధంగానే వెళ్తారా అంటూ నిలదీసిన ఘనుడు ఆయన.

"మీకు మీ దేశం వాళ్ల కన్నా మా భారతదేశపు మంత్రులే తక్కువ వారా? వారే తేలిగ్గా కనిపిస్తున్నారా?" అంటూ ఖంగు తినిపించిన మొండి మనిషి కూడా మొరార్జీ! నిర్మొహమాటంగా మాట్లాడటం, ముక్కుసూటిగా పోవడం, మంకు పట్టుదల ఆయనలో గల వ్యక్తిత్వ లక్షణాలు. అయితే ఇటువంటి వాటి వల్ల కూడా ఒక్కొక్కసారి ఆయన అపోహలకు, అపార్థాలకు గురి కావలసిన సందర్భాలూ లేకపోలేదు.

మొరార్జీదేశాయ్‌కి మద్యపాన నిషేధం విషయంలో తాను ప్రభుత్వంలో ఉన్నా, లేకున్నా దానిని కచ్చితంగా అమలు పరచాలనే పట్టుదల గట్టిగా ఉండేది. కేవలం తన స్వంత రాష్ట్రానికే అది పరిమితం కాకుండా మొత్తం దేశం యావత్తూ అది అమలు జరగాలనే కృతనిశ్చయం ఉండేది.

అందుకు ప్రధానమైన కారణం ఆయన ప్రబలమైన గాంధేయవాది అయినందువల్ల దేశ ప్రధానిగా తను పదవిలో ఉండగా కూడా మొరార్జీ విదేశీ వస్త్ర ధారణ చేసిన దాఖలాలు అగుపించవు. పైగా తాను రాట్నం మీద నూలు వడకడం అలవాటు చేసుకున్నారు. నీతినిజాయితీల విషయంలో ఆయనకు ఆయనే సాటి అని అనిపించుకున్నారు.

కొన్ని బలమైన నమ్మకాలు మొరార్జీదేశాయ్‌కి ఉండేవి. అవేమంటే టీకాలు వేయించుకోవడమంటే ఆయనకు ససేమిరా మొదట్నుంచీ ఇష్టముండేది కాదు. ఆయన అమెరికా, బ్రిటన్ వగైరా దేశాలు దర్శించడానికి వెళ్లినప్పుడు కూడా వాటిని వేయించుకోకుండా, ఆయా దేశాలు వెళ్లడానికి అక్కడ ప్రభుత్వం నుంచి ప్రత్యేక మినహాయింపు పొందిన ఖచ్చిత భావాలు కల వ్యక్తి. 1952లో దేశాయ్ బొంబాయి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు.

ఆ ఎన్నిక కావడం కూడా చాలా చిత్రాతిచిత్రంగానే జరిగిందని చెప్పుకోవచ్చు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మొరార్జీ తన అన్నగారి కుమారుడు అమూల్ దేశాయ్‌పై 19 ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. నిజానికి ఓడిపోయిన అభ్యర్థి ఏ పార్టీ (ఆఖరికి అధికార పార్టీ) యైనా అదే రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా నియమించబడటం అదివరలో జరిగిన దాఖలాల్లేవు. కాని మొరార్జీకి వున్న ప్రాబల్యానికి, పలుకుబడికి రాజకీయాలలో, అందునా బొంబాయి రాష్ట్రంలో ఆయనదే పైచేయి అయినందున ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించారు.

1956 దేశాయ్ ప్రతిభాపాటవాల్ని గమనించిన హైకమాండ్ (కేంద్రం) జవహర్‌లాల్ నెహ్రూ కేంద్ర మంత్రిగా మొరార్జీని ఆహ్వానించి వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రిగా నియమించడం జరిగింది. క్రమేణా మొరార్జీ దేశాయ్‌గారి సామర్థ్యం ఇనుమడించడంతో 1958లో చాచా నెహ్రూ ఆర్థిక మంత్రిగా ప్రమోట్ చేశారు.

ముఖ్యంగా ఆ శాఖకు మొరార్జీ మంత్రిగా దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం గావించారని పేరు పొందారు. అదిగాక దేశరక్షణ వ్యయాన్ని పెంచడంతో బాటు, మొరార్జీ దేశాయ్ అనవసర ప్రభుత్వ ఖర్చుల్ని నియంత్రించడంతో ప్రముఖ పాత్ర వహించారు.

ఇదిలా ఉండగా ఆనాటి కాంగ్రెస్ ప్రధాన నాయకుడైన కామరాజ్ నాడార్ 'కామరాజ్ పథకం' అంటూ ఓ పథకాన్ని ప్రవేశపెట్టారు. అదేమంటే ప్రభుత్వ పదవుల్లో పదేళ్ళు పనిచేసిన వారు పదవుల్ని విడిచిపెట్టాలి. పార్టీ కార్యక్రమాల్లో నిమగ్నులు కావాలన్నది దాని పరమార్థం. ఆ కారణాన మొరార్జీ దేశాయ్ తాను 1963లో తన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయనతో బాటు మరికొందరు కాంగ్రెస్ పెద్దలు జగజ్జీవన్‌రామ్, డా॥ కె.ఎల్. శ్రీమాలి, బెజవాడ గోపాలరెడ్డి లాంటివారు చేస్తున్న పదవులకు రాజీనామాల పేరుతో పదవీ త్యాగం చేయాల్సి వచ్చింది.

1964వ సంవత్సరంలో ఊహించని మలుపు భారతదేశ రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ పరంగా జరిగింది. అందుకు ముఖ్య కారణం జవహర్‌లాల్ నెహ్రూ చనిపోవడం. అప్పుడు ప్రధాని పదవి ఎవరు చేపట్టాలి అనే మీమాంస బయల్దేరింది. కామరాజ్‌నాడార్ ఏకాభిప్రాయ సాధన పేరుతో పార్టీకి సంబంధించిన ఎక్కువ మంది పెద్దలతో ఆలోచన చేసి లాల్ బహదూర్ శాస్త్రిని ప్రధానిగా నియమిస్తూ ప్రకటన చేశారు. క్రమశిక్షణకు మారుపేరైన మొరార్జీదేశాయ్ వారి నిర్ణయాన్ని ఆనందంగా స్వీకరించారు.

కేవలం రెండేళ్లలో అంటే, 1966లో లాల్ బహదూర్ శాస్త్రి ఆకస్మికంగా మరణించారు. అప్పుడు నెహ్రూ కుమార్తె ఇందిరాగాంధీ, మొరార్జీదేశాయ్ ప్రధానమంత్రి రేస్‌లో పోటీపడిన సంగతి ఆనాటి పెద్దలకు గుర్తులో ఉన్న విషయమే.

ఎట్టకేలకు ఇందిరా ప్రియదర్శినిని ప్రధానిగా చేయడం జరిగింది. అనవసరంగా ఏ పదవీ లేకుండా మొరార్జీ దేశాయ్‌ని ఖాళీగా ఉంచడం దేనికని ఆనాటి కాంగ్రెస్ పెద్దలైన కామరాజ్ వంటివారు ఉపప్రధాని పదవిని సృష్టించి ఆర్థిక శాఖ చూసుకొమ్మని దాని భారం మొరార్జీపై పెట్టారు.

దేశ మహిళా ప్రధానియైన ఇందిర హయాంలో మొరార్జీ ఆర్థిక శాఖ మంత్రిగా బ్యాంకులను జాతీయం చేయడం, మాజీ సంస్థానాధీశుల భరణం రద్దు చేయడం నిర్ణయం విషయంలో ఆయనను ఆమె ఆర్థిక శాఖ నుండి తప్పించారు. అందుకు కోపగించిన దేశాయ్ తన ఉప ప్రధాని పదవికి వెంటనే రాజీనామా చేసి, ప్రభుత్వం నుండి తప్పుకున్నారు.

1975లో భారతదేశంలో ఎమర్జెన్సీ విధించింది పాలక పక్షం. ప్రతిపక్ష నాయకులందర్నీ అరెస్టు చేయించి జైల్లో పెట్టించారు. వారితో బాటు మొరార్జీదేశాయ్‌నీ జైలుపాలు చేశారు. ఆనాడు జైలు పాలైన పెద్దలు కొందరు అనగా లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్, ఆచార్య కృపలానీ ప్రభృతులతో బాటు దేశాయ్ కూడా మంతనాలు సాగించారు.

తక్షణం కాంగ్రెసేతర శక్తులను సమీకరించి జనతా పార్టీ ఆవిర్భావానికి నాంది పలికారు. ఈ జనతాపార్టీలో పాత కాంగ్రెస్, జనసంఘ్ పార్టీవారు, స్వతంత్రపార్టీ, సోషలిస్ట్ పార్టీ, ప్రజాస్వామ్య కాంగ్రెస్ భాగస్వామ్య పక్షాలుగా చేరాయి.

నాటి నుండీ ఇందిరా కాంగ్రెస్ అని మరొకటి తయారయ్యిందని మనం గ్రహించాల్సి ఉంది. 1977లో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో జనతాపార్టీ అఖండ విజయాన్ని సొంతం చేసుకుంది. ప్రభుత్వం కుప్పకూలింది. అన్ని పార్టీలు కలిసిన 'పంచకూళ కషాయం' లాంటి జనతా పార్టీ ప్రభుత్వం కూడా ఎక్కువకాలం అధికారం నిలబెట్టుకోలేక పోయింది. అందుకు కారణం బహునాయకత్వం.

1979 నాటికే అది పతనమైపోయింది. దేశాయ్ ప్రధాని పదవిలో ఉండగా, అది అలా జరగడం దురదృష్టమే ! దేశాయ్‌తో ఇందిరకు వైషమ్యాలు నానాటికీ పెరిగాయే గాని తరగలేదు. తిరిగి ఇందిర ప్రధాని పదవి దక్కించుకున్నా మధ్యలోనే ఆమె హత్యకు గురయ్యారు. తర్వాత జరిగిన పరిణామాలు చాలానే ఉన్నాయి.

1995 ఏప్రిల్ 10న మొరార్జీ దేశాయ్ చనిపోయారు. పెద్ద వింత, కొసమెరుపు ఏమిటంటే, మనకు పొరుగు దేశం, శత్రుదేశమైన పాకిస్థాన్ దేశాయ్‌కి 'నిషాన్-ఎ-పాకిస్థాన్' అనే ఆ దేశపు అత్యున్నత అవార్డు ఇచ్చి సత్కరించడం. ఈ అవార్డ్ వారి వ్యక్తిత్వానికి నిదర్శనం.

◆

# మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వ పథకాలు



**దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న మైనారిటీలకు సంక్షేమ కార్యక్రమాల ఫలితాలు అందజేయడానికి ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ పని చేస్తున్నది. ఈ సంస్థ గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా మైనారిటీలకు సంక్షేమ కార్యక్రమాలు అందిస్తుంది**

మైనారిటీలను పేదరికం నుండి బయటకు తీసుకుని రావడానికి, వారి ప్రధాన సమస్యలను పరిష్కరించడానికి, వారిని అభివృద్ధి పరచడానికి, ఇతర సంక్షేమ కార్యక్రమాల చేపట్టడానికి ప్రభుత్వాలు ఈ దిగువ పేర్కొన్న అంశాలపై కృషి చేస్తున్నాయి.

### మైనారిటీలకు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- సబ్సిడీ ద్వారా లబ్ధిదారులకు బ్యాంక్ రుణాలు అందచేయడం.
- విద్యార్థులకు ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లు అందచేయడం.
- విద్యార్థులకు పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు అందచేయడం.
- ట్యూషన్ ఫీజులు తిరిగి చెల్లించే సౌకర్యం కల్పించడం.
- విద్యార్థులకు ప్రీమెట్రిక్ హాస్టల్లు నిర్వహించటం.
- విద్యార్థులకు పోస్టు మెట్రిక్ హాస్టల్లు నిర్వహించటం.
- రెసిడెన్షియల్ పాఠశాలలు అభివృద్ధి చేయడం.
- వారికి శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించడం.
- పేదరికంలో ఉన్న ముస్లిం మైనారిటీలకు సామూహిక వివాహాలు చేయడం.
- రాజీవ్ యువ కిరణాల ద్వారా ఉపాధి కల్పించడం.

### కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- మైనారిటీ విద్యార్థులకు ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లు అందచేయడం.
- మైనారిటీ విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు అందచేయడం.
- మెరిట్ కమ్ మీన్స్ బేస్‌డ్ స్కాలర్‌షిప్‌లు అందచేయడం.

### సబ్సిడీ ద్వారా బ్యాంక్ రుణాలు అందచేయడం

మైనారిటీ కుటుంబాలు స్థిరంగా, ఆర్థికంగా ఎదగటానికి లబ్ధిదారులకి ఒక యూనిట్‌కు 2,50,000 రూపాయల వరకు ఎంపిక చేసుకున్న పథకాలకు సబ్సిడీని మైనారిటీ కార్పోరేషన్ ద్వారా, బ్యాంకు ద్వారా రుణాలు పొందవచ్చు. బ్యాంక్‌లు లబ్ధిదారులను అర్హత, నైపుణ్యతను బట్టి ఎంపిక చేసి రుణాలకు అంగీకారం తెలిపినట్లయితే, మైనారిటీ కార్పోరేషన్ వారు సబ్సిడీ మంజూరు చేసి బ్యాంకుకు పంపాలి. లబ్ధిదారులకి రుణం, సబ్సిడీతో కలిపి మొత్తం యూనిట్ ధర మొత్తాన్ని

బ్యాంక్ ఇప్పించడం జరుగుతుంది. యూనిట్ ధరకు సబ్సిడీ 50 శాతం లేదా కనీసం 30,000 రూపాయలు చెల్లించాలి. బ్యాంక్ రుణం 40 శాతం నుండి 70 శాతం చెల్లించాలి. మిగతా లబ్ధిదారుని వాటా క్రింద చెల్లించాలి.

## స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్

### ఎ. ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్‌లు

ఈ స్కాలర్‌షిప్‌లను దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న, ఆర్థికంగా వెనుకబడిన పేద మైనారిటీ విద్యార్థులకు మంజూరు చేస్తారు.

6వ తరగతి నుండి 10 తరగతి వరకు చదివిన మైనారిటీ విద్యార్థులకు, వారి వార్షిక ఆదాయం సంవత్సరానికి ఒక లక్ష లోపు ఉన్న వారికి మాత్రమే ఆ స్కాలర్‌షిప్ మంజూరు చేస్తారు.

6వ తరగతి నుండి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సంవత్సరానికి 600 రూపాయలు, 9వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న మైనారిటీ విద్యార్థులకు 800 రూపాయలు చొప్పున మంజూరు చేస్తారు.

### బి. పోస్టు మెట్రిక్ స్కాలర్ షిప్‌లు

ఈ స్కాలర్‌షిప్‌లు ఆర్థికంగా వెనుకబడి, సంవత్సర ఆదాయం ఒక లక్ష మేరకు ఉన్న మైనారిటీ విద్యార్థులకు, ఇంటర్ మీడియట్, గ్రాడ్యుయేషన్, పోస్టు-గ్రాడ్యుయేషన్, ప్రొఫెషనల్ కోర్సు చదివే వారి కి మంజూరు చేస్తారు.

### సి. ఫీజు రీయింబర్స్‌మెంట్

మైనారిటీ విద్యార్థులకు వారి అర్హతను బట్టి, పోస్టు మెట్రిక్ కోర్సులకు, కన్వీనర్ కోటా సీట్ల వారికి, 'ఏ' క్యాటగిరీలో కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో సీట్లు లభించిన వారిలో సంవత్సర ఆదాయం ఒక లక్ష వరకు ఉన్న వారికి ఫీజు రియింబర్స్‌మెంట్ చేస్తారు.

## హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు

### ఎ. మైనారిటీ విద్యార్థులకు ప్రీ మెట్రిక్ హాస్టళ్లు

మైనారిటీ విద్యార్థుల విద్యాభ్యాసం సజావుగా సాగేందుకు పేద మైనారిటీ విద్యార్థులకు 10 ప్రీమెట్రిక్ హాస్టళ్లను ప్రభుత్వం మంజూరు చేయడం జరిగింది. అందులో 6 ప్రీ మెట్రిక్ హాస్టళ్లు బాలురకు, 4 ప్రీ మెట్రిక్ హాస్టళ్లు బాలికలకు మంజూరు చేశారు. ఒక్కొక్క హాస్టల్‌లో 100 మంది మైనారిటీల పేద విద్యార్థులను చేర్చుకుంటారు.

ఈ హాస్టళ్లల్లో బాలికల హాస్టళ్ళు ఆదిలాబాదు, అనంతపూర్, కర్నూలుఅ, గుంటూరు జిల్లాల్లో ఉన్నాయి. బాలుర హాస్టళ్ల మెదక్, చిత్తూరు, కృష్ణా, రంగారెడ్డి, మహబూబ్ నగర్, కడప జిల్లాల్లో ఉన్నాయి.

### బి. పోస్టు మెట్రిక్ హాస్టళ్లు

మైనారిటీ విద్యార్థులకు పోస్టు మెట్రిక్ హాస్టళ్లను 18 జిల్లాల్లో ప్రభుత్వం మంజూరు చేయడం జరిగింది. అందులో ఒక్కొక్క హాస్టల్‌లో 50 బోర్డర్ల చొప్పున 5 జిల్లాల్లో బాలికలకు, 13 జిల్లాల్లో బాలురకు ప్రభుత్వం మంజూరు చేసింది.

**బాలికల హాస్టళ్లు**: మైనారిటీ విద్యార్థినులకు హైదరాబాదు, చిత్తూరు, గుంటూరు, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో మంజూరు చేశారు.

**బాలుర హాస్టళ్లు**: మైనారిటీ బాలుర కోసం హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, మెదక్, అదిలాబాద్, మహబూబ్ నగర్, కర్నూలు, కడప, అనంతపూర్, కృష్ణా, విశాఖపట్నం, నల్లగొండ జిల్లాల్లో హాస్టళ్లు ఉన్నాయి.

### సి. రెసిడెన్షియల్ పాఠశాలలు

ఒక్కొక్క పాఠశాలలో 160 మంది మైనారిటీ విద్యార్థులు ఉండేటట్లు రాష్ట్ర ప్రభుత్వం 12 రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు చేసింది. ఈ మంజూరు అయిన రెసిడెన్షియల్ పాఠశాలలను ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ ఆధ్వర్యంలో నడిపిస్తున్నారు.

**బాలికల కోసం రెసిడెన్షియల్ పాఠశాలలు** : మైనారిటీ బాలికలకు 5 జిల్లాల్లో రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. అవి గుంటూరు, కర్నూలు, చిత్తూరు, నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లో ఉన్నాయి.

**బాలుర కోసం రెసిడెన్షియల్ పాఠశాలలు**: మైనారిటీ బాలుర కోసం రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, అనంతపూర్, కృష్ణా, నెల్లూరు, వరంగల్ జిల్లాల్లో రెసిడిన్షియల్ పాఠశాలలు ఉన్నాయి.

## మైనారిటీ విద్యార్థులకు శిక్షణ, ఉపాధి కల్పన

నిరుద్యోగులైన మైనారిటీ యువతీ, యువకులకు ఈ క్రింద చూపించిన కోర్సులలో శిక్షణ ఇప్పించి, ఉపాధి కల్పించేందుకు పారా మెడికల్ కోర్సులు, బిపిఓ, ఫ్యాషన్ డిజైన్, సెల్‌ఫోన్ సర్వీసింగ్, కంప్యూటర్ బేస్‌డ్ కోర్సులు, హెవీ మోటారు వెహికిల్ డ్రైవింగ్, మెకానిజమ్, ఇతర కోర్సులలో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ శిక్షణకు హాజరు అయ్యే లోకల్ మైనారిటీ విద్యార్థులకు 350 రూపాయలు, నాన్ లోకల్ మైనారిటీ విద్యార్థులకు 1000 రూపాయలు మంజూరు చేస్తారు.

## ముస్లిం మైనారిటీలకు సామూహిక వివాహాలు జరపటం

రాష్ట్ర ప్రభుత్వం పేద ముస్లింలకు ప్రత్యేకంగా సామూహిక వివాహాలు జరుపుతున్నది. పెండ్లికి సంబంధించిన వస్తువులు కొనుగోలు చేసేందుకు ఒక్కొక్క జంటకు 2,500 రూపాయలను మంజూరు చేస్తారు.

## రాజీవ్ యువకిరణాలు-మైనారిటీ సబ్ మిషన్

రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసి ఈ పథకం కింద నిరుద్యోగ మైనారిటీలకు పరిశ్రమల రంగంలో వారికి అనుగుణమైన నైపుణ్యతలు నేర్పించి, ఉద్యోగాలు ఇవ్వడం జరుగుతోంది.

మైనారిటీ సబ్ మిషన్ ద్వారా 2015 నాటికి పరిశ్రమలలో మంచి నైపుణ్యత కలిగించి, మైనారిటీ మిషన్ ద్వారా మైనారిటీలకు రాజీవ్ యువకిరణాల ద్వారా 15 లక్షల ఉద్యోగాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ఈ విధంగా రాష్ట్రంలో ఉన్న మైనారిటీల సంక్షేమం కోసం వినూత్నమైన పథకాలు ప్రవేశపెట్టి మైనారిటీల అభివృద్ధి కోసం రాష్ట్రంలో చురుకుగా చర్యలు చేపట్టబడుతున్నాయి. ◆



# చెరువుల పునరుద్ధరణ వలన బోరుబావుల ద్వారా నీరు లభ్యత మెరుగు!

**బోరుబావులు తిరిగి జల సిరులతో నిండాలంటే చెరువులను పునరుద్ధరించాలి. చెరువు పాలకుల నిర్లక్ష్యం వలన వాటిల్లో భూగర్భజలాలు అడుగంటాయి.**

తెలంగాణ మొత్తం జనాభాలో వ్యవసాయదారులు 31.7 లక్షలు. వ్యవసాయ కూలీలు 67.7 లక్షలు. మొత్తం రాష్ట్రంలో సాగు కింద వున్న భూమి 42,32,435 హెక్టార్లు. 1956లో సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడే నాటికి తెలంగాణలో కాలువల కింద పారుదల ఒక లక్ష హెక్టార్లున్నది.

2008-2009 నాటికి 2.5 లక్షల హెక్టార్లకు చేరుకుంది. అదేకాలంలో చెరువుల కింద పారకం 4.48 లక్షల హెక్టార్ల నుంచి 2 లక్షల హెక్టార్లకు పడిపోయింది. బోరుబావుల కింద సాగు గణనీయంగా పెరిగి 14 లక్షల హెక్టార్లకు చేరుకుంది. నేడు తెలంగాణలో సాగునీరు లభిస్తున్న 18 లక్షల హెక్టార్లలో 14 లక్షల హెక్టార్ల సేద్యం బోరుబావుల ద్వారా నడుస్తున్నది. 1955-56 లో 7 లక్షల హెక్టార్ల పంట భూమికి పంట వివిధ మార్గాల ద్వారా సాగునీరు లభిస్తే, 2008-2009 నాటికి 18 లక్షల హెక్టార్లకు లభిస్తుంది. ఈ పెరుగుదల కేవలం బోరుబావుల ద్వారానే జరిగింది అన్నది వాస్తవం.

1956-2009 మధ్యకాలంలో కాలువల కింద పారకం 4.48 లక్షల హెక్టార్లు పెరిగితే చెరువుల కింద పారకం 4.48 లక్షల హెక్టార్ల నుంచి 2 లక్షల హెక్టార్లకు పడిపోయింది. అంటే సాగునీటి విస్తీర్ణం చెరువుల కింద తగ్గింది 2.48 లక్షల హెక్టార్లన్న మాట.

1985 నుంచి చెరువుల కింద పారకం కుందించుకుపోవడం మొదలైంది. చెరువులలో పూడిక పేరుకుపోవడం, పూడిక తీసే ఖర్చు పెరగడం, సరిగా తీయకపోవడం, చెరువు పరివాహక ప్రాంతాల్లో సాగు పెరగడంతో పాటు రోడ్ల నిర్మాణాల వల్ల కూడా సరాసరి వర్షాకాలంలో చెరువులోకి రావలసిన వరద నీటికి ఆటంకాలు ఏర్పడటం, చెరువులకున్న ఫీడర్ ఛానల్స్ ధ్వంసం కావటం వంటి అనేక కారణాల వల్ల చెరువుల సంఖ్యతోపాటు వాటి సామర్థ్యం కూడా తగ్గిపోయింది.

ఒకప్పుడు 265 టీఎంసీల సామర్థ్యం కలిగి వున్న చెరువుల సామర్థ్యం నేడు 65 టీఎంసీలు పడిపోయిందంటే అవి ఎంతగా ధ్వంసమయ్యాయో అర్థం చేసుకోవచ్చు. దాని ఫలితంగా 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పుడు చెరువుల కింద తెలంగాణలో సాగయ్యే భూ విస్తీర్ణం 12 లక్షల ఎకరాలున్నది. నేడు 5 లక్షల ఎకరాలకు తరిగిపోయింది. దీంతో గత్యంతరం లేక ఇక్కడి రైతులు బోరుబావుల సేద్యంపై ఆధారపడాల్సిన పరిస్థితి అనివార్యమైంది.

1985 నుంచి ఈ ప్రాంతంలో బోరు బావుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వచ్చింది. అధికారిక లెక్కల ప్రకారం 2008-2009 నాటికి తెలంగాణలో వున్న బోరుబావులు 15,67,000. వీటికింద సాగు 31 లక్షల ఎకరాలు. అనధికారిక లెక్కల ప్రకారం వీటి సంఖ్య నేడు 20 లక్షల వరకు వుండొచ్చని. వీటికింద 40 లక్షల ఎకరాల్లో వరిసాగు జరుగుతున్నట్లు నిపుణుల అంచనా. దేశంలోనే అత్యధికంగా బోరుబావుల చెరువులు వున్న ప్రాంతం తెలంగాణ. వర్షాధారంగా లభించిన ఉపరితల జలాలను మనం చెరువులు కుంటల ద్వారా వ్యవసాయానికి వినియోగించుకుంటే బోరు బావుల ద్వారా భూగర్భజలాలను వినియోగించుకుంటున్నాం.

చెరువులు, కుంటలలో ఉపరితల జలాలు పుష్కలంగా వున్నప్పుడే మనకు బోరుబావులలో నీళ్లు లభించేది. గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాల మట్టం పెరుగుదల దోహదం చేసేవి చెరువులు, కుంటలు

ద్వారా మనకు లభ్యమయ్యే భూగర్భ జలాల్లో 90-100 శాతం మధ్య భూగర్భ జలాలను వినియోగిస్తే ఆ బోరుబావులను సమస్యాత్మకమైనవిగా, 60-80 శాతం మధ్య వినియోగించే బోరుబావులను ఉప సంక్లిష్టమైనవిగా పరిగణిస్తారు.

మన రాష్ట్రంలో వున్న బోరుబావులలో 42 శాతం బోర్లు సమస్యాత్మకమైనవి. 48 శాతం బోర్లు ఉప సంక్లిష్టమైనవి. 10 శాతం బోర్లు మాత్రమే సురక్షితమైనవి. నేడు మనదేశంలో రెండు కోట్లకు పైగా వున్న ఈ బోరు బావుల మూలంగా నేలలో నీటిమట్టం చాలా పడిపోయింది.

*దీనిని అధిగమించాలంటే . . .*

చెరువులకు వున్నటువంటి ధ్వంసమైపోయిన ఫీడర్ చానల్స్‌ను పునరుద్ధరించి వాటిని ఆధునీకరించాలి. చెరువుల పూడికతీతలో లబ్ధిదారులను భాగస్వాములుగా చేయాలి. చెరువకట్టల ఎత్తును పెంచి తూము కాలువలను ఆధునీకరించాలి. చెరువుల పరివాహక ప్రాంతంలోని అక్రమ సాగులను అరికట్టాలి. చెరువుల కుంటల కింద వున్న ఆయకట్టుకు కనీసం ఐదేళ్లపాటు నేరుగా నీరందించరాదు. దీంతో భూగర్భజల మట్టాలు పెరిగి బోరుబావులు స్థిరత్వం చెందుతాయి. వాగులు వంకలలో ఇసుక తవ్వకాలను నిషేధించాలి. తద్వారా భూగర్భ జలాలు మెరుగుపడతాయి.

హైదరాబాద్ నగరం చుట్టుపక్కల ఒకప్పుడు 400 చెరువులుండేవి. ఇప్పుడవి 150 కూడా లేవంటే పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ఫలితంగా హైదరాబాద్‌లో ఒకప్పుడు 100 ఫీట్లు వేస్తే పడే బోరు ఇప్పుడు 200-300 ఫీట్లు వేస్తేగాని పడడం లేదు.

భూగర్భ జలాల మట్టం పెరుగుదలకు దోహదపడేవి చెరువులు. బోరు బావులకు ప్రాణాధారం చెరువులు. చెరువులు బతికుంటేనే బోరు బావులు సజీవంగా వుండేది. మన రాష్ట్రంలో వున్న 20 లక్షల బోరుబావులను ఆదుకోవాలంటే ముందుగా ధ్వంసమైపోయిన ఇక్కడి 45,300 చెరువులు, కుంటల పునరుద్ధరణ ఆవశ్యం.

చరిత్రలో చెరువుల నిర్మాణానికి చారిత్రక నేపథ్యం వుంది. వర్షపు నీటిని నిల్వచేసి సాగుకు వినియోగించుకోవాలనే మానవుని ఆలోచనలో భాగంగా ఆవిర్భవించిందే చెరువు. వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంగా మట్టికట్టను నిర్మించి, నీటిని నిల్వచేసి, కాలువల ద్వారా సాగుకు వినియోగించే విధానం కొన్నివేల ఏళ్లక్రితమే ప్రారంభమైనట్లు తెలుస్తుంది. కౌటిల్యుని అర్థశాస్త్రంలో, హేమాద్రి వ్రతఖండంలో ప్రస్తావించిన సప్తసంతానంలో తటాక ప్రతిష్టకు అగ్రతాంబూలం ఇవ్వబడింది. పుణ్యకార్యాల్లో తటాక ప్రతిష్టను అశ్వమేధయాగంతో సమానమైనదిగా పేర్కొనడం జరిగింది.

మధ్యయుగ కాలంలో ప్రజలకు రాజులకు వ్యవసాయమే ప్రధాన ఆదాయ మార్గం. అందుకే రాజులు సేద్యానికి ఎక్కువ ప్రాధాన్యమిచ్చి చెరువుల నిర్మాణానికి పూనుకుంది. తెలంగాణలో చెరువుల నిర్మాణం శాతవాహనుల కంటే ముందు నుంచే కొనసాగినట్లు తెలుస్తుంది. క్రీ.శ. 9 వ శతాబ్దంలో రాష్ట్రకూటుల వద్ద ఆ పిదప కళ్యాణి చాళుక్యుల వద్ద సేనానులుగా పనిజేసిన కాకతీయులు క్రీ.శ. 1083 నుంచి క్రీ.శ. 1323 వరకు తెలంగాణ మొత్తాన్ని పరిపాలించారు.

తెలంగాణ చరిత్రలో వీరి పాలన ఒక మహోజ్వల ఘట్టం, రామప్ప పాకాల, లక్నవరం లాంటి భారీ జలశయాలతో పాటు తెలంగాణ అంతటా వీళ్లు దాదాపు 20 వేల చెరువులను నిర్మించినట్లు తెలుస్తుంది. వీరి కాలంలో చేపట్టిన గొలుసుకట్టు చెరువుల విధానం ఇప్పటికీ ఆదర్శనీయం. ఈ చెరువుల నిర్మాణం వల్లనే తెలంగాణకు ఒక ప్రత్యేకమైన సంస్కృతి, సాంప్రదాయాలు, వృత్తి వ్యవస్థలు, ఆలయాలు, అగ్రహారాలు, సత్రాలు ఏర్పడినట్లు తెలుస్తుంది.

సాగునీటి అభివృద్ధిపైనే తెలంగాణ పునర్నిర్మాణం ఆధారపడి వుందన్న విషయాన్ని దృష్టిలో వుంచుకుని ప్రభుత్వం సాలీనా 9000 చెరువుల చొప్పున ఐదేళ్ళలో 45 వేల చెరువుల కుంటల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టడం హర్షణీయం. తెలంగాణ భూ భౌగోళిక పరిస్థితులకు అనువైనది మైనర్ ఇరిగేషన్.

తెలంగాణ ప్రాంతం సముద్ర మట్టానికి 300 -500 మీటర్ల ఎత్తులో వుండటం ఎత్తైన ప్రాంతం కావడం భూభౌగోళిక పరిస్థితులు చెరువుల నిర్మాణానికి అనుకూలమైనవిగా ప్రభుత్వం గుర్తించి ధ్వంసమైపోయిన వాటి పునరుద్ధరణకు పూనుకోవడం హర్షణీయం.



రాబోయే ఐదేళ్లలో మిషన్ కాకతీయ పేరిట చేపట్టిన చెరువుల పునరుద్ధరణ వాటర్‌గ్రిడ్‌లకు కలిపి దాదాపు 50 వేల కోట్ల నిధులు వుండబోతున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ కాకతీయ వాటర్‌గ్రిడ్ పథకాలు సత్ఫలితాలివ్వలంటే వాటి మధ్య సమన్వయం అవగాహన అవసరం. అందుకోసం ముందుగా వాటర్‌గ్రిడ్‌కు అవసరమైన చెరువులను గుర్తించాలి.

పూర్తిగా ధ్వంసం అయిపోయి కనుమరుగై పోయిన చెరువులు కుంటలను గుర్తించాలి. అలాంటివి దాదాపు 7 వేల పైచిలుకే వుంటాయని అంచనా. పునరుద్ధరణ ద్వారా కూడా సత్ఫలితాలు ఇవ్వలేని వాటిని గుర్తించాలి. శ్రీరాంసాగర్ వరద కాలువ, నాగార్జునసాగర్ వరదకాల్వల ద్వారా సాధ్యమైనన్ని చెరువులను అనుసంధానించాలి.

వీటన్నింటి ద్వారానే భూగర్భ జలాలు పెరిగి మన రాష్ట్రం సస్యశ్యామలం అవుతుంది.

# సమగ్రాభివృద్ధికి సంపూర్ణ అక్షరాస్యత – స్థానిక ప్రభుత్వాల పాత్ర

**అక్షరం మనిషి జీవితాన్ని అభివృద్ధిపథంలో నడిపించే ఆయుధం. అభివృద్ధికి మూలం అక్షరాస్యత, విద్య. మనిషి మనిషిగా జీవించడానికి, మనిషి మానవ వికాసానికి, చైతన్యం పెరగడానికి, ఒకరిమీద ఆధారపడకుండా చుట్టూ ఉన్న ప్రపంచంలో మనిషి తానేమిటో తెలుసుకోవడానికి ఉపయోగపడేది అక్షరం. విద్యారంగం పునాది ఎంత బలంగా వుంటే ఆ దేశం, రాష్ట్రం అంతగా అభివృద్ధి చెందుతుంది.**



వ్యక్తి ప్రగతికే కాదు మొత్తం జాతి నిర్మాణానికి, పురోగతికి కూడా విద్య పునాది వంటింది. అక్షరాస్యత ఆత్మస్థైర్యం పెంపొందిస్తుంది. వృత్తి నైపుణ్యం మెరుగుపరుస్తుంది. హక్కులు, బాధ్యతలు తెలుసుకునేలా చేసి అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం అయ్యేలా అక్షరం అవసరమౌతుంది. అటువంటి అక్షరాస్యత గ్రామీణ ప్రాంతాల్లో లేక గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. కేవలం చదవడం, వ్రాయడం వచ్చిన ప్రతి వ్యక్తి అక్షరాస్యుడు కాదు. తన రోజువారీ జీవితంలో అవసరాలను అన్వయించుకోగలిగిన వ్యక్తి మాత్రమే నిజమైన అక్షరాస్యుడు. మనదేశ రాష్ట్రాలలో చాలా గ్రామాలు అవిద్యతో నిండి ఉన్నాయి. అటువంటి గ్రామాల్లో పేదరికం, మూఢనమ్మకాలు, దురాచారాలు, అనారోగ్యం, నేరాలు అధిక జనాభా వంటివి తాండవిస్తున్నాయి.

నిజానికి మనదేశంలో కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు విజయవంతం కాకపోవడానికి గ్రామాల్లో నిరక్షరాస్యత ముఖ్యకారణం అని చెప్పవచ్చు. ఇటువంటి గ్రామాల్లో ప్రభుత్వాలు ఎన్ని పథకాలు, కార్యక్రమాలు చేపట్టిన ఫలితం కనిపించదు. ప్రాథమిక అవసరాలైన ఆహారం, వస్త్రాలు, గృహం మానవ మనుగడకు ఎంత అవసరమో, అక్షరాస్యత కూడా నాగరిక సమాజ నిర్మాణానికి అంతే అవసరం. నిరక్షరాస్యతతో ఉన్న గ్రామాలు అభివృద్ధివైపు నడవాలంటే గ్రామీణ ప్రాంతాల్లో ముందుగా అక్షరాస్యతను పెంచాలి.

పిల్లలతో పాటు వయోజనులకు కూడా విద్య అందించే ఏర్పాట్లు కల్పించాలి. అందుకు ముఖ్యంగా పంచాయితీరాజ్, స్థానిక ప్రభుత్వాలు చొరవ చూపాలి. అక్షరాస్యతను పెంచడంలో స్థానిక స్థాయిల్లో చొరవ తీసుకొని చేపట్టే కార్యక్రమాలు గ్రామీణా ప్రజల్లో జీవితాల్లో మంచి ఫలితాన్ని ఇస్తాయి.

గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన వృత్తి అయిన వ్యవసాయానికి చదువుతో సంబంధం లేదని ప్రజల భావిస్తూ ఉంటారు. ఆ భావనను ప్రజల్లో పోగొట్టి చదువును అన్వయించుకోవడం ద్వారా లాభసాటి వ్యవసాయం మరియు వ్యవసాయాధారిత పనుల చేయవచ్చునని గ్రామ పంచాయితీలు అవగాహన కలుగజేయాలి.

గ్రామ పంచాయితీ పరిధిలో ఉండే పాఠశాలలను, వయోజన విద్యా కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలి. పరిసర ప్రాంత పరిధిలో బడి లేకపోతే గ్రామ పంచాయితీ అన్ని అనుమతి సదుపాయాలతో పాఠశాల ను ఏర్పాటు చేసి నిధులను సమకూర్చాలి.

అలాగే విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయడంలో స్థానిక ప్రభుత్వాల బృహత్తర పాత్ర పోషించాలి. పంచాయతీ పరిధిలో ఉండే 0–14 పిల్లల రికార్డులను, అదే విధంగా బడికి వెళ్ళే పిల్లలు, నిరంతర విద్యా కేంద్రాలకు వెళ్ళే వారి రికార్డును గ్రామ పంచాయతీలు నిర్వహించాలి. సర్పంచ్ అధ్యక్షునిగా ఉన్న పాఠశాల యాజమాన్య కమిటి పాఠశాల అభివృద్ధికి







ప్రణాళికలు రూపొందించాలి. ప్రతి నెలా క్రమం తప్పకుండా ఈ కమిటి పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలి.

ప్రతి ఒక్క బాలుడు, బాలిక బడిలో ప్రవేశించి హాజరు అవుతూ ఎలిమెంటరీ విద్యను పూర్తి చేసేలా పర్యవేక్షిస్తూ ఉండాలి. నైపుణ్యతగల ఉపాధ్యాయులను తమ గ్రామపంచాయితీ పరిధిలో ఉండే పాఠశాలలో ఉండేటట్లు చూసుకోవాలి. అందరికి విద్య ఆవశ్యకతను, ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలి. అక్షరాస్యత కేంద్రంలో నేర్చుకుంటున్న వయోజనులు క్రమం తప్పకుండా కేంద్రానికి వచ్చే విధంగా ప్రోత్సాహించాలి.

గ్రామపంచాయితీ పరిధిలో ఉండే నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యత కేంద్రానికి వచ్చే విధంగా కృషిచేయాలి. అక్షరాస్యత కేంద్రంలో నిరంతర విద్యా వాలంటీర్లు క్రమం తప్పకుండా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి. గ్రామాల్లో పనిచేసే ఉపాధ్యాయులు ఆ గ్రామంలో నివాసం ఉండేటట్లు ప్రోత్సహించి ఏర్పాటు చేయాలి. గ్రామసభలో అక్షరాస్యత కొరకు సూక్ష్మ ప్రణాళికలు తయారుచేసి అవి సక్రమంగా అమలయ్యే విధంగా కృషి చేయాలి. చదువుకోవడం వల్ల వచ్చే ప్రయోజనాలు గూర్చి గ్రామస్థాయిలో ప్రచార కార్యక్రమాలు చేపట్టాలి.

పాఠశాలలు, కళాశాలలు గ్రామానికి దగ్గరగా లేనప్పుడు ఉచితంగా రవాణా సదుపాయం స్థానిక ప్రభుత్వాలు కల్పించాలి. ఆర్థిక పరిస్థితి సరిగా లేని కుటుంబాలు పిల్లలకు ఉచిత యూనిఫామ్‌లు, వ్రాత సాధనాలు, పుస్తకాలు, స్కాలర్‌షిప్ వంటివి రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుంది. వాటిని సక్రమంగా పంపిణీ జరిగేలా చూడాలి. అదే విధంగా స్వచ్ఛంద సంస్థలను ఈ కార్యక్రమాలు నిర్వహించేటట్లు ప్రోత్సాహించాలి. స్థానిక ప్రభుత్వాల పరిధిలో ఖాళీగా వున్న పాఠశాలలు, విద్యా కేంద్రాల ఉపాధ్యాయుల పోస్టుల గురించి సంబంధిత అధికారులతో మాట్లాడి ఆ ఖాళీలు భర్తీ అయ్యేలా చర్యలు తీసుకోవాలి.

ఈ విధంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు విద్యను అందించడం ద్వారా విద్య అభ్యసించిన వ్యక్తులు ఆత్మవిశ్వాసం కలిగి ఉంటారు. తమ తమ వృత్తి వ్యాపకాల్లో నైపుణ్యతను పెంచుకోగలిగి సాధికారత సాధించ గలుగుతారు. మార్కెట్‌పై అవగాహన పెరుగుతుంది. దానివల్ల దళారుల చేతుల్లో పడకుండా సరైన ఫలితాన్ని పొందుతారు. జంకు, అనుమానం వంటి వాటితో కృంగిపోకుండా దేనినైనా ధైర్యంగా ఆత్మ విశ్వాసంతో ఎదుర్కొంటారు. రాబోయే అవసరాలు దృష్ట్యా పొదుపు పాటిస్తారు. ఆధునిక విజ్ఞాన పరిమాణాలను ఆకళింపు చేసుకోగలుగుతారు. కుటుంబం, ఆరోగ్యం, పర్యావరణం వంటి ప్రధాన అంశాలు పట్ల అవగాహన పెరిగి జాగురుకత వహించగలుగుతారు.



స్త్రీ, పురుషులు ఇరువురూ అక్షరాస్యతతో వారిమధ్య వున్న అంతరాలు కుందింపబడి నైతిక సమానత్వం సుసాధ్యమవుతుంది. వివిధ సామాజిక అంశాల పట్ల అవగాహన పెరిగి ప్రగతి సాధ్యమౌతుంది. మంచి, చెడుల ను బేరీజు వేసుకోగల ధైర్యం అక్షరాస్యత ఇస్తుంది.

ఫలితంగా వ్యక్తుల ప్రవర్తన తీరులోని మార్పులకు అవకాశం కలుగుతుంది. దాని ద్వారా పురాతనంగా పేరుకుపోయిన మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా ఆలోచనలు మొదలవుతాయి. కుటుంబ బాధ్యతలను సక్రమంగా నిర్వహించుకోగలుగుతారు. ఓటు హక్కును సద్వినియోగం పరుచుకుంటారు. కుటుంబం ఆదాయం పెంచుకో గలుగుతారు, అభివృద్ధి కార్యక్రమాల్లో పాలు పంచుకుంటారు.

దీనివల్ల ప్రభుత్వ పథకాల పారదర్శక అమలు జరుగుతాయి. ప్రభుత్వ పథకాలు, వాటికి సంబంధించిన మార్గదర్శకాలు గూర్చి గ్రామ ప్రజలు తెలుసుకోగలుగుతారు. గ్రామ సభలో చురుకుగా పాల్గొని తమ సమస్యలు గూర్చి చర్చించుకుంటారు. తమకు రావల్సిన పథకాల ఫలితాలు తమకు అందరకపోతే అధికారులను నిలదీస్తారు. అంతిమంగా సామాజిక స్థాయి విలువలు మెరుగుపడతాయి. ఆర్థిక అభివృద్ధి, సామాజిక న్యాయం జరుగుతుంది.

ఈ విధంగా గ్రామీణ ప్రజల జీవనస్థాయి మెరుగుపరచలంటే పంచాయితీలు, స్థానిక సంస్థలు అక్షరాస్యతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయాలతో విద్యపై ప్రవేశపెట్టే పథకాల ను, కార్యక్రమాలను గ్రామ ప్రజలు సద్వినియోగ పరుచుకునేలా స్థానిక సంస్థలు కృషి చేయాలి. ఇటువంటి అనేక చర్యలను గ్రామపంచాయితీలు, స్థానిక ప్రభుత్వాలు చొరవతో, నిబద్ధతతో చేపట్టినప్పుడు ప్రతి గ్రామంలో సంపూర్ణ అక్షరాస్యత సమగ్ర అభివృద్ధి మనకు అందుతుంది.

**విద్యాభివృద్ధితోనే మానవాభివృద్ధి ముడిపడి ఉంది. ఒక సామాజిక వ్యవస్థలోని ప్రజానీకంలో విద్యా, వైజ్ఞానిక స్థాయి ఎంత శీఘ్రగతిన పెరుగుతాయో ఆ వ్యవస్థ అంత సత్వరంగా పురోగమిస్తుంది.**

*– కె. యాదయ్య,*
*జాయింట్ డైరెక్టర్, అపార్డ్*

# చెట్ల క్రింద గ్రామ ప్రజాస్వామ్యం

అభివృద్ధి నిరోధకాలు!
ఈ రెండు చెట్లు
అయుస్సుతో జీవిస్తున్న
వేపచెట్లు మా ఊరి చెట్లు !
కర్ర పెత్తానానికి
కన్నెర్ర చేసి
కసిని ఉసి కొల్పి
నోరు మూపిస్తాయి
భయ భ్రాంతులు చేస్తాయి
ఈ రెండు వేపచెట్లు
ప్రజాస్వామ్యన్ని వతన్‌గా చేసి
అప్రజాస్వామికాన్ని
అందరికి చూపి
అన్యాయల అవినీతి పార్టీతో
ఈ మా రెండు వేపచెట్లు !
ఇప్పుడు అవి మూగ పోయాయి
వతన్ అంతరించిందని
స్వాతంత్ర్యం వచ్చిందని
ప్రజాస్వామ్యం గెలిచిందని
ఈ చెట్లు మాగ్రామాభివృద్ధి
కారకాలైనవి మా ఊరి చెట్లు !




**చొల్లేటి ప్రభాకర్,** ఐ.ఎ.ఎస్.
స్పెషల్ సెక్రటరీ
పంచాయతీరాజ్ శాఖ
తెలంగాణ ప్రభుత్వం


# ఆసరా! ఆశల జీవనభృతి!!

అభాగ్యులకొరకు ఆసరా!!
అన్నార్థుల చేయూతకు ఆసరా!!
కడుపులో ఆసరా లేనోళ్ళకు ఆసరా!
గంజి మెతుకులు!
కరువు ఉన్న వాళ్ళకు ఆసరా!
ఆకలి కేకల కొరకు ఆసరా!
బుక్కెడు అన్నానికి ఆసరా!!
వితంతువులకు జీవిత తోడు ఆసరా!
వికాలాంగుల
సహజీవనానికి ఆసరా!
వృద్దులకు జీవనజ్యోతి ఆసరా!
ఎయిడ్స్ రోగుల
జన జీవన స్రవంతి ఆసరా!
గీత కార్మికులకు చేయూత ఆసరా!
చేనేత కార్మికుల వెల్గు జ్యోతి ఆసరా!
పేదల అక్షయ పాత్ర ఆసరా!
పేదల జనజీవన రేఖా ఆసరా!!

# చిరుధాన్య పంటల ప్రాముఖ్యం

**చిరుధాన్యపంటల ఆహార వినియోగం మానవాళికి చాలా పురాతన కాలం నుండే తెలియటమే కాక, బహుశ నాగరిక ప్రపంచం మొట్టమొదటిసారిగా సాగులోకి తెచ్చిన పంటలు కూడా చిరుధాన్యాలు అనవచ్చు.**

**ప్రపంచంలో చిరుధాన్యపంటలు 38 మి.హె. విస్తీర్ణంలో సాగు చేయబడుతూ 28 మి.ట. దిగుబడిని అందిస్తున్నాయి. మనదేశంలో చిరుధాన్యాల సాగు 9 మి.హె. విస్తీర్ణంలో సాగవుతూ, 9.4మి.ట దిగుబడి సమకూరుస్తున్నాయి. విభిన్న వాతావరణ పరిస్థితులలో వివిధ రకాలైన చిరుధాన్య పంటల సాగు చేపడుతున్నారు.**

రాజస్థాన్‌లో సజ్జ ఎక్కువ విస్తీర్ణంలో సాగు అవుతుండగా దక్కన్ పీఠభూమిలో (మరత్‌వాడ, తెలంగాణ మరియు ఉత్తర కర్ణాటక) లో జొన్న, అదేవిధంగా దక్షిణ ఆంధ్ర, తమిళనాడు, ఒడిశా మరియు దక్షిణ కర్ణాటక ప్రాంతాలలో రాగి ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయబడుతోంది. ఉత్తరఖండ్ మరియు ఇతరత్రా పర్వత ప్రాంతాలలో ముఖ్యంగా కొర్రలు, వరిగలు, సామలు మరియు అరికలు సాగు చేస్తుంటారు.

ఇక మన రాష్ట్రంలో జొన్న, సజ్జ, రాగి, కొర్ర, సామ, అరికలు వరిగలు చిరుధాన్య పంటలుగా సాగు చేయబడుచున్నవి. తెలంగాణ ప్రాంతంలో రంగారెడ్డి, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాలో జొన్న, సజ్జ రాయల సీమలో రాగి, కొర్ర మరియు ఉత్తర కోస్తా జిల్లాలలో ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలలో రాగి, సామ, వరిగలు ఎక్కువగా సాగు చేయుచున్నారు.

## చిరుధాన్యాలు – జాతీయ ఆహార భద్రత

ఇటీవల కాలంలో ప్రజల జీవన శైలితో పాటు ఆహారపు అలవాట్లలో వస్తున్న మార్పులు నవీకరణవైపు మొగ్గుచూపడం మరియు వివిధ ఆహారపదార్థాలలో గల పోషకవిలువలపై సరైన అవగాహన లేకపోవటం వలన, చిరుధాన్యాల వాడకం గణనీయంగా తగ్గింది. దీని ప్రభావం ప్రజల ఆరోగ్యంపై ఎంతగానో పడి, ఈ మధ్యకాలంలో మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత జబ్బులు, క్యాన్సర్ మరియు పోషక లోపాలతో బాధపడేవారి సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతుంది.



చిరుధాన్యాల పంటల సాగు లాభసాటిగా చేయటానికి చిరుధాన్యాలలో తయారైన వివిధ విలువ ఆధారిత పదార్థాలను ముఖ్యంగా – చపాతీ పిండి, పాపడ్, చిక్కిస్, కేక్స్ మరియు బిస్కిట్స్‌ను విరివిగా ప్రజా వినియోగంలోకి తేవాల్సిన అవసరం ఉంది. జాతీయ ఆహార ధాన్యాల ఉత్పత్తిలో చిరుధాన్య పంటలు చాలా ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి.

## అధిక పోషక పదార్థాల సమూహం

చిరుధాన్యాలు ముఖ్యంగా మాంసకృత్తులు, పీచుపదార్థాలు, మినరల్స్‌ను ఎక్కువగా మొత్తంలో కలిగి ఉంటాయి.



- తక్కువ భూసారం, ఉప్పు, చవుడు భూములలో కూడా చిరుధాన్యాల పంటల సాగు చేపట్టవచ్చు.
- రసాయనిక ఎరువుల వినియోగం చిరుధాన్యాల పంటల సాగులో తక్కువగా ఉండడం
- చిరుధాన్య పంటల సాగులో చీడపీడల ఉధృత తక్కువగా ఉండడం
- జీవ వైవిధ్యం, పంటల సరళిలో చిరుధాన్య పంటలకు ఎక్కువ ప్రాముఖ్యత ఉండడం.
- వాతావరణ మార్పుల వల్ల కలిగే నీరు, ఆహార కొరత పరిస్థితులలో కూడా చిరుధాన్య పంటలు అధిక ఉష్ణోగ్రతను, వర్షాభావ పరిస్థితుల ను తట్టుకొని ఆహారభద్రత అందిస్తాయి.
- చిరుధాన్య పంటల ఉత్పాదకతను గమనించినట్లయితే తక్కువగా ఉండి స్థిరత్వం లేకపోడం.

## చిరుధాన్య పంటల సాగులో ఉత్పత్తి ప్రతి బంధకాలు

- చిరుధాన్య పంటల సాగు ఖరీఫ్‌లో ముఖ్యంగా తక్కువ వర్షపాతం గల తేలికపాటి ఎర్ర చెలక లేక గరప నేలలకు మాత్రమే పరిమితమై ఉండడం.
- జొన్న మల్లె (స్ట్రిగా) పరాన్న కలుపు మొక్కల ఉధృతి ఎక్కువగా ఉండటం
- పక్షుల ద్వారా చివరి దశలో ఎక్కువ పంట నష్టం కావడం
- అధిక దిగుబడిని ఇచ్చే మేలైన రకాలు మరియు హైబ్రీడ్స్ అందుబాటులో లేకపోవడం.
- ప్రభుత్వపరంగా పంట రుణాలు, పంట భీమా లేకపోవటం.
- చిరుధాన్య పంటల సాగులో సరైన మోతాదులో ఎరువులు, పురుగు

## చిరుధాన్యాల పంటలలో పోషక పదార్థాలు (ప్రతి 100 గ్రా.)

| | మాంసకృత్తులు (గ్రా) | పిండిపదార్థాలు (గ్రా) | కొవ్వులు (గ్రా) | మినరల్స్ (గ్రా) | పీచుపదార్థం (గ్రా) | కాల్షియం (మి.గ్రా) | పాస్ఫరస్ (మి.గ్రా) | రన్ (మి.గ్రా) | శక్తి (మి.గ్రా) |
|---|---|---|---|---|---|---|---|---|---|
| రాగి | 7.3 | 72 | 1.3 | 2.7 | 3.6 | 344 | 283 | 3.9 | 336 |
| జొన్న | 10.4 | 70.7 | 3.1 | 1.2 | 2.0 | 25 | 222 | 5.4 | 329 |
| సజ్జ | 11.8 | 67.0 | 4.8 | 2.2 | 2.3 | 42 | - | 11.0 | 363 |
| కొర్ర | 12.3 | 60.2 | 4.3 | 4.0 | 6.7 | 31 | 290 | 2.8 | 351 |
| సాములు | 7.7 | 67.0 | 4.7 | 1.7 | 7.6 | 17 | 220 | 9.3 | 329 |
| ఆరికలు | 8.3 | 65.9 | 1.4 | 2.6 | 5.2 | 35 | 188 | 1.7 | 353 |
| వరిగలు | 12.5 | 70.4 | 1.1 | 1.9 | 5.2 | 8 | 206 | 2.9 | 354 |
| ఉదలు | 6.2 | 65.5 | 4.8 | 3.7 | 13.6 | 22 | 280 | 18.6 | 300 |
| వరి | 6.8 | 78.2 | 0.5 | 0.8 | 1.0 | 33 | 160 | 1.8 | 362 |
| గోధుమ | 11.8 | 71.2 | 1.5 | 1.5 | 2.0 | 30 | 306 | 3.5 | 348 |

మందులు మరియు కూలీల వినియోగం లేకపోవడం.

- చిన్న చిన్నకారు రైతులు కమతాలలో చిరుధాన్య పంటల సాగు పరిమితం కావడం.
- వర్షధార సాగులో చెదలు ఆశించి ఎక్కువ పంట నష్టపోవడం.
- చిరుధాన్య పంటలను ఏకపటంగా కాక ఇతర పంటలలో మిశ్రమ పంటగా పండించడం
- బంక కారు (Downy mildew) తెగలు ఎక్కువగా ఆశించడం.

చిరుధాన్య పంటల విస్తీర్ణం, సరాసరి దిగుబడి పెంచడానికి, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం ఈ మధ్యకాలంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఖేవ్), National Agril. Innovation Scheme (NAIS) కింది విరివిరిగా నిధులను సమకూర్చుచున్నారు. ఈ పథకం కింద చిరుధాన్యాల రాగి, కొర్ర, సామ సాగు విస్తీర్ణంను సన్న చిన్నకారు రైతుల కమతాలలో విస్తరించడానికి క్షేత్ర ప్రదర్శనలను ముఖ్యంగా సూక్ష్మ పోషకాలపై, పురుగు, కలుపు నివారణ పద్ధతులపై చేపడుతున్నారు.

### ప్రోత్సాహకాలు



- చిరుధాన్యాలు గ్రామాలలో సమాజ సిద్ధంగా నిల్వ ఉండేందుకు తగిన ఏర్పాట్లు చేయడం.
- మద్దతు ధర ప్రకటించడం.
- ప్రజా పంపిణి వ్యవస్థలో చేర్చి జాతీయ ఆహార భద్రతతో పాటు, గ్రామీణ పేదప్రజలలో పోషక లోపాలు నివారించటం.
- సన్న చిన్నకారు రైతులకు గిట్టుబాటు ధర అందే అవకాశం కల్పించటం.
- మేలైన వంగడాలతో పాటు, శాస్త్రీయ సాగు పద్ధతులపై క్షేత్రస్థాయిలో ప్రచారం
- చిరుధాన్యాల సాగువల్ల ఒనగూరే జీవవైవిద్యం, సమతుల్య వనరుల వినియోగానికి రైతులకు బోనస్ ధర ప్రకటించటం.
- అంగన్‌వాడి కార్యకర్తల ద్వారా వివిధ స్వచ్ఛంద సంస్థల ద్వారా ఆహార వినియోగంలో చిరుధాన్యలపై గల అపోహలను తొలగించి వీటిలో గల పోషక పదార్థాలపై ప్రజలలో సరైన అవగాహన కల్పించడం.

చిరుధాన్య పంటల ప్రాధాన్యతను గుర్తించి ప్రజాపంపిణి వ్యవస్థలో చేర్చి మద్దతు ధరను ప్రకటించినట్లయితే ఈ పంటల సాగు విస్తీర్ణం దానంతట అదే పెరిగి రైతులకు లాభాలతో పాటు జాతీయ ఆహార భద్రతకు సహకరించటానికి అవకాశం ఉంది. కనుక తక్షణమే ప్రభుత్వం వారు చిరుధాన్య పంటల సాగు గ్రామీణ ప్రాంతాలలో వివిధ ప్రభుత్వ పథకాలలో అనుసంధానించి (Watershed, NREGA మొదలైనవి) సన్న చిన్నకారు రైతుకమతాలలో చిరుధాన్యాల సాగు ప్రోత్సహించడమే కాక ధాన్య కొనుగోలుకు, స్థానికంగా నిల్వ చేయటానికి కావాల్సిన ఏర్పాటు చేయాలి.

అంతేకాకుండా చిరుధాన్యాలతో తయారైన వివిధ విలువ ఆధారిత పదార్థాలను సమగ్ర శిశు అభివృద్ధి (CDS), మధ్యాహ్న భోజన (Midday Meal) మరియు సాంఘీక సంక్షేమ హాస్టల్స్‌లోని ఆహార మెనులో కలిపి ఇచ్చినట్లయితే చిన్న మరియు పెరిగే పిల్లల్లో పౌష్టిక ఆహార లోపాలను నివారించటమే కాక దారిద్ర్యరేఖకు దిగువన (BPL) ప్రజలకు ఆహారం, పోషక భద్రత కల్పించిన వారమవుతాం.

*- ఆర్. సాయికుమార్, రీసెర్చ్ స్కాలర్*
*- ఆర్. అనిత, ఓ. సంపత్, ఆర్. శ్రీనివాస్,*
*వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్, 9666173333*





'స్వచ్ఛ భారత్' కార్యక్రమంలో పాల్గొన్న నల్గొండ జిల్లా సూర్యపేట మండలం
తాళ్ళ ఖమ్మం పహెడ్ గ్రామ బి.ఎన్.విలు మరియు గ్రామస్థులు



స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని
ఆర్.టి.సి బస్టాండ్ ఆవరణను శుభ్రం చేస్తున్న
వెలుగోడు భారత్ నిర్మాణ్ వాలంటీర్లు

# భారత్ నిర్మాణ్ వాలంటీర్ల





రంగారెడ్డి జిల్లా బంట్వారం మండల కార్యాలయంలో
జరిగిన శిక్షణలో పాల్గొన్న భారత్ నిర్మాణ్ వాలంటీర్లు



కర్నూలు జిల్లా వెలుగోడు గ్రామ జన్మభూమి కార్యక్రమంలో
వివిధ ప్రభుత్వ పథకాల గూర్చి వివరిస్తున్న భారత్ నిర్మాణ్ వాలంటీర్లు





అదిలాబాద్ జిల్లా సారంగపల్లి మండలం మందమర్రి బి.ఎన్.విలు మరియు గ్రామస్తులు
కలసి గ్రామ సమస్యలపై చర్చించిన అనంతరం 'స్వచ్ఛ భారత్' కార్యక్రమంలో పాల్గొన్న దృశ్యం



నిరుపేద పాఠశాల క్రీడాకారులకు ఆర్థిక సహాయం
అందజేస్తున్న కరీంనగర్ జిల్లా భారత్ నిర్మాణ్ వాలంటీర్లు

# అపూర్వ విజయాలు






రాజీవ్‌గాంధీ స్వశక్తీకరణ్ అభియాన్‌పై సామర్లకోట ఇ.టి.సి.లో జరిగిన
వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ శాఖ అధికారులు



స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న బంట్వారం మండలం
భారత్ నిర్మాణ్ వాలంటీర్లు



# జెడ్.పి.టి.సి.లు. గ్రామాభ్యుదయానికి పాటుపడాలి

**రాష్ట్రాభివృద్ధిలో జెడ్.పి.టి.సి సభ్యులు ప్రముఖ పాత్ర వహిస్తూ, గ్రామాభ్యుదయానికి పాటుపడాలని అపార్డ్ జాయింట్ డైరెక్టర్ కె. యాదయ్య అన్నారు.**

డిసెంబర్ 1వ తేదీన అపార్డ్‌లో జరిగిన జడ్.పి.టి.సి సభ్యుల శిక్షణలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా సభ్యుల శిక్షణను ప్రారంభించి ప్రసంగించారు. తమ హక్కులు, బాధ్యతలను క్షుణ్ణంగా అర్థం చేసుకొని గ్రామీణ సమస్యలకు పరిష్కార మార్గాన్ని చూపాలని ఆయన సూచించారు. మాజీ అపార్డు కమీషనర్ మరియు రిసోర్స్ పర్సన్ శ్రీ కె. చంద్రమౌళి. ఐ.ఎ.ఎస్. (రి) కూడా పాల్గొని ప్రసంగించారు.

ఆదిలాబాద్ జిల్లా నుండి హాజరయిన 52 మంది సభ్యులు మూడురోజుల శిక్షణా కార్యక్రమంలో పరిపాలనా వికేంద్రీకరణ, జిల్లా పరిషత్ విధులు, బాధ్యతలు, నిధుల పంపిణీ, చేపట్టవలసిన కార్యక్రమాలు త్రాగునీటి సరఫరా, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలు, పంచాయతీ సంస్థలలో 73, 74 రాజ్యాంగ సవరణ తదితర అంశాలపై నిపుణులు ఉపన్యసించారు.

జెడ్.పి.టి.సి సభ్యులు ఏ విధంగా స్థానిక పాలనలో భాగం పంచుకొని తమ పాత్రను నిర్వహించాలనే విషయాన్ని గూర్చి శిక్షణ ఇవ్వడం జరిగింది. పాలనలో పాటించవలసిన నైతికతను గూర్చి కూడా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిడిపిఎ (సెంటర్ హెడ్) ఆర్ సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

*- సి.ఎం.పి.*

# ఎమ్ఓటి /టిఓటి ల మూడు రోజుల శిక్షణ ప్రారంభం

**పంచాయతీరాజ్ శాఖల కార్యదర్శుల శిక్షణకు కావలసిన విషయాంశాల మీద చర్చించి ఒక కర దీపిక తయారుచేయటానికి ప్రణాళిక మరియు పరిపాలన వికేంద్రీకరణ కేంద్రం అపార్డ్ వారు మాస్టర్ ట్రెయినర్స్‌కు శిక్షణను ప్రారంభించారు.**



ఈ శిక్షణను పంచాయతీరాజ్‌శాఖ, ఆంధ్రప్రదేశ్ అడిషనల్ కమీషనర్ శ్రీ డి. సుధాకర్ పాల్గొని ప్రారంభించారు. 73,74 రాజ్యాంగ సవరణలను అనుసరించి గ్రామపరిపాలనా మార్పులకు అనుగుణంగా కర దీపికలు తయారుచేసి గ్రామ కార్యదర్శులకు శిక్షణనివ్వాల్సి ఉందని అన్నారు.

గ్రామపంచాయతీల పాలన పలు సవాళ్ళను ఎదుర్కుంటుందని, ఆ నూతన సవాళ్ళను ఎదుర్కొని, పరిష్కరించేందుకు కార్యదర్శులు మరింతగా కృషి చేయవలసి ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఏ అభివృద్ధి కార్యక్రమం అయినా ప్రజల నిత్యవసరాలను తీర్చేదిగా ఉండాలని, అందుకు కావలసిన సమగ్ర సమాచారాన్ని కరదీపికలో చేర్చాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల నుండి ప్రత్యేక ప్రతినిధులు ఈ శిక్షణలో పాల్గొన్నారు.

# నువ్వుల సాగులో మెళుకువలు

**సాధారణంగా నువ్వులను 'తిలలు' అని కూడా అంటారు. ఇది చాలా పురాతన కాలం నుండి సాగుచేయబడుతున్న తక్కువ కాలపరిమితి గల పంట. మన రాష్ట్రంలో నువ్వుల పంటను అన్ని ప్రాంతాలలోను పండిస్తున్నారు.**

మురుగు నీరు నిలువని, తేమ నిలిచే తేలికైన నేలలు శ్రేష్టమైనవి. నీరు నిలిచే ఆమ్ల క్షార గుణాలుగల నేలలు పనికిరావు. నువ్వుల సాగుకు తేమను నిలుపుకునే తేలికైన నేలలు అనుకూలంగా ఉంటాయి.

ఖరీఫ్ పంటలు ఆలస్యంగా వేసిన పరిస్థితులలో దీనిని రెండవ పంటగా జనవరి, ఫిబ్రవరి మాసాల్లో విత్తుకొని, అతి తక్కువ సమయంలో, తక్కువ వనరులతో అధిక నికర లాభాన్ని పొందవచ్చు. రబీ లేదా వేసవిలో ఆరుతడి పంటగా వేసినపుడు కంటే ఖరీఫ్ మరియు రబీలో వర్షాధారంగా పండించిన పంటకు చీడపీడల బెడద ఎక్కువగా ఉంటుంది.

కాబట్టి వర్షాధారంగా ఈ పంటను సాగు చేసే రైతులు సరైన సస్యరక్షణ చర్యలు పాటిస్తే, చీడపీడలను అధిగమించి, నాణ్యమైన దిగుబడులను పొందవచ్చును.

ఖరీఫ్ పంటను జూలై నెలలో విత్తుకోవచ్చును. అక్టోబర్ నెలలో పంట కోతకోస్తుంది. కొన్ని ప్రాంతాల్లో నువ్వుల పంటను జొన్న, వేరుశనగ, ప్రత్తి వంటి పంటలతో కలిపి మిశ్రమ పంటగా సాగు చేస్తారు.



## నువ్వుల్లో అనువైనా రకాలు

### తెల్ల నువ్వులు

*రాజేశ్వరి :* తెల్లగింజ రకం, లేట్ ఖరీఫ్ లేదా రబీ/వేసవి పంటగా వేయాలి. తెలంగాణా అనుకూలం. రబీలో 80 రోజులకు, ఖరీఫ్‌లో 90 రోజులకు కోతకు వస్తుంది

*హిమ:* తెల్లగింజరకం, కాయలు పొడువుగా ఉండి, వెర్రి తెగులును తట్టుకునే ఎగుమతికి ప్రాధాన్యం ఉన్న రకం. ఖరీఫ్‌లో 90 రోజులు రబీలో 75-80 రోజుల్లో కోతకు వస్తుంది.

*శ్వేత తిల్ :* తెల్లగింజ రకం లేట్ ఖరీఫ్, రబీ/వేసవి కాలానికి తెలంగాణలో అనుకూలం. వేసవిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో పండించవచ్చు. కాండం కుళ్ళును తట్టుకుంటుంది. ఎగుమతికి ప్రాధాన్యం ఉన్న రకం. ఖరీఫ్‌లో 90 రోజులు, రబీలో 80రోజులకు కోత వస్తుంది.



### గోధుమ రంగు నువ్వులు

*గౌరి :* కోస్తా జిల్లాలకు ఖరీఫ్ సీజన్‌లో అనువైనరకం కోడు ఈగను తట్టుకుంటుంది 90 రోజులకు కోతకు వస్తుంది.

*చందన :* తెలంగాణాకు అన్ని కాలాలకు అనుకూలం, వెర్రితల తెగులును తట్టుకుంటుంది. ఖరీఫ్‌లో 80 రోజులు, రబీలో 80 రోజులకు కోతకు వస్తుంది.

*మాధవి :* లేత గోధుమరంగు విత్తనం ఖరీఫ్ సీజన్‌కు, పలు పంటల పద్ధతి అనుకూలం. 70-75 రోజులకు కోతకు వస్తుంది.

*ఎలమంచలి-11 :* లేత గోధుమరంగు విత్తనం, బూడిద, ఆకుపచ్చ తెగుళ్ళను తట్టుకుంటుంది. కోస్తా జిల్లాల్లో ఎర్లీ ఖరీఫ్ సీజన్‌కు అనుకూలం. 70-80 రోజుల్లో పంటకోతకు వస్తుంది.

*ఎలమంచలి-17 :* ముదురు గోధుమరంగు విత్తనం, కోస్తా ప్రాంతంలో ఎర్లీ ఖరీఫ్ సీజన్‌కు అనుకూలం. పంట 80-85 రోజులకు కోతకు వస్తుంది.

## అంతర పంటలు

నువ్వులను ఏకపంటగానే కాకుండా, అంతరపంటగా కూడా వేసుకోవచ్చు. ఇలా అంతరపంటగా వేసినపుడు ఎకరాకి 1 కిలో విత్తనం సరిపోతుంది. నువ్వులు+పెసలు (1:1)

నువ్వులు+కంది /సోయచిక్కుడు (2:1), నువ్వులు+అలసంద (8:1) నువ్వులు+వేరుశనగ (1+1).

**నేల తయారి, విత్తుట :** పంట వేరు వ్యవస్థ, విత్తన పరిమాణంను బట్టి పంటకు అనుకూలంగా తయారు చేసుకోవాలి. నువ్వుల పంట గుబురు, వేరు వ్యవస్థ గల పంటగా పరిగణించవచ్చు. విత్తనం చాలా చిన్నదిగా ఉంటుంది. కాబట్టి నేలను 2-3 సార్లు కలియదున్నాలి. గుంటకతో చదును చేయాలి. మరీ లోతు దుక్కులు చేసినపుడు వర్షాకాలంలో నీరు ఎక్కువగా నిలిచే అవకాశం ఉంటుంది.


**విత్తన శుద్ధి :** విత్తనాన్ని థైరామ్/ కాప్టాన్/ మాంకోజెబ్ మందులతో (3 గ్రాములు/ కిలో విత్తనానికి) విత్తనశుద్ధి చేసినట్లయితే విత్తనం ద్వారా సంక్రమించే తెగుళ్ళు రాకుండా నివారించవచ్చు.

**ఎరువుల యాజమాన్యం:** ఖరీఫ్‌లో వేసే పంటకు ఆఖరి దుక్కిలో ఎకరాకి 4 టన్నుల పశువుల ఎరువు, 20 కిలోల యూరియా, 50 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులు వేయాలి. రబీ పంటకు పైన తెల్పిన బాస్వరం, పోటాష్, 25 కిలోల యూరియా ఆఖరి దుక్కిలో వేయాలి. విత్తిన నెల రోజులకు ఖరీఫ్‌లో 15 కిలోల యూరియా, రబీలో 25 కిలోల యూరియా కలుపు తీసిన తరువాత పై పాటుగా వేయాలి. భాస్వరం వాడినపుడు అదనంగా కాల్షియం, గంధకం మొక్కకు లభించి దిగుబడి పెరగడానికి అవకాశం ఉంది.

**విత్తటం :** ఎకరాకు 2.5 కిలోల విత్తనం సరిపోతుంది అయితే విత్తన మోతాదు చాలా తక్కువ. పొలంలో సమానం విత్తటం కష్టమైన పని కాబట్టి విత్తనానికి మూడింతలు ఇసుక తీసుకొని 2.5 నుండి 3.0 సెం. మీ లోతులో విత్తనం పడేట్లు గొర్రుతో విత్తుకోవాలి. విత్తనం నాగటి చాలులో వేస్తే ఎక్కువ లోతులో (5 సెం.మీ కన్న ఎక్కువ) పడి మొలవడం ఆలస్యమవడమే కాక, ఒకవేళ విత్తిన వెంటనే వర్షం కురిసినట్లయితే లోతుగా పడిన గింజలు కుళ్ళి పోవడానికి అవకాశం ఉంది. ఒకవేళ నువ్వులను వెదజల్లే పద్ధతిలో విత్తుకుంటే 3 నుండి 3.5 కిలోల విత్తనం సరిపోతుంది.

**అంతర కృషి :** నువ్వుల పంటలో కలుపు నివారణకు విత్తిన వెంటనే లేదా మరుసటి రోజు ఎకరానికి 200 లీటర్ల నీటిలో లీటరు పెండిమిథాలిన్ లేదా అల్లాకోర్ కలిపి పిచికారి చేయాలి. మొక్కలు మొలిచిన 15 రోజులకు ఒత్తుగా ఉన్న మొక్కలను తీసివేయాలి. పైరు విత్తిన 20-25 రోజులకు గొర్రుతో అంతరకృషి చేయాలి.





## చీడపీడల నివారణ

ఆకు మడత, కాయ తొలుచు పురుగులు, గొంగళి పురుగలు పైరు తొలిదశలో రెండు మూడు లేత ఆకుల్ని కలిపి గూడు చేసుకొని లోపలి పత్రహరితాన్ని గోకి తింటాయి. దీనివల్ల ఆకులు ఎండిపోతాయి. దీనివల్ల ఆకులు ఎండిపోతాయి. ఈ పురుగులు ఎదిగిన కొద్ది ఎక్కువ సంఖ్యలో ఆకుల్ని గూడు చేసుకొని వాటిని తింటాయి. ఇవి మొగ్గల్ని, పూతను, కాయల్లోని లేత గింజల్ని కూడా తింటూ పంటకు తీవ్ర నష్టం కలిగిస్తాయి. వీటి నివారణకు లీటరు నీటికి 2 మి.లీ క్వినాల్ ఫాస్ లేదా 2.5 మి.లీ చొప్పున క్లోరిపైరిఫాస్ కలిపి పిచికారి చేయాలి. పురుగు ఆశించిన ఆకుల్ని పురుగులతో సహా ఏరి నాశనం చేయాలి.

అల్లర్నేరియా ఆకుమచ్చ తెగులు మొక్క ఎదుగుదల దశలో గాలిలో తేమశాతం అధికంగా ఉన్నపుడు అధికంగా వ్యాపిస్తుంది. దీని కారణంగా ఆకులు, కాండంపైన గోధుమరంగు మచ్చలు ఉన్నప్పుడు అధికంగా వ్యాపిస్తుంది. దీని కారణంగా ఆకులు, కాండంపైన గోధుమరంగు మచ్చలు ఏర్పడుతాయి. ఆ తర్వాత ఆకు అంతా వ్యాపిస్తాయి. దీంతో ఆకులు ఎండి రాలిపోతాయి. ఈ తెగులు నివారణకు లీటరు నీటికి 1 గ్రాము కార్బండజిమ్ లేదా 2.5 గ్రాముల మాంకోజెబ్ చొప్పున కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు, మూడుసార్లు పిచికారి చేయలి. నువ్వుల పంటను బూడిద తెగులు ఆశించినట్లయితే నీటికి మూడు గ్రాముల చొప్పున గంధకం కలిపి పిచికారి చేయాలి.

వ్యవసాయంలో పెట్టుబడి, కూలీల ఖర్చు మరియు కరెంట్ కొరత విపరీతంగా పెరిగిన నేపథ్యంలో రైతులకు గిట్టుబాటుగాని ఇతర పంటలతో పోలిస్తే, నువ్వులు చాలా తక్కువ పెట్టుబడితో అధిక నికరదాయం పొందగలిగే పంట కాబట్టి, రైతులు ఈ పంటపై దృష్టి సారించి సిఫార్సుస్సు చేసిన యాజమాన్య పద్ధతులను ఆవలంబించిన అధిక ఉత్పత్తులను పొంది అధిక లాభాలను సాధించగలరు.

*- బి. రఘు, విత్తనాధికారి,*
*ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ, నిజామాబాద్*
*- యం మధు, రీసెర్చ్ అసోసియేట్, సిఆర్ఐడిఎ, హైదరాబాద్*
*- నరేందర్, అసిస్టెంట్ విత్తనాధికారి,*
*జాతీయ విత్తన సంస్థ, గుంటూరు*

### బ్యాసిలస్ థ్యూరిన్ జన్‌సిస్

మనదేశంలోని వాణిజ్య పంటలలో ప్రత్తి ప్రాముఖ్యమైన స్థానాన్ని ఆక్రమించింది. దీనినే 'తెల్ల బంగారం' అని కూడా అంటారు. భారతదేశం ప్రపంచంలోని ప్రత్తి ఉత్పత్తి మరియు నూలు ఎగుమతుల్లో ప్రధాన పాత్ర వహిస్తుంది. భారతదేశం ప్రత్తి పంటల్లో ప్రపంచ ఎగుమతుల్లో మొదటి స్థానాన్ని ఆక్రమించింది. ఉత్పత్తుల్లో రెండవ స్థానాన్ని ఆక్రమించింది. భారతదేశ ఆర్థిక వ్యవస్థలో కొన్ని మిలియన్ల రైతు కుటుంబాలు దీనిపై ఆధారపడి ఉన్నాయి మరియు విదేశీ మారక ద్రవ్యంలో 6.5 శాతం వాటా కలిగి ఉంది. ప్రతి భారతదేశ వ్యవసాయ మరియు పారిశ్రామిక రంగాలలో ప్రధాన భూమికను పోషిస్తుంది.


మన రాష్ట్రంలో కూడా సుమారు 20.1 లక్షల హెక్టార్‌లో ప్రత్తి సాగు చేయడం జరుగుతుంది. విస్తీర్ణంలో దాదాపు 90 శాతం బీటి ప్రత్తిని సాగు చేయడం జరుగుతుంది. 2002 వ సంవత్సరంలో మన రాష్ట్రంలో బి.టి ప్రత్తిని ప్రవేశపెట్టగా, ప్రతి సంవత్సరం బిటి విస్తీర్ణం గణనీయంగా పెరుగుతూ వచ్చింది. ఇది ప్రధానంగా 130 రోజుల నుండి 170 రోజుల పంట. భారతదేశంలో జన్యుమార్పిడి పంటల్లో ఇది మొదటి స్థానాన్ని ఆక్రమించింది.

సుమారుగా నలభై రకాల హైబ్రిడ్‌లు 1.26 మిలియన్ హెక్టారు విస్తీర్ణంలో సాగు అవుతున్నాయి. జన్యుమార్పిడి పంట అనగా మనకు కావాల్సి జన్యువును కావాల్సిన పంటలోకి చొప్పించి అవసరమైన పంటల ను ఉత్పత్తి చేయడాన్ని జన్యుమార్పిడి పంటలు అంటారు.



# భారతదేశంలో బిటి ప్రత్తి ఆవశ్యకత - ప్రస్తుత పరిస్థితి

బిటి ప్రత్తిలో జన్యుమార్పిడి ద్వారా చీడపీడలను తట్టుకొనే పంటలను ఉత్పత్తి చేయడం జరుగుతుంది. ప్రత్తి పంటల్లో కీటకాల వలన (బోల్‌వార్మ్) పంట ఉత్పత్తి తగ్గి, దిగుమతులు తగ్గుతున్నాయి. కీటక నాశనులను వాడినా కూడా సరైన ఫలితాలను పొందలేకపోతున్నాము. కొన్ని సంవత్సరాలుగా




బి.టి. అనే బ్యాక్టీరియాను అనేక రకాలైన కీటకాలను నిరోధించటానికి ఉపయోగిస్తున్నారు. అందులో బి.టి. ప్రత్తి వాడకంలోకి వచ్చిన తరువాత రైతులు అధికమొత్తంలో దీని వైపు మొగ్గుచూపుతున్నారు.

బి.టి బ్యాక్టీరియా అనేక రకాలైన కీటకాలను నిరోధించటానికి ఉపయోగిస్తున్నారు. అందులో బి.టి. ప్రత్తి వాడకంలోకి వచ్చిన తరువాత రైతులు అధిక మొత్తంలో దీని వైపు మొగ్గుచూపుతున్నారు.


### బి.టి బ్యాక్టీరియా ప్రత్తిలో పనిచేసే విధానము

అనేక రకాల బి.టి జన్యువులు వివిధ రకాల విష స్పటికాలను 'ఎండోటాక్సిన్' రూపంలో ఉత్పత్తి చేస్తాయి. ఈ బి.టి. జన్యువును మొక్కలోనికి అగ్రోబ్యాక్టీరియా పద్ధతి ద్వారా (లేదా) బొంబార్ట్‌మెంట్ పద్ధతి ద్వారా మొక్కలోనికి చొప్పిస్తారు. ఎప్పుడైతే ఆ కీటకం మొక్కను తింటుందో అపుడు ఎండోటాక్సిన్‌లు మొక్కలోని జన్యువు ద్వారా కీటకం ఉదర భాగంలోనికి చేరుతాయి. ఇవి ఉదరభాగంలో కీటకం శరీర భాగంలో పొటాష్, నిల్వను తగ్గించడం ద్వారా కీటకం చనిపోతుంది.

2002 లో బి.టి. 1 జన్యువు క్రై 1 ఎసి న ప్రత్తిలో చొప్పించి కాగి

తాల పురుగు, శనగపచ్చ పురుగు, గులాబీరంగు పురుగు నివారించడానికి వినియోగిస్తున్నారు. బి.టి. 2 క్రై 1 ఎసి G క్రై 2 ఎబి ప్రత్తిలో చొప్పించి శనగపచ్చ 1 గులాబీ రంగు మరియు పొగాకు లద్దె పురుగును తట్టుకునే లక్షణాన్ని ఉత్పత్తి చేశారు.


ఈ దశలో బిటి 2 సంకర రకాలను 2006 సంవత్సరంలో సాగుకు అనుమతించారు. ఇందులో క్రై క్రై 1 హైబ్రిడ్స్ రెండు రకాల బిటి టాక్సిన్ మందులను ఎక్కువ మోతాదులో ఉత్పత్తి చేస్తాయి. తద్వారా కాయతొలుచు పురుగులు బీటి హైబ్రిడ్స్‌కు నిరోధక శక్తిని పెంచుకొనే అవకాశం చాలా తక్కువగా ఉంటుంది.




ఇదే కాకుండా డబుల్ సంకర రకాలు సింగిల్ బీటి సంకర రకాల కంటే పొగాకు లద్దె పురుగును సమర్థవంతంగా అరికడతాయి. ఈ కారణాల వల్ల డబుల్ బిటి సంకర రకాలను రైతాంగం బాగా ఆదరించారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో దాదాపు 98% డబుల్ సంకర రకాలను సాగు చేస్తున్నారు.

బిటి ప్రవేశపెట్టిన తరువాత కాయతొలుచు పురుగు ఉధృతి గణనీయంగా తగ్గింది. సంకర రకాలను మరియు సూటి రకాలను ఉత్పత్తి చేయడంలో ప్రవేటు కంపెనీలైన మోన్‌శాంట్ మహికో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి.

2020 నాటికి వస్త్ర పరిశ్రమకు సుమారు 48 మిలియన్ లక్షల బేలు అవసరత ఉంది. బిటి ప్రత్తి వలన భారతదేశంలో 93% ఉత్పత్తి బి.టి ప్రత్తి ద్వారా పెరిగింది. దీని వలన అధిక దిగుబడులను సాధించడమే కాకుండా కీటకాలను నిరోధించే శక్తిని కూడా వృద్ధి చేసుకున్నాం.




కాని జన్యు మార్పిడి పంటలపైనా ప్రజల్లో ఎటువంటి అపోహలు, భిన్న అభిప్రాయాలు ఉన్న ప్రస్తుత పరిస్థితులలో దిగుబడులను పెంచడానికి జన్యుమార్పిడి పంటలు వాడడమే సరియైన మార్గం. బి.టి. ప్రత్తి పంటను క్రింద తెలిపిన సూచనలు పాటించడం ద్వారా పత్తిని సాగు చేసినట్లయితే అధిక దిగుబడులు సాధించవచ్చును.

- ✯ బి.టి. ప్రత్తి, ప్రత్తి పంట నశించే అన్ని రకాల పురుగుల నివారణకు మార్గం కాదు.
- ✯ బిటి ప్రత్తి మీద బి.టి. జన్యువును మరలా వాడకూడదు.
- ✯ ఇప్పటి వరకు మన రాష్ట్రంలో పరిశోధానాత్మక విశ్లేషణ ద్వారా తెలిసినదేమంటే బిటి ప్రత్తికి కాయ తొలుచు పురుగుల నిరోధక శక్తిని పెంచుకోలేవు.
- ✯ బిటి పత్తికాయ తొలుచు పురుగులకు నిరోధక శక్తిని పెంచుకోకుండా ఉండాలంటే నాన్-బి.టి. రకాన్ని బిటి పొలంచుట్టూ (4:1) రెఫ్యూజిమాగా విధిగా చేయాలి.
- ✯ బి.టి. ప్రత్తిని సమగ్ర సస్యరక్షణలో భాగంగానే వాడాలి.
- ✯ ప్రస్తుతం సాగులో ఉన్న బి.టి. ప్రత్తి రకాలు రసం పీల్చే పురుగులను ఆశించినంతగా తట్టుకోవడం లేదు. ఎర్రనల్లి, పిండినల్లి, కాయ తొలుచు, కొమ్మతొలుచు పురుగులను కూడా తట్టుకోలేదు. నాన్ బి.టి. పత్తిలో మాదిరిగా వీటికి నివారణ చర్యలు చేపట్టాలి.


*- డా॥ యస్. నాగలక్ష్మి, యమ్. సుధారాణి,*
*- యమ్. మాధవి యమ్.ఎ. జమీల్, ఎస్.వి. నాయుడు*
*విత్తన సాంకేతిక మరియు పరిశోధనా కేంద్రం,*
*రాజేంద్రనగర్, హైద్రాబాద్*

తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ఎక్కువ శాతం ప్రజలు పశుసంపద, పాడి పశువులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయం మరియు వ్యవసాయ సంబంధ పశు పోషణకు మేత చాలా అవసరం. పశు నిర్వహణలో అయ్యే ఖర్చు ఎక్కువభాగం దాణా కోసం ఖర్చు అవుతుంది. పాడి పశువుల పెంపకంలో 70% పశుపోషణకు ఖర్చు అవుతుంది.

పచ్చిమేత పెడితే దాణా ఖర్చు తగ్గి లాభసాటిగా పాల ఉత్పత్తి చేయవచ్చును. పశువులకు పాడి పరిశ్రమ నిర్వహించే రైతులు తమకున్న పొలంలో కనీసం 10 శాతం భూమిలో పచ్చి మేత సాగు చేయాలి. ప్రత్యేకంగా భూమిని పశుగ్రాసాల కోసం కేటాయించలేని వారు ఇతర పంటల సాళ్ళ మధ్య మిశ్రమ పంటలుగా పశుగ్రాసం పెంచుకోవాలి..

సబాబుత్, అవిశలాంటి చెట్ల గట్ల మీదా, భూమి వాతావరణం, నీటి వనరులను బట్టి వ్యవసాయంతో పాటు పశుగ్రాసాలు కూడా పండించటం అలవాటు చేసుకోవాలి. బీడు భూములలో పిల్లి పెసరలాంటివి మంచి పశుగ్రాసాలు ఉపయోగపడ్తాయి.



# పశువులకు మేత పెంచే విధానాలు

## మంచి పశుగ్రాసపు లక్షణాలు

- ⭑ రుచికరమైన ఎక్కువ మాంసకృత్తులు కలిగి వుండాలి.
- ⭑ పశువులకు ఏ మాత్రము హాని కల్గించకుండా సులభంగా జీర్ణం కావాలి.
- ⭑ తక్కువ కాలంలో పంట చేతికి రావాలి.
- ⭑ ఎక్కువ దిగుబడి ఇవ్వాలి.
- ⭑ తక్కువ ఎరువులో సాగు చేయగల్గాలి.
- ⭑ నిల్వ చేసుకోటానికి అవకాశం ఉండాలి.
- ⭑ తక్కువ పెట్టుబడిగా ఉండాలి.



***పశుగ్రాసాలు రెండు రకాలు***

1) కాయ జాతి 2) ధాన్యపు జాతి

పై తెల్పిన రెండు రకాలలోను కాయజాతి ఒక సంవత్సరంలో పంట పూర్తి అవుతుంది. (ఏకవార్షికలు) రెండవది, ఒకసారి నాటితే రెండు నుండి అయిదు సంవత్సరాల వరకూ కూడా పంట ఇవ్వగలుగుతుంది. ఇది బహు వార్షికం.

1) కాయజాతిపైర్లు: 1. అలసంద 2. పిల్లిపెసర 3. జనుము.

2) ధాన్యపు జాతి : లూసరిన్.

వాటర్‌షెడ్ కార్యక్రమంలో గ్రామాలలో రైతులు ఒకటి నుండి ఐదు సంవత్సరాల పశుగ్రాసం, అలాగే ఒక సంవత్సరం మాత్రమే పశుగ్రాసం పెంచి, పాతరగడ్డి తయారుచేసుకోటానికి గాను సహకారం అందించబడుతుంది. ఇట్టి సహకారంతో రైతులు పాడిపరిశ్రమలు చేపట్టి అందుకు అయ్యే ఖర్చులు తగ్గించుకొని లాభదాయకంగా పాల ఉత్పత్తిని చేపట్టి, పశుసంపద అభివృద్ధికి వీలు కల్పించబడింది.

ఒక సంవత్సరం నుండి ఐదు సంవత్సరాల వరకూ (బహు వార్షిక) పశుగ్రాసపెంపక విధానాలు ఈ క్రింది విధంగా తెలియజేయటమైనది.

⭑ చౌడు, క్షారనేలలో, ఇసుకనేలలో, నీరు నిల్వఉండే నేలల్లో తప్ప ఇతర భూములలో సాగు చేయవచ్చును.



★ సంవత్సరానికి ఒక ఎకరాకు 100 మెట్రిక్ టన్నుల పశుగ్రాసం ఉత్పత్తి చేయవచ్చును.

★ మొదటి సంవత్సరం 6 కోతలైన తరువాత రెండవ సంవత్సరం ప్రారంభంలో సాళ్ళ మధ్య కలుపు నివారణకు దుక్కిదున్నాలి.

★ రెండవ సంవత్సరం కూడా పై విధంగానే పంటను పొందవచ్చును.

★ ఈ విధంగా సమగ్ర వాటర్ షెడ్ యాజమాన్య పథకంలో రెండు సంవత్సరాల వరకు పంటకు కావలసిన ఎరువులు, నీటి సౌకర్యం దుక్కి దున్నటం కాంప్లెక్స్ ఎరువులు, కలుపు తీయటం, కోత ఖర్చులు మొదలైనవి పొందవచ్చును.

★ భూమిని బాగా దుక్కి దున్నాలి.

★ ఒక ఎకరానికి రెండు మెట్రిక్ టన్నుల పశువుల ఎరువు 50 కేజీల సూక్ష్మ పోషక ఎరువుల మిశ్రమాన్ని కలిపి పొలాన్ని చదును చేయాలి.

★ బోదెలు తయారు చేయాలి.

★ ఎకరానికి 12000 గడ్డి కణుపులు రవాణా చేసి పని ప్రదేశానికి చేర్పించాలి.

★ కణుపులు నాటటానికి చలికాలం తప్ప, ఇతర కాలాలు అనువైనవి.

★ ఒక్కొక్క కణుపు మొక్కను రెండు కణుపులు ఉండేటట్టుగా కత్తిరించుకొని బోదెలపై 60 సెం.మీ దూరంలో ఒక కణుపు భూమిలో ఉండేటట్లుగా, ఏటవాలుగా, మిగిలిన కణుపు భూమిపై ఉండేటట్లుగా నాటాలి.

★ పొలం చుట్టూ ముళ్ళ కంచే ఏర్పాటు చేయాలి.

★ కణుపులు నాటిన 30 రోజుల తర్వాత మొదటి సారిగా కలుపు తీయాలి.

★ కణుపులు నాటిన 30 రోజుల తర్వాత 25 కేజీల యూరియాను వేయాలి.

★ కణుపు నాటిన 60 రోజులకు మొదటి కోత కోయాలి.

★ ఆ తరువాత ప్రతి 45 రోజులకు ఒకసారి కోయవచ్చును.

★ ఈ విధంగా మొదటి సంవత్సర కాలంలో మొత్తం (6 కోతల ద్వారా) 6 సార్లు పంట పొందవచ్చును.

★ ప్రతి కోత తర్వాత కలుపు నివారణకు పనులు చేపట్టాలి.

★ ప్రతికోత తర్వాత 20 కేజీల యూరియాను వినియోగించాలి.

★ ఒకసారి నాటిన పైరు 4 నుండి 6 సంవత్సరాల వరకు దిగుబడినిస్తాయి.

★ ప్రతి 15 రోజులకు ఒకసారి పైరుకు నీరు పెట్టాలి. (కాలానుగుణంగా వర్షాభావ పరిస్థితిని బట్టి)

★ కోత కోసేటప్పుడు భూమికి 6.8 ఇంచులు వదిలికోత కోయాలి.

## ఏక వార్షిక (ఒక సంవత్సరం) పంటలు జొన్న, మొక్కజొన్న

★ సారవంతమైన అన్నిరకముల భూములు ఇందుకు అనువైనవి.

★ నీరునిల్వ ఉన్న భూములు పనికిరావు.

★ వర్షాధార లేదా నీటి సౌకర్యం వున్న భూములలో పశుగ్రాసం పంట సాగు చేసుకోవచ్చును.

★ భూమికి బాగా దున్ని ఎకరాకు 10 బండ్ల పశువుల ఎరువును మరియు 20 కేజీల ఎరువుల మిశ్రమమును వేసి చదును చేయవలయును.

★ తదుపరి గొర్రు సహాయంతో సాళ్ళలో విత్తడం కాని, విత్తనాలు వెదజల్లడం కానీ చేయవలయును.

★ ఎకరాకు 15 నుంచి, 20 కేజీల విత్తనం వాడవలయును

★ విత్తిన సుమారు 40-50 రోజులలో మొదటి కోత కోయవచ్చును.

★ ప్రతికోత తర్వాత 20 కేజీల యూరియా వేసి నీరుపెట్టాలి. (నీటి సౌకర్యం ఉన్నవారు)

★ తదుపరి కోతలు 30-45 రోజుల వ్యవధిలో కోయాలి.

★ పంట పొట్టకు వచ్చినపుడు కోత కోసిన పోషక ఆహారపు విలువలు ఎక్కువగా ఉంటాయి.

★ నీటి ఆధారంగా వేసిన పంటలకు 10-15 రోజులకు ఒకసారి నీరు పెట్టాలి. (కాలానుగుణంగా వర్షాభావ పరిస్థితిని బట్టి)

★ ఒక సంవత్సరంలో ఎకరాకు 40,50 టన్నుల పశుగ్రాసం పొందవచ్చును

పై సూచనలు పాటించి రైతుల పశుసంపద, పాడిపరిశ్రమ అభివృద్ధి చేసుకొనవచ్చును.

# 1989 నాటి ఎస్.సి. ఎస్.టి.లపై అత్యాచారాల నిరోధక చట్టం ఏం చెప్తుంది?

**డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి సారథ్యంలో భారతదేశ ప్రజానీకానికి స్వాతంత్ర్య ఫలంగా అందించిన అమూల్యమైన కానుక 'భారత రాజ్యాంగం'.**

**భారతదేశ సమాజంలో వున్న హెచ్చుతగ్గుల వ్యవస్థకు, ఆ వ్యవస్థలో తరాల తరబడి అణచివేతకు గురై అభివృద్ధి దరిచేరని సమూహాల సమాన హోదా, గౌరవాల కొరకు అనేక హక్కులను, ఆదేశాలను, ఈ రాజ్యాంగాలలో పొందుపరచడం జరిగింది.**

మన రాజ్యాంగంలోని 14,15,16 ఆర్టికల్‌లలో చట్టంలో అందరినీ సమానంగా చూడాలని, కులమత ప్రాంత లింగ బేధ ఆధారంగా వివక్ష చూపకూడదని, ఉద్యోగాలలో సమావేశాలను కల్పించాలని నిర్దేశిస్తున్నాయి.

ఆర్టికల్ 17 ద్వారా అంటరానితనాన్ని పూర్తిగా నిషేధించడం జరిగింది. దీనిని ఏ రూపంలో ఆచరించినా, ఆచరించడానికి ప్రోత్సహించినా, ఈ నిషేధం ద్వారా వ్యక్తులకు సంక్రమించిన హక్కులకు ఏ విధమైన భంగం కలిగించినా అది నేరంగాను, చట్ట ప్రకారం శిక్షార్హంగాను నిర్దేశించింది. అంటరానితనం నిర్మూలనా చట్టం (1955) రెండు దశాబ్దాలు గడిచినా అంటరానితనాన్ని ఏ మాత్రం నిర్మూలించలేక పోయిన నేపథ్యంలో 1976లో దీనినే కొన్ని మార్పులతో 'పౌరహక్కుల పరిరక్షణ చట్టం'గా మార్పు చేయడం జరిగింది.

1989 సంవత్సరంలో అనగా అప్పటికి స్వాతంత్ర్యం వచ్చి 42 సంవత్సరాలు గడిచినప్పటికీ దళిత, గిరిజనులపై జరుగుతున్న హక్కుల ఉల్లంఘన, హింసా దౌర్జన్యాల నేపథ్యం నుండి 'దళిత గిరిజన (అత్యాచార నిరోధక) చట్టం 1989' వచ్చింది.

అయితే ఈ చట్టం అమలుకు సంబంధించిన 'దళిత గిరిజనుల అత్యాచారాల నిరోధక నిబంధనలు 1995'. ఆ తరువాత 6 సంవత్సరాలకు రావడం జరిగింది.

## ఈ చట్టం ప్రత్యేకతలు

- సమాజంలో దళిత, గిరిజనులపై కొన్ని శతాబ్దాలుగా జరుగుతున్న అత్యాచారాలను చట్టంలో గుర్తించడం.
- అత్యాచారాలకు గురైన బాధితులకు తక్షణ సహాయం, రక్షణ కల్పించడం.
- అత్యాచారాలకు గురైన బాధితులకు నష్టపరిహారం చెల్లించడం,
- సత్వర విచారణ న్యాయం కోసం - ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేక న్యాయస్థానాన్ని ఏర్పాటు చేసి ఈ చట్టం క్రింద నమోదయ్యే కేసులన్నింటినీ ఈ ప్రత్యేక న్యాయస్థానాలలోనే విచారణ చేయడం.
- ఈ చట్టం క్రింద నమోదయ్యే కేసులను డిప్యూటీ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ (DSP) అధికారి స్థాయి తక్కువ కాని అధికారితో మాత్రమే విచారణ జరిపించాలి.
- ఈ చట్టం పరిధి క్రిందకు వచ్చే నేరం జరిగినప్పుడు ఆ జిల్లా పోలీసు ఉన్నతాధికారి, జిల్లా కలెక్టరు సంఘటనా స్థలాన్ని వెంటనే సందర్శించి జరిగిన నష్టాన్ని అంచనా వేయాలి. బాధితులకు తగిన రక్షణ, వసతి, రోజువారీ అవసరమైన భత్యం అందేటట్లు చర్యలు తీసుకోవాలి.
- రాష్ట్ర స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు పర్యవేక్షణా కమిటీలను ఏర్పాటు చేసి ప్రతి 3 నెలలకొకసారి సమావేశమై ఈ చట్టం క్రింద నమోదైన కేసులను, పరిస్థితిని, దళిత గిరిజనులపై జరుగుతున్న అత్యాచారాలు చేపట్టి, నివేదికలు తయారుచేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలి.
- ఈ చట్టం క్రింద కేసు నమోదైన నాటి నుండి 30 రోజుల లోపల విచారణ పూర్తిచేసి ఛార్జిషీటును దాఖలు చేయాలి.
- ఈ చట్టం క్రింద ఏ అధికారియైన బాధ్యతలను సరిగా నిర్వహించ నట్లైతే ఆ అధికారి శిక్షార్హుడు.
- రాష్ట్ర ప్రభుత్వం అత్యాచారాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాల ను, జరగడానికి అవకాశమున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి నివారణ ప్రణాళికలు, వ్యూహాలను రూపొందించి అమలు చేయాలి.
- రాష్ట్ర స్థాయిలో నోడల్, ప్రత్యేక అధికారులను నియమించి చట్టం సక్రమ అమలుకు తగిన చర్యలు చేపట్టాలి.
- ప్రత్యేక కోర్టులలో ఈ కేసులను ప్రభుత్వం నుండి బాధితుల తరపున వాదించడానికి అనుభవం కలిగిన న్యాయవాదులతో జాబితా తయారు చేసి అందుబాటులో వుంచాలి.
- ఒకవేళ బాధితులు కోరుకున్నట్లైతే వారు కోరుకొన్న న్యాయవాదిని ప్రభుత్వం అంగీకరించిన ఫీజు ప్రకారం నియమించవచ్చు.
- అన్నింటికంటే ముఖ్యమైంది ఈ చట్టం క్రింద నిందితులు ముందస్తు బెయిలు పొందే అవకాశం లేకపోవడం. ఇలా అనేకమైన అంశాలతో ఈ చట్టం మాములు చట్టాలతో పోలిస్తే ఒక భిన్నమైన చట్టంగా రూపొందించబడింది.

## ఈ చట్టం క్రింద గుర్తించబడిన అత్యాచారాలు

ఈ చట్టంలోని సెక్షన్‌లో క్రింద సెక్షన్ 3(1), సెక్షన్ 3(2) అని రెండు

ఉపసెక్షన్‌ల క్రింద శిక్షార్హమైన నేరాలు గుర్తించబడే అత్యాచారాలను వివరించడం జరిగింది.

ఉపసెక్షన్ 3(1) క్రింద పదిహేను రకాల అత్యాచారాలు, ఉపసెక్షన్ 3(2) క్రింద 7 అత్యాచారాలు గుర్తించబడ్డాయి.

ఈ అత్యాచారాలన్నీ షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు చెందిన వ్యక్తులపై చేసినట్లైతే ఈ చట్టం వర్తిస్తుంది.

ఉపసెక్షన్ 3(1)లో క్లాజు (1) నుండి క్లాజు (3) అనగా సెక్షన్ 3(1)(1) నుండి సెక్షన్ 3(1)(3) ల క్రింద వ్యక్తి గౌరవానికి భంగం కలిగించే అత్యాచారాలను గుర్తించడం జరిగింది.

***3(1) (i) :*** తినరాని అసహ్యకర పదార్థాలను బలవంతంగా తినిపించినా, త్రాగించినా.

***3(1) (ii)*** : షెడ్యూలు కులాలు లేక షెడ్యూలు తెగల వ్యక్తులను కించపరచడానికి, గాయపరచడానికి, అవమాన పరచడానికి లేక ఇబ్బందికి గురి చేయడానికి వారిని నివాస లేక పరిసర ప్రాంతంలో మలాన్ని, కళేబరాలను, తన ఇతర అసహ్యకర పదార్థాలను పడవేసినా.

***3(1) (iii)*** :షెడ్యూలు కులాలు లేక షెడ్యూలు తెగలకు చెందిన వ్యక్తి మానవ గౌరవాన్ని భంగపరచాలని వారి బలవంతంగా మొహానికి రంగు పూసి, వారి బట్టలను ఊడదీసి ఊరేగించడం, లేక ఇటువంటి ఏ ఇతర చర్యలకైనా పాల్పడటం.

సెక్షన్ 3(1)(iv), 3(1)(v) లు షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు చెందిన సభ్యుల ఆస్తులకు సంబంధించి జరిగే ఆత్యాచారాలు.

***3(1) (vi) :*** షెడ్యూలు కులాలు,షెడ్యూలు తెగలకు చెందిన వ్యక్తి సొంతభూమిని గాని, ప్రభుత్వభూమిని కేటాయించే అధికారం గల అధికారి కేటాయించిన భూమిని గాని లేక కేటాయించడానికి ప్రకటించిన భూమినిగాని అక్రమంగా ఆక్రమించుకొని సాగు చేసుకున్నపుడు, లేక తన పేరుపై మార్పు చేసుకున్నపుడు.

***3(1) (v) :*** షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు చెందిన వ్యక్తిని అతని భూమి నుండి లేక ఆవరణం నుండి అక్రమంగా తొలగించినా లేక ఆ వ్యక్తి అనుభవిస్తున్న భూమి లేక నివాసప్రాంగణం లేక నీరుపై గల హక్కులను భంగపరిచినా.

***3(1) (vi) :*** షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు ప్రభుత్వం తప్పనిసరై ప్రజోపయోగ పనులకు తప్ప, ఇతరులు బలవంతంగా వెట్టిచాకిరి చేయించడంగాని, బలవంతంగా పని చేయించడం గాని ఈ చట్టం క్రిందనేరం.

***3(1) (vii) :*** షెడ్యూలు కులాలు,షెడ్యూలు తెగలకు చెందిన వ్యక్తిని చట్టం ప్రకారం నిర్దేశించి ఓటు వేసే విధానంలో కాకుండా, ఇతర విధంగా ఓటు వేయమనడం, తాను చెప్పిన వ్యక్తికే ఓటు వేయమనడం, లేక వేయవద్దని బలవంతపెట్టడం.

***3(1) (viii) :*** షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు చెందిన వ్యక్తి తప్పు కేసులు, దురుద్దేశంతో గాని లేక పగ సాధించుకోవడానికి సివిల్, క్రిమినల్ కేసులలో ఇరికించడం.

***3(1) (ix) :*** షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు వ్యక్తిపై ప్రభుత్వ అధికారికి తప్పుడు సమాచారం అందించి, ఆ వ్యక్తిని గాయపరచడానికి, ఏ విధంగానైనా సరే ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నం చేయడం.

***3(1) (x) :*** బహిరంగ ప్రదేశంలో పలువురి ఎదుట షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు చెందిన వ్యక్తిని ఉద్దేశ్య పూర్వకంగా అవమాన పరచడం, వేదనకు గురిచేయడం.

***3(1) (xi) :*** షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు చెందిన మహిళ గౌరవాన్ని భంగపరిచి ఆమెను అవమానం చేయాలనే తలంపుతో ఆమెపై బలప్రయోగం చేయడం.

***3(1) (xii) :*** షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు చెందిన మహిళపై ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా ఆధిపత్యం చలాయించగల స్థానం, స్థాయిలో వుండి, ఆమెను లైంగికంగా ఉపయోగించుకొన్న ఎడల.

***3(1) (xiii) :*** షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు వ్యక్తులు సాధారణంగా వుపయోగించే కాలువలు, బావులు, చెరువులు, వాగులు, ఇతర ఏ వనరులనైనా వారి సాధారణ వుపయోగానికి పనికి రాకుండా పాడు చేయడం.

***3(1) (xiv) :*** షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల వ్యక్తులు సాంప్రదాయకంగా ఉపయోగించుకొంటున్న దారులను మూసివేసినా, వెళ్ళకూడదని అడ్డగించినా, ఇదే విధంగా ఇతరులందరూ ఉపయోగించుకుంటున్న దారులను షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల వారిని ఉపయోగించుకోనీక అడ్డగించినా.

***3(1) (xv) :*** షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల వారిని వారి ఇళ్ళ నుండి లేక గ్రామం నుండి లేక వారు నివాసముంటున్న స్థలం నుండి వదిలి వెళ్ళి పోవడానికి బలవంతపెట్టినా లేక అందుకు కారణమైనా.

ఈ చట్టం క్రింద శిక్షార్హమైన నేరంపై కనబరచిన 3(1)(v) లేకా 3(1)(xv) వరకు చేసిన నేరాలకు 6 నెలలకు తక్కువ గాకుండా 5 సంవత్సరాల వరకు జైలుశిక్ష, జరిమానా విధించబడును.

సెక్షన్ 3(2)(ii) లో క్లాజు (1) నుండి (7) వరకు ఏడు రకాలైన అత్యాచారాలను శిక్షార్హమైన నేరాలుగా గుర్తించడం జరిగింది.

***3(2) (ii) :*** తన అబద్ధపు సాక్ష్యంతో షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష, లేక మరణశిక్ష విధించే అవకాశముందని తెలిసీ ఒక అమాయకపు షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల వ్యక్తికి మరణ శిక్ష పడేటట్లు సాక్ష్యం చెప్పిన వ్యక్తికి మరణశిక్ష విధించవచ్చు, లేక యావజ్జీవ కారగారశిక్ష, జరిమానా విధించవచ్చు.

సెక్షన్ 3(2)(ii) తన అబద్ధపు సాక్ష్యం ద్వారా ఒక షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలుకు చెందిన వ్యక్తికి ఏడేండ్ల జైలు శిక్ష పడుతుందని తెలిసీ తప్పుడు సాక్ష్యం చెప్పిన వ్యక్తి ఈ చట్టం క్రింద 6 నెలలకు తక్కువ కాకుండా 7 సంవత్సరాల వరకు కారాగార శిక్ష, జరిమానాతో శిక్షించబడతాడు.

***3(2) (iii) :*** షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల వ్యక్తికి చెందిన

ఆస్తులను నష్టపరచాలనే తలంపుతో కాని, లేక తన చర్యల వలన వారి ఆస్థినష్టం జరుగుతుందని తెలిసీ నష్టపెట్టడం లేక ప్రేలుడు పదార్థాల ను వుపయోగించి పేల్చి వేయడం చేసిన వ్యక్తికి ఆరు నెలలకు తక్కువ కాకుండా 7 సంవత్సరాల వరకు జరిమానాతో కూడిన కారాగార శిక్ష విధించవచ్చు.

***3(2) (iv) :*** షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు చెందిన వ్యక్తులు సాధారణంగా వుపయోగించుకొంటున్న ప్రార్థనా స్థలాలను, లేక నివాసముంటున్న ఇళ్ళను, లేక షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు చెందిన వ్యక్తి తన ఆస్తి లేక వస్తువులను భద్రపరచుకొంటున్న గృహాన్ని గాని ధ్వంసం చేయాలనే తలంపులో, తన తన చర్యల వలన ధ్వంసమవుతాయని తెలిసీ తగుల బెట్టినా, లేక ప్రేలుడు పదార్థాలను ఉపయోగించి పేల్చి వేసినా ఆ వ్యక్తికి జరిమానాతో కూడిన యావజ్జీవ కారాగార శిక్ష విధించవచ్చును.

***3(2) (v) :*** భారతీయ శిక్షాస్మృతి (45 1860) ప్రకారం పది సంవత్సారాలు లేక అంతకుపైబడి శిక్షపడే నేరాన్ని ఒక షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు చెందిన వ్యక్తిపైగాని, అతని ఆస్తిపైగాని వేసిన యెడల ఆ నేరం చేసిన వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష విధించవచ్చు.

***3(2) (vi) :*** ఈ చట్టం క్రింద కనబరచిన నేరాలను చేసిన నిందితున్ని కాపాడాలనే వుద్దేశ్యంలో ఆ నేరాలకు సంబంధించిన సాక్ష్యాలను నాశనం చేసినా, లేదా తప్పు సమాచారం ఇచ్చినా, ఆ నేరానికి విధించే శిక్షను ఈ వ్యక్తికి కూడా విధించవచ్చును.

***3(2) (vii) :*** ఒక ప్రభుత్వ ఉద్యోగిగా వుంటూ ఈ చట్టం క్రింద ఏదైనా నేరం చేసినట్లైతే, ఒక సంవత్సరానికి తక్కువ గాకుండా కారాగార శిక్ష, ఈ చట్టం క్రింద ఆ నేరానికి నిర్ధేశించబడిన శిక్ష ఎంత వుందో ఆ మేరకు శిక్షించవచ్చు.

## కొన్ని ముఖ్యమైన ఇతర సెక్షన్లు

సెక్షన్ **4** : ఈ చట్టం క్రింద విధి నిర్వహణా లోపానికి శిక్ష. షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు చెందిన ప్రభుత్వ అధికారి ఈ చట్టం క్రింద తాను నిర్వహించవలసిన కర్తవ్యాన్ని ఉద్దేశ్యపూర్వకంగా నిర్లక్ష్యం చేసిన ఎడల 6 నెలలు తక్కువ గాకుండా ఒక సంవత్సరం కారాగార శిక్ష విధించవచ్చు.

సెక్షన్ **5** : ఈ చట్టం క్రింద రెండవసారి నేరానికి శిక్షాకాలం పెంపు. ఈ చట్టం క్రింద పేర్కొన్న నేరాలను చేసి శిక్ష విధింపబడిన వ్యక్తి రెండవసారి నేరం చేస్తే, ఒక సంవత్సరం తక్కువ కాకుండా ఆ నేరానికి పొందు పరిచిన శిక్ష విధించవచ్చు.

సెక్షన్ **6** : భారతీయ శిక్షాస్మృతి (1860) లోని సెక్షన్ 34, అధ్యాయం, IV, V, VA, సెక్షన్ 149, అధ్యాయం 23 లలోని అంశాలను ఈ చట్టం కొరకు కూడా అదేవిధంగా ఉపయోగించవచ్చును.

సెక్షన్ **7** : నేరం చేసిన వ్యక్తుల ఆస్తులను జప్తు చేయటం గురించి తెలియచేస్తుంది.

*సెక్షన్ 7(1) :* నేరస్థుడు నేరానికి ఉపయోగించిన స్థిర చరాస్తుల ను ప్రభుత్వ పరం అయినట్లు కోర్టు లిఖిత పూర్వకంగా ప్రకటించడం.

*సెక్షన్ 7(2) :* విచారణ ముగిసే వరకు స్థిర చరాస్తులను కోర్టు ఆధీనంలో ఉంచుకోవడం.

సెక్షన్ **10** : నేరం చేస్తాడని భావించిన వ్యక్తిని ఆ ప్రాంతం నుండి బహిష్కరించటం గురించి..

సెక్షన్ **14** : జిల్లాకో ప్రత్యేక ఏర్పాటు గురించి.

సెక్షన్ **15** : ప్రతి ప్రత్యేక కోర్టుకు ఒక ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ నియమకం గురించి.

సెక్షన్ **16** : సామూహిక జరిమానా విధించటానికి రాష్ట్ర ప్రభుత్వానికి గల అధికారం గురించి.

సెక్షన్ **17** : శాంతి భద్రతల యంత్రాంగం చేపట్టవలసిన ముందస్థు నిరోధక చర్యల గురించి...

సెక్షన్ **18** : ఈ చట్టం క్రింద నేరస్థులకు ముందస్తు బెయిలు వర్తించకుండుట గురించి...

సెక్షన్ **21** : ఈ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవలసిన తగిన చర్యలు గురించి.

(i) బాధితులకు న్యాయ సహాయం.

(ii) పరిశోధన, విచారణ సమయాల్లో ప్రయాణ, పోషణ ఖర్చు

(iii) ఆర్థిక, సాంఘిక, పునరావాస ఏర్పాట్లు

(iv) నేర విచారణ, పర్యవేక్షణ అధికారుల నియామకం.

(v) ఆయా స్థాయిలలో కమిటీల ఏర్పాటు.

(vi) తగు సలహాల కొరకు సర్వేతో నిర్వహించటం

(vii) అత్యాచార ప్రాంతాలను గుర్తించి, తగు చర్యలు చేపట్టడం.

పైన కనబరచిన అంశాలన్నీ ఈ చట్టంలో చెప్పబడిన అంశాలు కాగా ఈ చట్టం అమలు కోసం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు అత్యాచారాల నిరోధక నిబంధనలు 1995లో అనేక నిబంధనలను రూపొందించారు.

**రూల్ 3** : ప్రభుత్వం చేపట్ట వలసిన ముందస్తు నిరోధక చర్యల గురించి.

**రూల్ 4** : ప్రాసిక్యూషన్‌ను పర్యవేక్షించడం, నివేదికలు సమర్పించడం గురించి.

**రూల్ 5** : పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జీగా వున్న పోలీస్ అధికారికి అత్యాచారం గురించిన సమాచారంతో బాధితులు వచ్చినపుడు ఆ అధికారి నిర్వర్తించవలసిన బాధ్యతల గురించి.

**రూల్ 6** : తమ పరిధిలోని ప్రాంతంలో షెడ్యూలు కులాలు,షెడ్యూలు తెగల వ్యక్తులపై అత్యాచారం జరిగిందని తెలిసినప్పుడు జిల్లా, డివిజనల్ అధికారులు ఆ ప్రాంతాన్ని సందర్శించి, నిర్వర్తించవలసిన బాధ్యతల గురించి.

**రూల్ 7** : విచారణాధికారిని నియమించడం, సంఘటన జరిగిన 30 రోజుల్లో విచారణ పూర్తిచేసి ఎస్పీకి నివేదిక ఇవ్వడం, దీనిపై పురోగతికి ప్రతి 3 నెలలకొకసారి రాష్ట్ర స్థాయిలో అధికారులు సమీక్షించడం గురించి.

**రూల్ 8** : షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల పరిరక్షణ సెల్ ఏర్పాటు చేయడం గురించి.

**రూల్ 9** : ఈ చట్టం క్రింద నిర్దేశిత బాధ్యతలను నిర్వహించవలసిన వివిధశాఖల అధికారుల మధ్య సమన్వయాన్ని పెంపొందిస్తూ ఎప్పటికప్పుడు సమీక్షించడానికి ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించడం గురించి.

**రూల్ 10** : స్పెషల్ ఆఫీసర్ల నియామకం గురించి బాధితులకు తగిన రక్షణ, సదుపాయాల ఏర్పాటు, అత్యాచారక నిరోధక చర్యలు, చట్టం, హక్కుల పట్ల వారిలో అవగాహన పెంచడం, బాధ్యతల నిర్వహణ గురించి.

**రూల్ 11** : అత్యాచార బాధితులకు, వారిపై ఆధారపడిన వ్యక్తులకు, సాక్షులకు ప్రయాణభత్యం రోజువారీ భత్యం, నిర్వహణ ఖర్చులు, ప్రయాణ సౌకర్యాల గురించి...

**రూల్ 12** : జిల్లా పరిపాలనా యంత్రాంగం తీసుకోవలసిన చర్యల గురించి.

**రూల్ 13** : అత్యాచారం జరిగిన ప్రాంతంలో నియమించబడే అధికారులు, ఇతర సిబ్బంది నియామకం, ఎంపిక చేసుకోవడం గురించి షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల సమస్యల పట్ల సరైన అవగాహన కలిగివుండే వారుగా, షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల నుండి వచ్చిన వారు వుండేట్లు చూడడం గురించి.

**రూల్ 14** : రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత గురించి - బడ్జెట్ కేటాయింపు, అధికారుల నియమకాలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నియామకాలు, సంవత్సరానికి రెండుసార్లు సమీక్షలు, నివేదికలు, ముందస్తు జాగ్రత్తలు పునరావాస చర్యలు - గురించి.

**రూల్ 15** : రాష్ట్ర ప్రభుత్వం కంటింజెన్సీ ప్రణాళిక అధికార గెజిట్‌లో ప్రచురించడం, సహాయ కార్యక్రమాల ప్యాకేజీ అంశాలు, అధికారుల బాధ్యతల గురించి.

**రూల్ 16** : రాష్ట్ర స్థాయి విజిలెన్స్ (నిఘా), మానిటరింగ్ పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు.

**రూల్ 17** : జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీల ఏర్పాటు గురించి - వారి బాధ్యతలు ప్రతి 3 నెలలకొకసారి సమావేశం- సమీక్ష గురించి.

**రూల్ 18** : రాష్ట్ర ప్రభుత్వం - ప్రతి సంవత్సరం మార్చి 31 ముందుగా చట్టం అమలు చేసేందుకు గత సంవత్సరంలో తీసుకొన్న చర్యలు, పథకాలు, ప్రణాళికలు, చర్యల గూర్చి ఒక వార్షిక నివేదిక తయారు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపడం గురించి.

అనుబంధం 1, షెడ్యూలు (రూల్ 12(4) లో ధన సహాయం కొరకు పాటించవలసిన నియమాల గురించి తెలియపరచబడింది.

అయితే అమలులో అనేక లోటుపాట్లు చోటుచేసుకోవడం వలన ఈ చట్టం బాధితులలో నమ్మకాన్ని పెంచకపోగా, వారిని నిరుత్సాహానికి, నిస్పృహకు గురిచేస్తున్నది.

బాధితులను బెదిరించి కేసు రాజీ చేసికోవడానికి నిందితులకు తగినంత సమయాన్ని చేకుర్చుతూవుంది.

ఇతర కులస్థుల నుండి సాక్షులు కడ వరకు నిలువక పోవడం షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల నుండి సాక్షులను పరిగణనలోకి తీసికోకపోవడం వలన కేసులు నీరుగారి పోతున్నాయి.

మరోవైపు ఈ చట్టం దుర్వినియోగమౌతుందని కొందరు గగ్గోలు చేస్తున్నారు. అతి కష్టం మీద కేసు నమోదైనా నిందితులు ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ వేసి- కేసు న్యాయ విచారణ, నిందితుల అరెస్టు తదితర ప్రకియలన్నింటిపై విచారణకు తాత్కాలిక (నిలుపుదల) ఉత్తర్వులు తీసుకొని రావడం వల్ల ఇక శాశ్వతంగా ఆ కేసును నిలుపుదల చేయడం వంటివి సర్వసాధారణంగా జరిగే ప్రక్రియలై, ఈ చట్టం ఉనికినే ప్రశ్నార్థకంగా తయారుచేస్తున్నాయి.

ఇటువంటి పరిస్థితులలో చట్టాన్ని విస్తృతంగా ప్రజలలోకి తీసికొని వెళ్ళవలసిన అవసరమెంతో వుంది. ఇందుకు ప్రభుత్వం అనేక చైతన్య కార్యక్రమాలను చేపట్టాలి. మహిళా సంఘాలలోనూ, గ్రామ పంచాయతీలలోను శ్రమశక్తి సంఘాలలోనూ, స్వచ్ఛంధ సంస్థల ద్వారా ప్రజలలో ఈ చట్టం పట్ల అవగాహన కల్పించాలి.

- ⭑ కమిటీలన్నీ సక్రమంగా పని చేసేటట్లు చూడాలి.
- ⭑ బాధ్యతలను నిర్లక్ష్యం చేసిన అధికారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి.
- ⭑ కేసుల విచారణ, చార్జిషీటు తయారు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియమకం మొదలగు విషయాలలో లోటుపాట్లను పూరించి ఎక్కువ కేసులలో శిక్షలుపడే విధంగా చూడాలి.
- ⭑ చట్టాన్ని మరింత ప్రతిభావంతంగా అమలు చేయాడానికి చట్టంలో సవరణలు, సమూల మార్పులు తీసికొని రావాలి.

ఈ విధంగా జరిగితే దళిత, గిరిజనులలో చట్టం పట్ల విశ్వాసం పెరుగుతుందని ఆశించవచ్చు.

దళిత, గిరిజనల నుండి యువత, మేధావులు ముందుకు వచ్చి ఈ చట్టం సక్రమమైన అమలుకొరకు జిల్లా, డివిజన్ల స్థాయిలలో కమిటీలుగా ఏర్పడి అమలులో జరిగే లోటుపాట్లును ఎత్తి చూపుతూ, అందుకు బాధ్యులైన అధికారులలో ప్రజలలో ఈ చట్టం పట్ల అవగాహన కల్పించాలి. ◆

# గిరిజన వ్యవసాయ రంగానికి నిధుల కోత!

**గిరిజన రైతులకు భరోసా కరువవుతోంది. గిరిజనాభివృద్ధి కోసం అనేక ప్లాన్‌లు అమలు చేస్తున్నామంటున్న ప్రభుత్వం ఏజెన్సీ రైతులను గాలికొదిలేస్తోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా అందుబాటులో విత్తనాలు లేక సాగుకు రైతులు వెనుకంజ వేస్తున్నారు. ఈ ఏడాది కూడా పడిగాపులు తప్పేలా లేవని ఆందోళన చెందుతున్నారు.**

గతంలో సబ్సిడీపై కోట్లాది రూపాయల విలువైన విత్తనాలు, ఎరువులు అందజేస్తూ వచ్చిన ఐటీడీఏను ప్రస్తుతం నిధుల లేమి వెంటాడుతోంది. గిరిజన రైతులకు సబ్సిడీలు అందించేందుకు నిధులు కావాలని ఐటీడీఏ అధికారులు ప్రతిపాదనలు పంపిస్తున్నా ప్రభుత్వం నుంచి ఆమోదం లభించటం లేదు.

ఆధునిక వ్యవసాయం పేరుతో పనిముట్లు అందజేయాలని ఆదేశిస్తున్నా, వాటికి కూడా అరకొర నిధులనే అందిస్తుంది. రెండేళ్లగా ఇదే పరిస్థితి నెలకొంది. సలహాలు అందజేయటమే తమ పని అని ఐటీడీఏ అధికారులు చెబుతుండటంతో సాగుపై గిరిజన రైతులు ఆలోనలో పడుతున్నారు. ప్రభుత్వ తీరుపై తీవ్రంగా మండిపడుతున్నారు.

జిల్లాలోని 29 ఏజెన్సీ మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో సుమారుగా మూడు లక్షల ఎకరాలను గిరిజనులు సాగు చేస్తుంటారు. దీనిలో వరి 80 వేల ఎకరాలు, పత్తి లక్ష ఎకరాలు, మిరప 80 వేల ఎకరాల్లో సాగు చేస్తారు. మిగతా విస్తీర్ణంలో పెసలు, మినుములు, మొక్కజొన్న అపరాలు సాగు చేస్తున్నట్లుగా అధికారుల నివేదికలు చెబుతున్నాయి.

ప్రతి యేటా సీజన్‌లో గిరిజన రైతులకు విత్తనాలు, ఎరువులు, ఇతర పనిముట్లను ఐటీడీఏ నుంచి సబ్సిడీపై అందజేసేవారు. కానీ రెండేళ్లుగా విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై ఇవ్వటం లేదు. వీటి కోసం రైతులు, వ్యాపారస్తులు, దళారులను ఆశ్రయిస్తుండటంతో పండించిన పంటను కూడా దళారులకే అప్పగించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. సబ్సిడీపై విత్తనాలు లేవు.

గతంలో వరి, మిర్చి, మొక్కజొన్న, మిరప, పత్తి విత్తనాలు మరియు ఎరువులు సబ్సిడీపై అందజేసేవారు. ప్రస్తుతం ఐటీడీఏ ద్వారా గిరిజన రైతులకు సబ్సిడీపై విత్తనాలు ఇవ్వటం లేదు. వీటిని రైతులే తయారు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించటంతో ఐటీడీఏ అధికారులు చేతులెత్తేశారు.

గ్రామ విత్తనోత్పత్తి పథకం పేరిట మండలానికి ఐదు చొప్పున సీడ్ విలేజ్ (విత్తన తయారీ గ్రామం) లను ఎంపిక చేశారు. ఇలా ఎంపిక చేసిన గ్రామంలో ప్రతి రైతు ఒక ఎకరం పొలంలో నాణ్యమైన పంట పండించేందుకు నాణ్యమైన విత్తనాలను సిద్ధం చేసుకునేలా ఐటీడీఏ ప్రోత్సహించేది. ఇలా ఎంపిక చేసిన రైతులు పండించిన మొత్తం పంటను విక్రయించు కోవడానికి వీల్లేదు.

కానీ పంట అమ్ముకుంటేనే తప్ప కుటుంబం గడవని గిరిజనులు దీనిపై పెద్దగా ఆసక్తి చూపలేదు. ఐటీడీఏ అధికారుల నివేదికల్లో తప్ప సీడ్ విలేజ్‌ల జాడ ఎక్కడా లేకుండా పోయింది. అందుబాటులో విత్తనాలు లేకపోవటంతో గిరిజన రైతులు కూడా మండల వ్యవసాయ శాఖ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయక తప్పడం లేదు.

### వ్యవసాయానికి నిధుల కోత

గిరిజనులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రెండేళ్ల నుంచి ఐటీడీఏ వ్యవసాయశాఖకు నిధుల కోత పెడుతుంది. 2011–12 వ్యవసాయ ప్రణాళికకు ప్రభుత్వం నుంచి ఆమోదమే లభించలేదు.



2012–13 ప్రత్యేక ప్రణాళిక పేరిట రూ.10 కోట్లకు ప్రతిపాదనలు పంపించగా... రూ.4.37 కోట్లను మంజూరు చేశారు. ఇవి కూడా కేవలం కృషి సెంటర్లు ఇచ్చే వ్యవసాయ పరికరాలకు మాత్రమే కేటాయించాలని ప్రభుత్వం సూచించింది.

ఈ ఏడాది కూడా రూ. 10 కోట్లతో వ్యవసాయశాఖ ప్రతిపాదనలు పంపించినా ఇంతవరకు ఎటువంటి స్పష్టతలేదు. పనిముట్లు అందజేసేందుకు మాత్రం అధికారులను ఉరుకులు, పరుగులు పెట్టిస్తోంది. మహిళా రైతులు ఏర్పాటు చేసిన కృషి సెంటర్లకు ట్రాక్టర్లు, ట్రక్కులు, రోటోవేటర్లు, కల్టివేటర్లు, నాగళ్లు, ఆయిల్ ఇంజన్‌లు వంటి పరికరాలు అందజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఆధునిక పద్ధతుల్లో సాగు చేసేందుకు గిరిజన రైతులను ప్రోత్సహించేందుకు కసరత్తు చేస్తున్నా విత్తనాలు, ఎరువులు లేకుండా పరికరాలు ఏం ప్రయోజనమనే ఉత్పన్నమవుతున్నాయి. కృషి బినామీలు పాగా మహిళా రైతు సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లుగా చెబుతున్నారు.

*- సి.ఎం.పి.*

# సేవే పరమార్థం - అదే గణపతి మార్గం

ఆ యువకుడు అధికారం కోసం వెంపర్లాడలేదు. నేటి పరిస్థితులకు అనుగుణంగా మద్యం, డబ్బు, బిర్యాని ప్యాకెట్లు పంపిణీ చేయలేదు. తన గ్రామ ప్రజలకు సేవ చేయడమే ప్రధాన కర్తవ్యంగా భావించారు. ఎన్నికలతో సంబంధం లేకుండానే పరోపకారార్థం మిదం శరీరం అన్న భావనతో తోటి వారికి సహాయం చేస్తున్నాడు.

'సేవకుడిగా నడుచుకోవడం నేర్చుకో నాయకుడిగా ఎదగ గలుగుతావు' అని స్ఫూర్తివంతంగా పలికిన వివేకానందుని హితోక్తిని ఆదర్శంగా తీసుకున్న ఆ యువకుడు విద్యార్థి దశ నుంచే తన తోటివారి బాధను తన వేదనగా భావించి వారి సమస్య పరిష్కారానికి నిరంతరం తపించాడు.

తన పల్లెలోని సమస్యలకు పరిష్కారం చూపడానికి ఏ నాయకుడు చేయని విధంగా గ్రామం బాగు కోసం చొరవ చూపాడు. ఆ బాధ్యత, చొరవలే ఆయువకుడిని అందలమెక్కించింది. తమ గ్రామానికి సర్పంచిగా అత్యధిక మెజారిటీతో గెలిపించుకొని.. డబ్బు, మద్యం, బిర్యానీ ప్యాకెట్లకు తాము వెంపర్లాడమని, తమ వెన్నంటే ఉండి తమ కష్టాలు బాపడానికి కృషి చేసిన గణపతి సేవలకే పట్టం కడతామని నిరూపించారు శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం కింతలి గ్రామ ప్రజలు. ఆ గ్రామస్థుల ఆదరాభిమానాలను చూరగొన్న దవళ గణపతి విజయగాథ ఇది.

## సేవే పరమార్థం

కింతలి గ్రామానికి చెందిన ధవళ గణపతి నిరుపేద కుటుంబంలో జన్మించారు. అతని తల్లి దండ్రులు వ్యవసాయ కూలీలు. ఎం.ఎ ఎడ్యుకేషన్ వరకు చదివారు. అతి సామాన్యుడైన 29 ఏళ్ళ గణపతికి సెంటు భూమి గాని, బ్యాంకు బ్యాలెన్సు గాని లేవు. రాజకీయ నేపథ్యం అసలే లేదు. తనకు తెలిసినదల్లా ఒక్కటే. గురజాడ అప్పారావు చెప్పినట్లు 'సొంతలాభం కొంతమానుకొని పొరుగు వాడికి సాయ పడవోయ్' అన్న స్ఫూర్తితో తన



మిత్రుల సహకారంతో జ్ఞానోదయ యువజన సంఘం స్థాపించి సంఘ సేవకు ఉపక్రమించాడు.

తన ప్రజల కోసం నిరంతరం తపించాడు. తాను నడుంకట్టి స్థానికులను భాగస్వాములను చేసి శ్రమదాన కార్యక్రమాలను చురుగ్గా నిర్వహించారు. ఆయన ప్రతి సోమవారం కలక్టరేట్‌లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగానికి తన గ్రామస్థులను తీసుకు వెళ్ళి అధికారులను కలిసి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. చేయి చేయి కలుపుదాం మన గ్రామాన్ని మనమే బాగు చేసుకుందామన్న కాంక్షను ప్రజలలోను యువతలోను చైతన్యం కల్పించారు.

తన సేవా కార్యక్రమాలలో ప్రజలను భాగస్వాములను చేశారు. స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలోని మంచినీటి బావిని శుభ్రపరిచి తాగునీటి యోగ్యంగా మార్చారు. తన గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న లోవోల్టేజి సమస్యను పరిష్కరించడానికి నల్లగుండ చెరువు నుండి పెద్దిగారి సూరిశాల వరకు విద్యుత్ లైను వేయించి ట్రాన్స్‌ఫార్మరు ఏర్పాటు చేయించడంలో కృతకృత్యుడయ్యాడు. ఖాజీపేట రహదారిని నిర్మించడంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఆయన ఉపాధి హామీ పథకం మేట్‌గా పని చేస్తూ వేతన జీవులకు రూ. 20 నుంచి రూ.50 వరకు అందే వేతనాన్ని రూ. 80 నుంచి 150 వరకు సమకూరేలా కృషి చేశారు. దీంతో గత సర్పంచి ఎన్నికలలో 800 మంది వేతన కూలీలు అతనికి బాసటగా నిలిచి అనూహ్యమైన విజయాన్ని సాధించడంలో తోడ్పాటును అందించి తమ కృతజ్ఞతను చాటారు.

## విద్యార్థిగా సేవాభావానికి అంకురార్పణ

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎం.ఎ ఎడ్యుకేషన్ చదువుతున్నప్పుడూ సేవలలో ముందుండే గణపతి వర్సిటీ బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షునిగా పని చేశారు. ఆ సమయంలోనే విద్యార్థుల సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు విశ్వ విద్యాలయం ఆచార్యుల ద్వారా ఆర్థిక సహాయం అందించేవారు. గణపతి సేవలను మెచ్చిన రాష్ట్ర బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ప్రత్యేకంగా అభినందించారు.

## సేవలకు గుర్తింపు- సర్పంచిగా గెలుపు


2013 జులైలో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికలలో కింతలి గ్రామ సర్పంచిగా ప్రజల ప్రోద్బలంతో ఏ రాజకీయ పార్టీ సహాయం లేకుండా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. మద్యం, మందు, విందుల వంటి ప్రలోభాలకు ఆస్కారం ఇవ్వకుండా తన సేవా కార్యక్రమాలనే ప్రచార అస్త్రాలుగా చేసి ముందుకు కదిలాడు. ఆ గ్రామంలో 2337 ఓట్లు ఉండగా 1087 ఓట్ల అత్యధిక మెజారిటీతో గెలుపొందిన గణపతి, తన ప్యానల్‌కు చెందిన 12 మంది వార్డు సభ్యులను గెలిపించుకొని ఆ ఊరు దళపతి అయ్యారు.

## భారత్ నిర్మాణ్ వలంటీరుగా..

మరో విశేషం ఏమిటంటే ఆయన సర్పంచిగా ఎన్నికయిన తరువాత భారత్ నిర్మాణ్ వాలంటీరుగా చేరడంతో పాటు మరో 30 మంది

# ప్రజాకవి కాళోజీ నారాయణరావు

**మనిషిని చదివిన, మానవత్వమున్న కవి, రచయితలలో కాళోజి ఒకరు. మనిషి బాధలను, వేదనను గ్రహించి స్పందించి, ఆ స్పందనను కవిత రూపంలో వ్యక్తం చేశారు కాళోజి. అంటే తాడిత, పీడిత జనాల బాధలను గ్రహించి చేతనైన వరకు సహకరించారు. ఆ బాధలను కవిత రూపంలో వ్యక్తం చేసిన పేద ప్రజల కవి కాళోజి అని చెప్పవచ్చును.ప్రజల గురించి, ప్రజల కోసం, ప్రజల భాషలో కవిత్వం వ్రాసిన అచ్చమైన, స్వచ్ఛమైన ప్రజాకవి కాళోజీ.**



కాళోజీ సెప్టెంబర్ 9, 1914న బీజాపూర్ జిల్లా రట్టెహాళ్ళిలో జన్మించారు. తండ్రి వెంట హన్మకొండ వచ్చి తెలంగాణ వాదిగా బ్రతికారు. కాళోజి ఉద్యమాల బాటలో నడిచి అన్యాయం ఎక్కడ జరిగినా ఎదిరిస్తూ కోపంతో, కన్నీళ్ళతో కవితలు అల్లారు. పాటలు పాడాడు. విద్యార్థిదశలోనే గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్నారు. స్టేట్ కాంగ్రెస్ పక్షాన సత్యాగ్రహంలో పాల్గొని 1939 లోనే జైలు శిక్ష అనువించారు. క్విట్ ఇండియా ఉద్యమంలోను, హైదరాబాద్ విముక్తి పోరాటంలోను మళ్ళీ కారాగార వాసం గడిపారు. విశాలాంధ్ర ఏర్పాటుతో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ఖండిస్తూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించారు.

కాళోజి రచించిన 'నా గొడవ' గేయాలు అఖిల ఆంధ్ర ప్రజల ప్రశంసలు పొందాయి. 1959 తరువాత ఆయన ఎన్నో కవితలు, కథలు వ్యాసాలు వ్రాశారు. కాళోజీ బహుభాషాకోవిదుడు. మరాఠీ, ఉర్దూ, ఇంగ్లీష్ రచనలు తెలుగులోకి అనువదించారు. తెలంగాణ యాసలో వ్యంగ్యం, హాస్యం కల బోసిన కవిత్వం తెలుగులో వ్రాశారు.

శాసనమండలి సభ్యుడుగా కొనసాగిన కాళోజి భారత ప్రభుత్వం నుంచి 'పద్మవిభూషణ్' గౌరవాన్ని పొందారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేటు అందుకున్న అసలు సిసలైన ప్రజాస్వామ్య వాది కాళోజి.

మహిళలు దంచేటప్పుడు, విసిరేప్పుడు, కోతకోసేటప్పుడు కుప్పకొట్టేటప్పుడో, సంచులు బండికెత్తేటప్పుడు, వర్షాకాలం కప్పనీళ్ళాటలో, గోపాల కాల్వల కోలాటాల్లో పాటలను బాగా అనుసరించి రాసేవారు కాళోజీ.

పల్లె పట్టణంబనక పల్లేరై తిరిగాడు సంతతముగ జీవించగ సతతము యత్నంతోగాని ఎంతటి సౌఖ్యానికైన ఇతరుల పీడింపబోను అని ఖచ్చితంగా చెప్పారు. ఉన్నదున్నట్టు కుండ బద్దలు కొట్టడంలో మాత్రం అభినవ వేమన్న కాళోజీ.

అందుకే ఎవరో అన్నారు వేమన మైనస్ మతం కాళోజీ అని, గాంధీ ప్లస్ మార్క్స్ కాళోజీ అని పొగిడారు. అయితే కాళోజీ అచ్చమైన మానవతావాది. మనిషన్నా, స్నేహమన్నా పడి చచ్చేవాడు. కాళోజీ అంటే కన్నీళ్ళు. కాళోజీ అంటే స్నేహం. కాళోజీ అంటే ఒక నిలువెత్తు మనిషి .ఒక బతుకు చిత్రం చల్లదనాన్నిచ్చే సూర్యుడు వెచ్చని చంద్రుడు అంటాడు ఎన్. రామాశాస్త్రి – కాళోజీ ఫౌండేషన్ అధ్యక్షుడు.

*- సి.ఎం.పి.*

---



యువతను కూడా చేర్పించారు. అదే స్ఫూర్తితో యువతతో మంచినీటి పంపులు బాగు చేయించడం, శ్రమదాన కార్యక్రమాలు చేయించడం వంటి పనులలో భాగస్వాములను చేస్తున్నారు.సర్పంచిగా ఎన్నికయినా ఆ సేవాభావాన్నే కొనసాగిస్తూ గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చడం, పర్యావరణహితమైన మట్టి వినాయకుడి విగ్రహాలను వినియోగించాలని ప్రచారం చేయడం, శక్తి హీనులైన వికలాంగులు తదితరులకు వారి ఇంటి వద్దకు వెళ్ళి ఫించన్లు బట్వాడ చేయించే పనులు చేస్తున్నారు. తన గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్న గణపతి ఇంతింతై వటుడింతై అన్న చందంగా ఇంకా ఉన్నత శిఖరాను అధిరోహించాలని తన గ్రామాన్ని అన్ని రంగాలలో ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఆశిద్దాం.

***– అవనాపు దేముడు,*** *విజయనగరం,*
***– ఎస్. లోకనాథరావు,*** *శ్రీకాకుళం,*
*జిల్లా శిక్షణ మేనేజర్లు*

# కొత్త సంవత్సరంలో కొత్త వెలుగులు

కొత్త సంవత్సరం వచ్చేసింది. కొత్త రాష్ట్రం తెలంగాణలో కొత్త ఆశలు చిగురించాయి. ఇంతవరకు సంక్షేమం, అభివృద్ధి పథకాలు ప్రణాళికల రూపకల్పనలో తలమునకలైన ప్రభుత్వం, ఒకటొకటిగా కొత్త పథకాల అమలుకు శ్రీకారం చుడుతోంది. అధికార పగ్గాలు చేపట్టిన నాటి నుంచి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు 'బంగారు తెలంగాణ' లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. అందులో ప్రధానమైనది ఇంటింటికి స్వచ్ఛమైన త్రాగునీరు అందించేందుకు ఉద్దేశించిన వాటర్‌గ్రిడ్ ఏర్పాటు. అనేక సందర్భాలలో ముఖ్యమంత్రి రాష్ట్రంలోని పది జిల్లాల్లోని ప్రతి ఇంటికీ మంచినీరు అందించడం తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, వచ్చే ఎన్నికల నాటికీ, అంటే 2019 నాటికీ ఈ లక్ష్యాన్ని నెరవేర్చలేకపోతే వచ్చే ఎన్నికల్లో ఓటు అడిగేది లేదని స్పష్టంగా ప్రకటించారు.

వేరు. మొత్తం రాష్ట్రంలోని పథకాన్ని అమలు చేయడం వేరు అనే వాదన వినవస్తోంది. అది నిజమే కావచ్చు, కానీ సంకల్పబలంతో సాధించలేనిది ఏదీ ఉండదని, అంతేకాకుండా వనరుల సమీకరణ మొదలు నిర్మాణ పనుల వరకు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, లోతుగా అధ్యయనం చేసి ముందస్తు ప్రణాళికతో ముందడుగు వేస్తున్నారు.

నిజానికి ఏ పథకం అయినా విజయవంతం కావాలంటే, సంకల్పబలంతో చక్కని ప్రణాళిక ఉంటే సగం పని అయిపోయినట్లే అని విజ్ఞులు అంటారు. ఈ కోణం నుంచి ఊసినప్పుడు సగం పని ఇప్పటికే అయిపయినట్లే అని అనుకోవచ్చును. ఎందుకంటే, రాష్ట్రంలో మంచినీటి అవసరాలున్న అన్ని గ్రామాలలో ఒకేసారి పథకాన్ని ప్రారంభించడం లేదు. ఒకేసారి పూర్తిచేయాలనీ భావించడం లేదు. రాష్ట్రంలో ఉన్న తొమ్మిది గ్రామీణ జిల్లాలలో 25 వేల జనావాసాలకు మంచి నీటిని అందించేందుకు ఆ జనావాసాలను 26 గ్రిడ్స్‌గా విభజించారు.

అలాగే గ్రిడ్స్‌కు నీటిని అందించేందుకు 29 నీటి వనరులను

నిజానికి ఇదొక సాహసోపేతమైన ప్రకటన. తమపై తమకు ఎంతో విశ్వాసం ఉంటేగానీ, ఏ ముఖ్యమంత్రి కూడా ఇలాంటి ప్రకటన చేయలేరు. అయినా ముఖ్యమంత్రి చంద్రశేకరరావు ఒకటికి పదిసార్లు అలాంటి ప్రకటన చేశారంటే ఆయనలో విశ్వాసం ఏ స్థాయిలో ఉందో వేరే చెప్పనక్కరలేదు. అందుకు ముఖ్యమంత్రి స్వయంగా, ఈ పథకం కేవలం ప్రతిష్టాత్మకం అయింది మాత్రమే కాదు, ప్రభుత్వం చేపడుతున్న పథకాలన్నింటిలో అత్యంత సాహసోపేతమైనదని, ఈ వాస్తవాన్ని అధికారులందరూ గుర్తుంచుకోవాలని అన్నారు.

నిజం. ఇంతటి బృహత్తర పథకాన్ని అమలు చేయాలంటే కేవలం నిధులు సమకూర్చుకోవడం మాత్రమే కాదు, ఇందుకు అవసరమైన జల వనరులు, మానవ వనులు సమకూర్చుకోవడంతో పాటు ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటేనే గానీ, ఈ యజ్ఞం సాఫల్యం కాదు. ఈ వాస్తవాన్ని గుర్తించారు కాబట్టి ముఖ్యమంత్రి జనవరి 4వ తేదీన నిర్వహించిన సమీక్షా సమావేశంలో అందుబాటులో ఉన్న సాంకేతిక విజ్ఞానాన్ని సంపూర్ణంగా వినియోగించుకుందామని, వాటర్‌గ్రిడ్‌ను ఓ 'నభూతో న భవిష్యతి' అన్న విధంగా, స్మార్ట్‌గా నిర్మించుకుందాం అని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

మనదేశంలో అనుకున్న విధంగా ప్రాజెక్టులు పూర్తి కావడం అన్నది ఎంతో అరుదైన విషయం. ఇదిగో అంటే ఆరేళ్ళకు గానీ అడుగుపడని ఎన్నో 'అద్భుతాలను' మనం చూశాం. విన్నాం. కానీ సమైఖ్య రాష్ట్రంలో. అది కూడా కేవలం ఒక శాసనసభ్యునిగా ఉన్న రోజుల్లోనే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు తమ నియోజకవర్గంలో సిద్ధిపేట మంచినీటి పథకాన్ని, అపర భగీరధుని మరిపించే విధంగా పూర్తి చేశారు. ఆ అనుభవంతోనే ఆయన వాటర్ గ్రిడ్ పథకానికి శ్రీకారం చుట్టారు. అయితే, ఒక నియోజకవర్గ పరిధిలోని ఒక పట్టణంలో మంచినీటి పథకాన్ని చేపట్టడం

గుర్తించారు. వీటి నుంచి నీటిని తీసుకునేందుకు 29 ఇన్-టేక్ వెల్స్ (బావులు) నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే, ఈ పథకం అమలుకు అవసరమైన 200 మెగా వాట్ల విద్యుత్‌ను సమకూర్చుకునే ప్రణాళికలను సిద్ధం చేశారు. ఈ అన్నింటిని మించి ఈ మొత్తం బృహత్తర ప్రణాళికను సక్రమంగా సకాలంలో అమలు చేసేందుకు 'జల జలాం' పేరిట ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలనీ ప్రభుత్వం సంకల్పించింది. అంతేకాదు, వివిధ శాఖల మధ్య సమన్వయంతో జరగవలసిన పని కావడం వల్ల ఇందుకు అవసరం అయిన అన్ని అనుమతులు ఒకే దరఖాస్తు ద్వారా పొందేందుకు వీలుగా ఏక గవాక్ష విధానాన్ని ప్రవేశపెట్టారు. నీటి పారుదల, విద్యుత్, అటవీ, పంచాయతీరాజ్ శాఖల ఉంచి అవరమైన అనుమతులన్నీ ఒకేసారి లభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్వయంగా అధికారులను ఆదేశించారు.

ఇక్కడ మరో విషయాన్ని కూడా ప్రత్యేకంగా ప్రస్తావించవలసి ఉంది. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ సహా, దేశవ్యాప్తంగా ఉన్న సమస్యే అయినా ఫ్లోరైడ్ సమస్య తెలంగాణ రాష్ట్రంలో మరీ ముఖ్యంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను అనుకుని ఉన్న నల్గొండ జిల్లాలో ఈ సమస్య మరింత జటిలంగా ఉంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త ప్రయత్నం చేసినా ఆశించిన ఫలితాలు మాత్రం రాలేదు. అందుకే తెలంగాణ ప్రబుత్వం ఈ పథకానికి నల్గొండ జిల్లా నుంచే శ్రీకారం చుట్టాలని నిర్ణయించింది. జిల్లాలోని చౌటుప్పల్ గ్రామంలో ముఖ్యమంత్రి త్వరలోనే శంఖుస్థాపన చేస్తారు. ఇలా ఏ విధంగా చూసిన బంగారు తెలంగాణ నిర్మాణంలో తొలి అడుగు జల అడుగు కావడం ఎంతైనా అభినందనీయం. అయితే, ముందే అనుకున్నట్లుగా ఇది అంత సులభంగా అయ్యే పని కాదు. అలాగని కాని పని కాదు. మరోవంక చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. దీంతో భూగర్భ జల వనరులు పెరిగి



# చిత్తూరు, విజయనగరం జెడ్.పి.టి.సి ల శిక్షణ ముగింపు

**ఏ.ఎం.ఆర్ – అపార్డులో జిల్లా ప్రాదేశిక నియోజకవర్గం జడ్పిటిసి ల ముగింపు ఈరోజు జరిగింది. వీరికి ఈ నెల 28.12.2014 నుండి 29.11.2014 వరకు ప్రాథమిక శిక్షణను ఇవ్వడం జరిగింది.**

ముఖ్యంగా జడ్పిటిసిలు తమ విధులను నిర్వహించటానికి కావల సిన సామర్థ్యాన్ని చట్టాల అమలు, వివిధ పథకాలు ప్రజల వద్దకు చేర్చి వాటి సఫలంగా అమలు చేసే విధానాలు, ఆర్టిఐ, ఇన్ఫర్మేషన్ చట్టాలు అమలు. ప్రజల సమస్యల పరిష్కారం తీసుకోవాలనే చర్యలతో పాటు నైతిక విలువలు గూర్చి శిక్షణలో వివిధ నిపుణుల ద్వారా అందించడం జరిగింది.

ఈ మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో చిత్తూరు, విజయనగరం జిల్లాల జడ్పిటిసి 53 మంది పాల్గొన్నారు. శిక్షణ రోజులు పెంచితే శిక్షణావసరాలను బట్టి పెట్టాలని జడ్పిటిలు సూచించారు.

*- సి.ఎం.పి.*

ఇటు సాగునీరు అవసరాలు, అటు మంచి నీటి అవసరాలు ఏక కాలంలో తీరే సువర్ణ అవకాశం ఏర్పడింది.

ఇదొకటి అయితే, అన్ని ప్రపంచ భాషలలో అనర్గళంగా సంభాషించే 'ఆకలి' సమస్య పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం కొత్త సంవత్సరంలో శ్రీకారం చుట్టింది. ఇంతవరకు అమలులో ఉన్న తలకాయల కొలతల స్థానంలో కడుపుల కొలతలా ఆధారంగా సబ్సిడీ బియ్యం పథకానికి మెరుగులు దిద్దింది. కొత్త రేషన్ విధానాన్ని జనవరి 1 నుంచి అమల్లోకి తెచ్చింది. ఈ విధానంలో గతంలో ఒక్కొక్కరికి నాలుగు కిలోల బియ్యాన్ని ఇచ్చేవారు. కానీ ఇప్పుడు నెలకు ఒక్కొక్కరికి ఆరు కిలోల బియ్యం చొప్పున సరఫరా చేస్తున్నారు. గరిష్ట పరిమితిని సైతం ఎత్తి వేశారు ఒక కుటుంబంలో పదిమంది ఉంటే నెలకు 60 కిలోల వంతున నాణ్యమై బియ్యాన్ని అందిస్తున్నారు. అంతేకాదు, ఇంతవరకు రాష్ట్రంలో కేవలం 2.50 లక్షల మందికి మాత్రమే లబ్ధి చేకూరుస్తున్న పథకాన్ని గణనీయంగా విస్తరించారు. 2.85 లక్షల మందికి అదనంగా ఈ సదుపాయాన్ని విస్తరించి మొత్తం 4 లక్షల మందికి లబ్ధి చేకూరే విధంగా అమల చేస్తున్నారు. అలాగే, ఆదాయ పరిమితి గ్రామాలలో 60 వేల నుంచి ఒక లక్ష 50 వేల రూపాయల వరకు, పట్టణ ప్రాంతాల్లో రూ. 75 లక్షల నుంచి రూ. 2 లక్షల వరకు పెంచారు. ఫలితంగా పట్టణ ప్రాంతాల్లో నెలకు రూ. 15 వేల వరకు జీతం గల ప్రైవేటు ఉద్యోగులకు సైతం లబ్ధి చేకూరుతుంది.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన విద్యార్థులు, నిరుద్యోగ యువత ఆశలు నెరవేరేందుకు ఎదురవుతున్న అవరోధాలను అధిగమిస్తూ ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్‌ను ఏర్పాటు చేసింది. దీనికితోడు కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో కొత్త సంవత్సరంలో తెలంగాణ యువకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి అనడంలో సందేహం లేదు. ఇదిగాక నూతన పారి శ్రామిక విధానం, ఐటీ పాలసీలతో ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలకు తలుపులు తెరుచుకుంటున్నాయి.

ఇదిగాక, వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఇచ్చే పింఛనుల ను ప్రభుత్వం ఇప్పటికే గణనీయంగా పెంచింది. కేవలం రూ. 200 ఉన్న వృద్ధులు, వితంతువుల పింఛను వెయ్యి రూపాయలకు, వికలాంగుల పింఛనును రూ. 1500 లకు పెంచింది.

అవసరమైన భూసేకరణ ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. ప్రభుత్వ భూములలో నివాసం ఏర్పరచుకున్న పేద ప్రజలకు ఆ ఊ ములను 120 గజాల వరకు ఉచితంగా క్రమబద్దీకరించుకునే అవకాశం కల్పిస్తూ, నూతన సంవత్సరం తొలి వేకువన జీవో జారీ ఏసింది. ఇలా, కొత్త సంవత్సరంలో, కొత్తరాష్ట్రంలో అన్ని మంచి శకునాలే కనిపిస్తున్నాయి. బంగారు తెలంగాణ దిశగా అడుగులు పడుతున్నాయన్న విశ్వాసం వ్యక్తమవుతుంది.

*- రాజనాల బాలకృష్ణ*

**ప్రజల దాహార్తిని, వ్యవసాయ అవసరాలను, తీర్చేందుకు మనం ఎక్కువగా బోరుబావులు/ ట్యూబ్‌బావులు పైన ఆధారపడిన విషయం తెలిసిందే. ఎటొచ్చీ సమస్య ఏమంటే, నీరు పడని బోరుబావులు, పాడై పోయిన బోరుబావులు అన్నమాట. ఇవి నిర్వహించక అలాగే వదలివేయటం వలన చిన్నారుల పాలిట మృత్యుకూపాలౌతున్నాయి. చిన్నారులను రక్షించే క్రమంలో తల్లిదండ్రులుల పడే క్షోభ వర్ణనాతీతం.**

అధికారులు/ ప్రజలు/ మీడియా సోదరులు ఎంతో సమయాన్ని గడపవలసి రావడం, ఎంతో ప్రజా ధనాన్ని వినియోగించవలసి రావడం మనకు తెలిసిన విషయమే. ఇంత చేసినా మృత్యువు నుండి బయటపడే చిన్నారుల సంఖ్య అతితక్కువనే చెప్పాలి.

దీనికి కారణం ఎవరు? ఈ మానవ నిర్మిత వైపరీత్యాలను నిలువరించడం ఎలా? ప్రభుత్వాలు/ ప్రజలు/ ఎన్‌జిఓలు ఏమి చేయాలి? ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలియాలంటే మనం రెండు అంశాల గురించి తెలుసుకోవాలి.

# గ్రామీణ ప్రాంతంలో నిరుపయోగమైన/ మూతలేని, తెరచి వున్న బోరుబావులు/ ట్యూబ్‌వెల్స్ సృష్టిస్తున్న విపత్తు నివారణ చర్యలు

1. బోరు బావుల ఏర్పాటు ఎలా జరగాలి?

2. నిరుపయోగ బోరు బావులను ఎలా నిర్వహించాలి?

బోరు బావుల ఏర్పాటు ఎలా జరగాలన్నది తెలియాలంటే వాల్టా చట్టం ఏం చెప్తుందో తెలుసుకోవాలి.

**వాల్టా చట్టం :** వాల్టా చట్టం బోరుబావుల విషయంగా ముఖ్యమైన అంశాలు ఇవి,

- ✯ ప్రస్తుతం వున్న బోరుబావులన్నింటిని గ్రామ సేవకుని వద్ద తప్పనిసరిగా రిజిష్టరు చేయించాలి. దీనికి ఎటువంటి ఫీజు చెల్లించ వలసిన అవసరం లేదు.
- ✯ ఇప్పటికి అత్యధికంగా భూగర్భజలాలను వినియోగిస్తున్నట్లు గుర్తించిన 4190 గ్రామాలలో (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో కలిపి) కొత్త బోరుబావుల ఏర్పాటును నిషేధించడమైనది.
- ✯ ఏకగావాక్ష పద్ధతిలో బోరుబావుల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలి. అందుకై –
  - ● ముందుగా తహసీల్దార్ / గ్రామసేవకునికి అప్లికేషన్ సమర్పించాలి.
  - ● తదుపరి తహసీల్దార్ వారు ఎలక్ట్రిసిటి అధికారులకు మరియు భూగర్భ జలాల శాఖాధికారులకు సూచిస్తారు.

  *ఇందుకు గల ప్రధాన ఉద్దేశ్యం:*
  - ● కరెంటు సప్లైకి అవకాశం ఉందో లేదో అన్న విషయాన్ని తెలుసుకోవడం
  - ● భూగర్భ జలాల అందుబాటు, నేల స్వభావం, ఎంత లోతు వరకు తవ్వాలి, పబ్లిక్‌కు నీటిని అందించే బోరుబావి నుండి కొత్తగా వేయదలుచుకున్న బోరుబావికి మధ్య ఉన్న దూరం వంటి విషయాలు తెలుసుకోవడం
- ✯ పై రెండు డిపార్ట్‌మెంట్‌ల నుండి స్పష్టత లభించిన తదుపరి, బోరుబావుల తవ్వకానికి అనుమతిని మంజూరు చేస్తారు.
- ✯ పబ్లిక్ నీటి సరఫరా ఏర్పాటుకు కనీసం 250 మీటర్ల దూరంలో నూతన బోర్‌వెల్ నిర్మించాలి.
- ✯ వాల్టా చట్టాన్ని అతిక్రమించి బోరుబావి తవ్వడం చేపడితే, అట్టి యజమాని, డ్రిల్లింగా సంస్థపై కేసు నమోదు చేసి, పెనాల్టీ విధించే అధికారం తహసీల్దార్‌కు కలదు.
- ✯ వ్యవసాయ అవసరాల నిమిత్తం సంబంధిత ఆమోదంతో బోరుబావి నిరిృంచి, నీరు పడని సందర్భంలో అట్టి యజమానికి రూ. 1,0000/లు వరకు పథక సంచాలకులు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డిడబ్ల్యుయమ్) నుండి నష్ట పరిహారం పొందవచ్చు.

నిరపయోగమైన బోరుబావులను ఎలా నిర్వహించాలన్నది స్పష్టంగా తెలియాలంటే మనం సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలు తెలుసుకోవలసిందే,

నిరుయోగ/ మూసివేయని బోరుబావుల విషయంగా సుప్రీంకోర్టు జారీ చేసిన దిశా నిర్ధేశాకాలు:

ప్రజా ప్రయోజనార్థం కొంత మంది వ్యక్తులు, తెరచి ఉన్న బావులు/ ట్యూబ్‌వెల్స్‌లో పడి చిన్నారులు ప్రమాదం బారినపడి ప్రాణాలు కొల్పొతున్న వైనంపై 2009 లో సివిల్ రిట్ పిటిషన్ నెం. 36 వేశారు. ఫలితంగా సుప్రీంకోర్టు సెప్టెంబర్ 12, 2013 న క్రింది విధివిధానాలను విడుదల చేయడం జరిగినది. ఆ ప్రకారం,

1. కొత్తగా బోరుబావులు/ ట్యూబ్ బావుల ఏర్పాటు చేయాలనుకున్న భూమి యజమాని 15 రోజుల ముందుగా అట్టి విషయాన్ని రాత పూర్వకంగా సంబందిత అధికారులకు తెలియజేయాలి. వారు ఎవరనగా జిల్ల కలెక్టర్/ జిల్లా మేజిస్ట్రేట్/ గ్రామ పంచాయతీ సర్పంచ్/ సంబంధిత చట్టబద్ధమైన అధికారి/ భూగర్భ జలాలశాఖ అధికారి/ ఆర్‌డబ్ల్యుయస్‌యస్ ఇంజినీరు/ మున్సిపల్ కార్పోరేషన్‌లకు తెలియజేయాలి.

2. జిల్లా పరిపాలనా / చట్టబద్ధమైన అధారిటి వద్ద జిల్లా పరిధిలో వున్న అన్ని బోరుబావుల డ్రిల్లింగ్ ఏజెన్సీలు చట్టబద్ధముగా రిజిష్టర్ కావాలి.

3. బోర్‌వెల్ నిర్మాణం జరిగే ప్రదేశంలో క్రింది వివరాలతో కూడిన నోటీసు బోర్డు ఏర్పాటు చేయాలి

ఎ. కొత్త బోర్‌వెల్/ పునరావాస బోర్‌వెల్‌ను డ్రిల్ చేస్తున్న ఏజెన్సీ యొక్క పూర్తి సమాచారం

బి. బోరుబావి యజమాని/ వినియోగదారుని పూర్తి వివరాలు.

4. ఏర్పాటు చేస్తున్న బోరుబావి చుట్టూ ముళ్ళకంచె (పెన్సింగ్) ఏర్పాటు చేయాలి.

5. బావి కేసింగ్ చుట్టూ సిమెంట్/ కాంక్రీట్ ప్లాట్‌ఫామ్ నిర్మించాలి. అది భూమట్టానికి పైన 0.50 0.50 0.60 మీటర్లు అంటే 0.30 మీటర్లు, భూమట్టంకు దిగువన 0.30 మీటర్ల వ్యాసంతో నిర్మించాలి.

6. కేసింగ్ పైపు పైన స్టీల్ ప్లేట్ లేదా బలమైన మూత ఏర్పరచాలి. అది మూత వెల్డింగా చేయబడి, బోల్టులు, నట్లతో బిగించాలి.

7. పంపు రిపేరు వచ్చినప్పుడు కూడా బోరుబావి మూత తెరచి వుంచకూడదు.

8. పని పూర్తయిన తదుపరి సాధారణంగా ఆ ప్రదేశంలో ఏర్పడే బురద గుంటలు, నీటి కాలువలను మూసి వేయాలి.

9. ఉపయోగపడని బోరుబావులను మట్టి/ఇసుక/రాళ్ళు/డ్రిల్ చేయగా వచ్చిన మెటీరియల్‌తో మూసివేయాలి.

10. బోరుబావి డ్రిల్ చేసే ముందు ఆ ప్రదేశంలో ఎలాంటి స్థితి వుందో, తర్వాత కూడా అదే స్థితి నెలకొల్పాలి.

11. ఈ గైడ్ లైన్స్‌ను సరిగ్గా అనుసరించేందుకు జిల్లా కలెక్టర్ వారు తప్పనిసరిగా పర్యవేక్షిస్తూ, వాటి నివేదికలను రాష్ట్ర/కేంద్ర సంస్థలకు చేరవేయాలి.

12. జిల్లా/మండల/గ్రామ పంచాయితీ స్థాయిలో బోరుబావుల స్థితి ఏమిటి, అనేది తెలుసుకునేందుకు మొత్తం ఎన్ని బోరుబావులు వాడుతున్నారు? ఎన్నింటిని వాడడం లేదు, వాడని వాటిలో ఎన్నింటిని సరిగా మూసివేశారు, ఎన్నింటిని సరిగా మూసివేయలేదు, అనేది పరిశీలించాలి, గ్రామీణ ప్రాంతాలలో అయితే గ్రామ సర్పంచ్ ద్వారా వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించాలి. పట్టణ ప్రాంతాలలో, జూనియర్ ఇంజినీర్ ద్వారా భూగర్భ నీటి వనరుల శాఖ/ త్రాగునీటి సరఫరా మరియు పారిశుద్ధ్య/ మున్సిపల్ కార్పోరేషన్ శాఖాధికారులు నిర్వహించాలి.

13.ప్రయోగంలో లేని బోరుబావుల విషయంగా వాటిని సరైన పద్ధతిలో పూడ్చివేసి, వాటిని పునరుద్ధరించినట్లు సంబంధిత అధికారుల నుండి సర్టిఫికెట్ పొందాలి.

14. ఉపయోగంలో లేని బోరుబావుల విషయంగా తరుచుగా యాదృచ్ఛిక తనిఖీలు నిర్వహించాలి. తగు సమాచారాన్ని జిల్లా స్థాయిలో, మండల స్థాయిలలో, గ్రామస్థాయిలలో, నిర్వహించాలి.

పైన చెప్పిన అంశాలను తూచా తప్పక పాటించి, జిల్లాస్థాయి/మండల స్థాయి/ గ్రామస్థాయి యంత్రాంగం తక్షణ చర్యలకు ఉపక్రమిస్తే, నోరు తెరుచుకున్న బోరుబావుల వల్ల కలిగే అనర్థాలు వినిపించవు/ కనిపించవు. ఫలితంగా కలిగే తక్షణ ప్రయోజనాలు ఏమంటే

1. తల్లిదండ్రులకు ఊరట, 2. ప్రభుత్వ యంత్రాంగానికి పని వెసులుబాటు 3. ప్రజాధనం సద్వినియోగం.

*- ఎ. నాగేశ్వరరావు*
*సీనియర్ రిసోర్స్ పర్సన్, సి.ఎం.ఇ.డి.*

# భారతదేశంలో ధనవంతమైన గ్రామం - ధర్మాజ్

**గుజరాత్ రాష్ట్రంలోని ఆనంద్ జిల్లాలోని చిన్న గ్రామం ధర్మాజీ గ్రామంలోని బ్యాంకుల్లో రు. 1,000 కోట్ల రూపాయలు డిపాజిట్లు చేయడం జరిగింది. దీనితో ఈ గ్రామం భారతదేశంలోనే అత్యంత ధనవంతమైన గ్రామంగా రికార్డు సృష్టించింది. ధర్మాజ్ (Dharmaj) గ్రామం ఆనంద్‌కు 70 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ఈ గ్రామ జనాభా 11,333 మంది. ఈ గ్రామంలో 13 బ్యాంకులున్నాయి.**

గత రెండు దశాబ్దలలో NRI (Non - Resident Indians) ఈ గ్రామంలోని బ్యాంకుల్లో డబ్బు డిపాజిట్‌లు పెట్టడం మదుపు చేయడంతో గ్రామంలోని బ్యాంకులు, పోస్టాఫీసు ఖాతాల్లో 17.12.2014 నాటికి 1,000 కోట్లకు చేరి దేశంలోనే ధనవంతమైన గ్రామంగా ఎన్.ఆర్.ఐ. డిపాజిట్లతో చేరుకొంది.

గతంలో కేరళలోని గ్రామం రూ. 900 కోట్లు డిపాజిట్లు చేసి అధిక డిపాజిట్లు చేసిన NRI ల వలన ఆ స్థాయికి చేరింది. ఇపుడు ఆ స్థానాన్ని గుజరాత్‌లోని ఆనంద్ జిల్లాలోని గ్రామం ధర్మాజ్ ధనవంతమైన గ్రామంగా రికార్డు సాధించింది. ఈ విషయాన్ని డిప్యూటి జరల్ మేనేజర్ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (CBI) వదోదరా డివిజన్ శ్రీ R.N. హీర్వే చెప్పారు.

అతని మాటల్లో, ధర్మాజీ గ్రామానికి చెందిన నాన్ రెసిడెంట్ ఇండియన్స్ తమ డబ్బును రాజ్యస్థ బ్యాంకుల్లో డిపాజిట్ చేసి క్యూములేటివ్‌గా వెయ్యి కోట్ల రూపాయల మార్క్‌ను దాటించారన్నారు. ఈ గ్రామానికి అధికంగా నిధులు వచ్చి చేరడంతో ధర్మాజ్ గ్రామం ధనవంతమైంది. ఈ గ్రామంలో వారు అందరు విద్యావంతులే. ఆ రాష్ట్రంలోనే గాక దేశంలో విద్యావంతులలో ఒకటిగా గతంలో రికార్డు నెలకొల్పింది. 3,000 మందికి పైగా పాటిదార్ కుటుంబాలు తమ జీవితం విలాసవంతంగా ప్రతి ఇంటికి కార్లు గత రెండు దశాబ్దాలుగా కలిగి ఉన్నారు. NRI లు తమ డిపాజిట్లను గ్రామ ఖాతాలలో డిపాజిట్ చేశారు.

గత రెండు దశాబ్దాలుగా ఈ గ్రామంలోని 1,700 మంది బ్రిటన్ దేశంలో స్థిరపడ్డారు. సుమారు 300 కుటుంబాలు అమెరికాలోను, 160 కుటుంబాలు న్యూజిలాండ్, 200 కుటుంబాలు కెనాడా, 60 కుటుంబాలు ఆస్ట్రేలియాలోను ఇతర దేశాలలో వలస వెళ్ళారు. ఈ గ్రామంలోని మొత్తం 3,200 కుటుంబాలు విదేశాలలో నివసిస్తున్నారు.

డిపాజిట్లు సేకరించిన బ్యాంకుల్లో మొట్టమొదటి స్థానం బ్యాంక్ ఆఫ్ బరోడా రు. 125 కోట్ల రూపాయలు, దేనా బ్యాంకుల్లో 100 కోట్లు డిపాజిట్లు సేకరించాయి. మొత్తం 13 జాతీయ బ్యాంకులు ఈ గ్రామాల్లో బ్రాంచ్‌లు ప్రారంభించి ఖాతాలు తెరిచాయి. ప్రైవేట్ బ్యాంకులు, కో-ఆపరేటివ్ బ్యాంకులు కూడా ఈ గ్రామంలో బ్రాంచ్‌లు తెరిచాయి ఇతర బ్యాంకులు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అలహాబాద్ బ్యాంకు, కెనరా బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకు, ఇండస్ - ఇండ్ బ్యాంకు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, పంజాబ్ నేషనల్ బ్యాంకు, కార్పోరేషన్ బ్యాంకు మరియు ధర్మాజ్ ప్రజల కోఆపరేటివ్ బ్యాంకులున్నాయి.

*- పి.టి.ఐ*

# నీరు - చెట్టు



నీరుంటే చెట్టు- చెట్టుంటే నీరు
నీరులేని ఊరిని చూడు- ఆడకూతురి ఆరడిచూడు
నీరులేని 'దేశం' నీరే లేని 'దేహం'
ఊహించుకోరా 'నేస్తం'
పాడిపంటలకు నీరు - పల్లె ప్రగతికి నీరు
పరిశ్రమలకు నీరు- కరెంటుకు నీరు
మనిషి శుభ్రతకు నీరు- జీవకోటి భద్రతకు నీరు



జగతికి, ప్రగతికి నీరే ఆధారం
అది లేకుంటే కన్నీళ్ళే శేషం
కన్నీళ్ళకైనా కావాలిగా నీరు
కొన్నాళ్ళకైనా మారాలి ప్రజల తీరు

ఉన్న చెట్లను కాపాడుకుందాం- కొత్తచెట్లను నాటుదాం
చింతచెట్టు నాటిన మనముత్తాతలు
రుచిచూశారా చింత పులుపును వాళ్ళు
భావితరాలకు నిస్వార్థంతో వారందించిన ఆస్తులు
నేటితరం స్వార్థానికి బలై పోతున్నాయిరా ఈ నేస్తాలు
నోరు లేని చెట్టు - ప్రాణం లేని నీరు
ఎంతటి కాలుష్యాన్నైనా - ఎంతటి మురికినైనా
భరిస్తుంది మౌనంగా - కడుగుతుంది భారంగా
ఆలోచిద్దాం జాతికోసం - ఆచరిద్దాం భవితకోసం
అమలుచేద్దాం చెట్టునీరు - బ్రతుకుదాం ఆరోగ్యంగా మనమందరం

***- జి.జయపాల్‌రెడ్డి,***
సలహాదారు, సి.ఎస్.ఆర్.ఎమ్., అపార్డ్




**స్వాతంత్ర్యం వచ్చి ఆరున్నర దశాబ్దాలు దాటినా దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలోని ప్రజలు ప్రణాళికాభివృద్ధిలో ఒకే రకమైన అభివృద్ధిని చేరుకోలేదు. ఆశించిన అభివృద్ధిని చేరుకోవటానికి చేయవలసిన కృషి చాలా ఉన్నది. గ్రామీణ ప్రాంతాల ప్రజల జీవనోపాధి సూచికలను పరిశీలించినట్లయితే, పొరుగు దేశాలకన్నా మన ప్రజలు వెనుకబడి ఉన్నారనేది అక్షర సత్యం.**

ప్రాథమిక అంశాలైన ఆరోగ్యం, పరిశుభ్రత, నాణ్యమైన విద్య, ఉపాధి మరియు జీవనప్రమాణాలు అనేవి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చాలా ముఖ్యమైన విధాన ప్రణాళికలుగా ఉన్నాయి. విధాన ప్రణాళికలకు మరియు వాటి అమలుకు మధ్య గల వ్యత్యాసం అట్టడుగు స్థాయి గ్రామీణ ప్రాంత ప్రజల భాగస్వామ్యాన్ని ఆశించిన స్థాయిలో పెంచలేకపోయింది.

1972లో అప్పటి భారత ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ ఐక్యరాజ్య సమితి సదస్సులో మాట్లాడుతూ, పేదరిక నిర్మూలన అనేది ప్రపంచ పర్యావరణ వ్యూహంలో ఒక అంతర్భాగం కావాలని, ప్రపంచ పౌరసత్వం మరియు భూమి ఆకాశాల భాగస్వామ్యం అనే పరస్పర ఆధారిత అంశాలు పర్యావరణానికే పరిమితం కాకుండా పర్యావరణ పరిరక్షణకు విడదీయరాని బంధాన్ని గుర్తించింది. అందుచేతనే అంతర్జాతీయంగా అన్ని దేశాలలోను మానవ మరియు పరిసరాల అభివృద్ధి స్థితిగతుల అవసరాన్ని గత రెండు దశాబ్దాల కాలం నుండి గుర్తించటం జరిగింది.

1990 నుండీ ప్రపంచ వ్యాప్తంగా సుస్థిరాభివృద్ధిపైన, మానవ ఆధారిత సుస్థిరాభివృద్ధిపైన చర్చలు జరుగుతున్నాయి. మానవ సాధికారిత, మాన కేంద్రిత (Human - centered) అభివృద్ధి అవసరం, ప్రజల భాగస్వామ్యం, లింగసమానత్వం, సమతౌల్య అభివృద్ధి, పేదరిక నిర్మూలన, సుదీర్ఘ సుస్థిరాభివృద్ధి అనే అంశాలను సుస్థిరాభివృద్ధిలో ముఖ్య అంశాలుగా పరిగణిస్తూ సుస్థిరాభివృద్ధికి ఈ అంశాలే సమస్యలుగా కూడా పరిగణించటమైనది. అనగా సుస్థిరాభివృద్ధిలో ఆర్థిక, సామాజిక, పర్యావరణ మరియు స్థానిక అంశాలు ముఖ్య

# సుస్థిరాభివృద్ధికి స్థానిక సంస్థలు

మరియు మానవ అభివృద్ధికి బాధ్యతలు కావాలన్నారు.

చరిత్రను నిశితంగా పరిశీలించినట్లయితే, గతానుభవం ప్రపంచ దేశాల మధ్యగల అసమతౌల్యం పెరుగుదలకు దారితీసిన అనేక కీలకాంశాలను విశదీకరిస్తుంది. ప్రపంచంలోని నాలుగింట మూడు వంతుల జనాభా అభివృద్ధి చెందని దేశాలలో జీవిస్తూ, అయిదింట ఒక వంతు ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువున జీవిస్తూ ఉన్నారు. పారిశ్రామికీకరణ, దోపిడీ, మరియు పర్యావరణ విధ్వంసకం అనే దీర్ఘకాలిక విధానాల ఫలితాలు ప్రజల అభివృద్ధిపై గణనీయమైన ప్రభావాన్ని చూపించాయనేది దీనిని బట్టి అవగతమౌతున్నది. సంక్లిష్టమైన సమస్యలతో బాటుగా కఠినమైన నిర్ణయాలు, ఎంపికలు దీనితో ముడిపడి వున్నాయి. ప్రపంచ ప్రజల అభివృద్ధి అనేది పరస్పర సంబంధ బాంధవ్యాలను, మరియు భాగస్వామ్య బాధ్యతలను మంచిగా అర్థం చేసుకొంటేనే సాధించగలమనేది స్పష్టమౌతున్నది.

1972లో ఐక్యరాజ్యసమితి నిర్వహించిన 'మానవ పరిసరాల అభివృద్ధి' సదస్సు ఆ తర్వాత 1992లో బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో నిర్వహించిన 'పర్యావరణం మరియు అభివృద్ధి' అనే అంతర్జాతీయ సదస్సు పర్యావరణానికి మరియు మానవ అభివృద్ధికి మధ్య గల కారకాలుగా ప్రధాన భూమికను పోషిస్తున్నాయనే అర్థం చేసుకోవాలి. ఐక్యరాజ్యసమితి నిర్వహించిన సుస్థిరాభివృద్ధి (Rio + 20 Summit) అనే సదస్సు 2012 జూన్ 13 నుండి 15 వరకు రియో డి జనైరోలో జరిగింది.

ఈ సదస్సులో పాల్గొన్న సభ్యదేశాలన్నీ 'మనకు అవసరమైన భవిష్యత్తు' అనే (The Future We Want) అనే 53 పేజీల పత్రాన్ని ఏకగ్రీవంగా ఆమోదించటమైనది. ఈ పత్రంలో వివిధ దేశాల సుస్థిరాభివృద్ధి వనరులు, సాంకేతిక పరిజ్ఞానం, హరిత ఆర్థిక వ్యవస్థ, సంస్థల నిర్మాణం వంటి అంశాలు ప్రధానంగా గుర్తించటం జరిగింది. అనగా సుస్థిరాభివృద్ధికి పర్యావరణం మరియు స్థానిక పాలన ముఖ్యమైన అంశాలుగా మనం గుర్తించవచ్చు.

### సుస్థిరాభివృద్ధి

సుస్థిరాభివృద్ధి అనేది ఒక సుదీర్ఘ ప్రణాళికవ్యూహం. ఒక సామాజిక, ఆర్థిక, పర్యావరణ దృక్కోణాలమధ్య సుస్పష్టమైన సమతౌల్యాన్ని సాధించటమే.

1987వ సంవత్సరంలో 'పర్యావరణం మరియు అభివృద్ధి' అనే అంశంపై ప్రపంచ అధ్యయన బృందం ఐక్యరాజ్యసమితికి సమర్పించిన

నివేదికలో (Brundtland Report) సుస్థిరాభివృద్ధి అర్థాన్ని నిర్వహించటం జరిగింది. 'ప్రస్తుత ప్రజల అవసరాలు సమకూర్చటంలో, భవిష్యత్తు తరాల ప్రజల అవసరాలు తీర్చుకొనే విషయంలో రాజీపడని అభివృద్ధిని సాధించటమే సుస్థిరాభివృద్ధి' అని ఆ నివేదికలో వివరించటం జరిగింది. 2005వ సంవత్సరంలో ఐక్యరాజ్యసమితి ప్రపంచ శిఖరాగ్ర సభ ప్రకటనలో వివరించినట్లుగా ఆర్థిక సామాజిక అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ అనేవి సుస్థిరాభివృద్ధికి పరస్పర ఆధారిత మూలాలుగా పరిగణించటమైనది. 2001లో UNESCO 'సాంస్కృతిక భిన్నత్వం' పై ఇచ్చిన విశ్వజనీన ప్రకటనలో సాంస్కృతిక భిన్నత్వం, సంస్కృతి అనేవి సుస్థిరాభివృద్ధికి నాలుగవ మూలకంగా పేర్కొనటం జరిగింది.

1992లో 'రియో ఎర్త్ సమ్మిట్'లో 21వ అజెండా సమాచారం, సమన్వయం మరియు భాగస్వామ్యం అనే పరస్పర ఆధారిత అంశాలు దేశ అభివృద్ధికి మూల స్తంభాలుగా గుర్తించటం జరిగింది. 2012లో జరిగిన రియో 20 ఎర్త్ సమ్మిట్‌లో కూడా 1992 మరియు 2002ల సదస్సుల అంశాలను ఉటంకిస్తూ, సుస్థిరాభివృద్ధికి గ్రీన్ ఎకానమీ, ఆర్థిక వనరులు మరియు సాంకేతిక పరిజ్ఞానం అనేవి ముఖ్య అంశాలుగా పునరుద్ఘాటిస్తూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను ఆ వేదికపై క్రొత్త అంశంగా తీసుకురావటం జరిగింది.

సుస్థిరాభివృద్ధిలో అందరినీ భాగస్వాములుగా చేస్తూ, ప్రతి ఒక్కరూ సమాచార వినిమయదారునిగాను మరియు సమాచారాన్ని తయారు చేసే వారి గాను గుర్తించటం గమనించదగిన విషయం. సాంప్రదాయ కేంద్రీకృత వ్యాపార సంస్థల నుండి అన్ని రంగాల సమన్వయం మరియు పర్యావరణ, సామాజిక సంబంధిత రంగాల నూతన వ్యాపార వ్యవస్థలకు మార్పు చెందుతూ అన్ని రకాల అభివృద్ధి ప్రక్రియల మార్పు అవసరాన్ని నొక్కి చెబుతూ ప్రజల నిర్ణయ భాగస్వామ్యం సుస్థిరాభివృద్ధికి ముందుగా కావల్సిన ప్రాథమిక అవసరంగా గుర్తించటం జరిగింది.

సుస్థిరాభివృద్ధి అనేది ఒక విస్తృత సంకల్పిత భావన. దీనిలో వివిధ రకాల అంశాలు ముడి పడి ఉన్నాయి. అనగా సామాజిక మూల ధన అభివృద్ధిలోను, ఉత్పాదక మరియు ప్రకృతి అభివృద్ధిలోను, వాటి నిర్వహణలోను వ్యవస్థా దృక్పథాన్ని అనుసరిస్తూ వర్తమాన మరియు భవిష్యత్ తరాల సంక్షేమాలన్నీ పెంపొందించటమే సుస్థిరాభివృద్ధిగా అర్థం చేసుకోవాలి. గత దశాబ్ధకాలంగా సుస్థిరాభివృద్ధిని గమనిస్తున్న వివిధ ప్రపంచ సంస్థలు అభివృద్ధిని అంచనా వేస్తూ, వివిధ ప్రణాళికల పథకాల అమలు సుస్థిరతకు కొలమానంగా మరియు సూచికలుగా పరిగణించటం జరిగింది.




నేటి ఆధునిక ప్రపంచ దేశాలన్నీ వర్తమాన జీవన సుస్థిరతతో బాటుగా భావితరాల సుస్థిర జీవన అవసరాలకు, జీవన విధానానికి బాటలు వేసే దిశగా తమ విధానాలు, నిర్ణయాలు మరియు ప్రణాళికల్ని తయారు చేసుకుంటున్నాయి. సుస్థిరాభివృద్ధి, సుస్థిర పురోగతి, సుస్థిర ఆర్థికత, సుస్థిర వ్యవసాయం వగైరా పదాలను విరివిగా అభివృద్ధి చెందుతున్న, చెందిన దేశాలలో ఉపయోగిస్తున్నారు.

## భారతదేశంలో వికేంద్రీకరణ ధోరణులు

అభివృద్ధి చెందుతున్న ప్రపంచం అంతటా ప్రజలు గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాలకు వలస వెళ్ళి ఉపాధి అవకాశాలు వెతుక్కొంటూ స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని వివిధ దేశాలలో నగరీకరణ అభివృద్ధి కావడాన్ని మనం చూడవచ్చును. భారతదేశం దీనికి భిన్నం కాదని అర్థం చేసుకోవాలి. భారతదేశంలో అధికశాతం ప్రజలు గ్రామాలలో నివశిస్తున్నప్పటికీ, ప్రపంచంలోనే నగరీకరణ ప్రభావం కలిగి త్వరితగతిన అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఒకటిగా నేడు భారతదేశం ఉన్నది.

దేశ ఆర్థిక ప్రగతి నేడు అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలు, వర్తకవాణిజ్యం మరియు ఇతర సేవల ద్వారా పట్టణ కేంద్రాలపై ఆధారపడివున్నది అనేది నగ్న సత్యం. అయితే నేడు భారతదేశంలో నగరాలు అనేక సవాళ్ళను ఎదుర్కొంటున్నాయి.

గ్రామీణ ప్రాంతం నుండి వలస వస్తున్న ప్రజల సంఖ్యతో పట్టణాలలోను, నగరాలలోను జనాభా సంఖ్య నానాటికీ పెరుగుతూనే ఉన్నది. పెరుగుతున్న జనాభాకు సరిపడే సేవలు, కనీస వసతుల కల్పన మరియు నిర్వహణ, నగరీకరణకు తగ్గట్టుగా సందించటమే కాక పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ ఆరోగ్య పరిరక్షణ చేకూర్చటం వంటి విధులకు సరిపడే నిధులు సమకూర్చుకోలేకపోవటం అనే సవాళ్ళను నేడు భారతదేశంలోని పట్టణాలు ఎదుర్కొంటున్నాయి. ఈ సవాళ్ళను ఎదుర్కొనేందుకు స్థానిక సుపరిపాలనను ఏర్పాటు చేసుకోవాలి.

సుపరిపాలన ముఖ్య లక్ష్యం సంస్థల పునర్నిర్మాణమే. స్థానికపాలనను పెంపొందించటం ద్వారా స్థానిక ప్రజల జీవన స్థితిగతులు మెరుగు పర్చటంతో పునర్వవస్థీకరణకు సన్నద్ధం కావటం సుపరిపాలన ముఖ్య ధ్యేయం. సుపరిపాలనకు ప్రజల భాగస్వామ్యం కీలకమైనది కాబట్టి స్థానిక పాలనలో ప్రజల భాగస్వామ్యానికి, నిర్ణయాలకు స్థానం కల్పించబడుతుంది.

73   74వ రాజ్యాంగ సవరణ చట్టాలు వికేంద్రీకరణపాలన అమలుకు నాంది పలుకుతూ, 1994లో భారత రాజ్యాంగాన్ని సవరణ చేయటం జరిగింది. స్థానిక జెండా 21ని అమలు చేయడానికి ఈ చట్టాలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. అలా ప్రభుత్వంలోని మూడవ స్థాయి ప్రభుత్వంగా స్థానిక సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తిని కల్పించటం జరిగింది. అంతేగాక బడుగు బలహీనవర్గాలకు, వెనుకబడిన వర్గాలకు మరియు మహిళలకు రిజర్వేషన్లు కల్పించటం జరిగింది. ప్రతి ఐదు సంవత్సరాలకు క్రమం తప్పకుండా ఎన్నికలు నిర్వహించటం

ద్వారా స్థానిక సంస్థల మనుగడను కాపాడటం కూడా జరిగింది. స్థానిక సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేసి నిర్ణీత కాల వ్యవధిలో అంటే ప్రతి ఐదు సంవత్సరాలకు వాటి సాధికారతకు సూచనలు, సలహాలు ఇవ్వటం జరుగుతున్నది. స్థానిక అంశాలకు ప్రాధాన్యత నిచ్చేందుకు, స్థానిక ప్రజలకు స్థానిక అంశాలపై అవగాహన కల్పించేందుకు గ్రామ సభ మరియు వార్డు కమిటీలు ఏర్పాటుకు ఈ చట్టాలు అవకాశాలు కల్పించాయి.

## సుస్థిరాభివృద్ధికి స్థానిక పాలన

దేశ వనరుల సక్రమ నిర్వహణకు ప్రజలందరి భాగస్వామ్యం తప్పనిసరి. స్థానికస్థాయిలో ప్రజాస్వామ్య సంస్థలను బలోపేతం చేయటం ద్వారా స్థానిక వనరుల సుస్థిర నిర్వహణ మరియు మంచి వినియోగానికి అవకాశం కలుగుతుంది. స్థానిక పరిపాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచటం ద్వారా ప్రజా ప్రతినిధులతో అనేక కమిటీలు, సంఘాలు ఏర్పాటు చేయటం జరుగుతోంది. సరియైన సామర్థ్య నిర్మాణం చేపట్టడం ద్వారా స్థానిక అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల ప్రతిపాదనలకు, ప్రాజెక్టుల అమలు పర్యవేక్షణకు మరియు స్థానిక ఆస్తుల నిర్వహణకు అవకాశం కలుగుతుంది. దీని కొరకు 73 మరియు 74వ రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక ప్రజలు, సంస్థల సాధికారతకు భారత ప్రభుత్వం పునాదులు వెయ్యటం జరిగింది.

సమాజంలోని పౌరులందరూ సుస్థిరాభివృద్ధిలో భాగస్వాములు కావటం జరుగుతుంది. దీనిలో సగం వాటా మహిళలదే. స్థానిక పాలనలో మహిళా ప్రాతినిధ్యం మరియు మహిళలను శక్తివంతమైన సమాన భాగస్వాములుగా చేస్తోంది. అనాదిగా వివక్షకు గురౌతున్న సామాజిక సమూహాల్ని స్థానిక అభివృద్ధిలో సమాన భాగస్వాముల్ని చేసేందుకు వారికి స్థానికపాలనలో సరియైన ప్రాతినిధ్యం కల్పిస్తూ సాధికారత వైపు నడిపించాలి.

ప్రతి సమాజానికి బాల బాలికలు విలువైన ఆస్థి. పిల్లలు తమ శక్తి సామర్థ్యాలు తెలుసుకొని మంచి వాతావరణంలో పెంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే గాక సమాజంపై కూడా ఉంది. అలాంటి వాతావరణాన్ని ఏర్పాటు చెయ్యవలసిన బాధ్యత స్థానికపాలనపై ఉంది.

అభివృద్ధిని సుస్థిరం చేసేందుకు ప్రజల ఆర్థిక, సాంస్కృతిక మరియు వృత్తి అంశాల వైవిధ్యం ఒక ముఖ్య అంశం అయినప్పటికీ, అదే వైవిధ్యం సమాజంలో ఘర్షణలకు మరియు సామాజిక అభద్రతా భావానికి ముఖ్య కారకం కావొచ్చును. ఇలాంటి సమస్య పరిష్కారానికి పాలనలో ప్రజలు మరియు ప్రజా సంఘాల భాగస్వామ్యాన్ని పెంపొందించే యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం వుంది.

అలాగే రాష్ట్ర స్థాయిలోను, జాతీయ స్థాయిలోను వివిధ అంశాల నుండి గరిష్ట స్థాయిలో ప్రయోజనం పొందటం ద్వారా సుస్థిరాభివృద్ధి సాధించవచ్చును. సుస్థిరాభివృద్ధి సాధించేందుకు సమన్వయ ప్రణాళికలతో, పారదర్శకతతో మరియు వివిధ ప్రభుత్వ విభాగాల సమన్వయంతో విధానాలు అమలు చేయాల్సిన అవసరం వున్నది. సమాజంలోని పౌర సమాజం, స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రయివేటు సంఘాలు, విద్యా వైజ్ఞానిక సంఘాలు, కార్మిక సంఘాలు



మొదలైన ప్రజాసంస్థలు ప్రణాళికరణలోను మరియు వాటి అమలు లోను భాగస్వాములుగా చేయటం ద్వారా సుస్థిరాభివృద్ధి దిశ వైపు పయనించవచ్చును.

ఆధునిక సంక్షేమ రాజ్యం వివిధ రకాల ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ మంచి జీవన స్థితిగతులను ఏర్పాటు చేసేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నది. ప్రపంచ వ్యాప్తంగా 1990 నుండి సుస్థిరాభివృద్ధి పైన మరియు మానవ ఆధారిత అంశాల అభివృద్ధిపైన అనేక చర్చలు, సదస్సులు నిర్వహిస్తూ మానవ సాధికారత, ప్రజల భాగస్వామ్యం, పేదరిక నిర్మూలన, సమతౌల్యాభివృద్ధి మరియు సుదీర్ఘ సుస్థిరాభివృద్ధి అనే అంశాల్ని సుస్థిరాభివృద్ధిలో ముఖ్య భూమికలుగా నిర్ణయించారు.

ఒక దేశ సుస్థిరాభివృద్ధిలో సామాజిక, ఆర్థిక మరియు పర్యావరణ సంబంధిత అంశాలు కీలకపాత్ర వహిస్తాయి. ప్రస్తుత ప్రజల అవసరాలు సమకూర్చుకోవటంలో, భవిష్యత్తు తరాల ప్రజల అవసరాలు తీర్చుకోవటంలో రాజీపడని అభివృద్ధిని సాధించటమే సుస్థిరాభివృద్ధిగా అర్థ వివరణను ఇవ్వటం జరిగింది.

సుస్థిరాభివృద్ధి అనేది నేటి ప్రపంచాన్ని విస్తృతంగా ఆకర్షిస్తున్న అభివృద్ధి ప్రక్రియ. వర్తమాన జీవన సుస్థితితో పాటుగా భావితరాల సుస్థిర జీవన అవసరాలకు, జీవన విధానానికి బాటలు వేసే దిశగా తమ విధానాలు, ప్రణాళికలు తయారు చేసుకొని అమలు చేస్తున్నాయి. స్థానిక పాలనలలో ప్రజా సంస్థలను బలోపేతం చెయ్యటం ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని పెంచటం ద్వారా స్థానిక స్థాయిలో సామర్థ్యం, నిర్మాణాన్ని పెంపొందించటం ద్వారా సుస్థిరాభివృద్ధి వైపు అడుగులు వెయ్యవచ్చును. ప్రజల మరియు వివిధ ప్రజా సంఘాల భాగస్వామ్యాన్ని స్థానిక పాలనలో పెంపొందించేందుకు పటిష్టమైన యంత్రాంగాన్ని రూపొందించుకోవాలి.

కేంద్ర రాష్ట్రస్థాయిలలో సమన్వయ ప్రణాళికలతోను, పారదర్శకతతోను, వివిధ ప్రభుత్వ విభాగాల సహకారంతోను, పౌర సేవా సంస్థలు, ప్రజా సంఘాలు విద్యా వైజ్ఞానిక సంఘాలు, కార్మిక సంఘాలు వగైరాల భాగస్వామ్యంతో సుస్థిరాభివృద్ధిని సాధించవచ్చును. దేశ వనరుల సక్రమవినియోగానికి, నిర్వహణకు ప్రజలందరినీ భాగస్వాములుగా చెయ్యాలి. స్థానికపాలనలో ప్రజలు, ముఖ్యంగా మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా వున్నది.

*- ఆర్.డి.ఐ*



# పంచాయతీరాజ్ సంస్థల బలోపేతానికే రాజీవ్‌గాంధీ పంచాయతీ స్వశక్తీకరణ్ అభియాన్

**రాజ్యాంగంలో నిర్దేశించిన మేరకు పంచాయతీరాజ్ సంస్థలను బలోపేతం చేయడానికే ప్రభుత్వం రాజీవ్ గాంధీ పంచాయతీ స్వశక్తీకరణ్ యోజన పథకాన్ని ప్రవేశపెట్టిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ అదనపు కమీషనర్ డాక్టర్ పి.సుధాకరరావు చెప్పారు. విశాఖపట్నంలోని జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో రాజీవ్‌గాంధీ పంచాయతీ స్వశక్తీకరణ్ యోజన కార్యక్రమంపై శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల పంచాయతీరాజ్ సంస్థల అధికారులకు డిసెంబరు 6న నిర్వహించిన ప్రాంతీయ వర్కుషాపులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.**

పంచాయతీరాజ్ సంస్థలు నిర్దేశించిన లక్ష్యాలను సాధించడం కోసం వాటిని బలోపేతం చేయడం, శక్తి,సామర్థ్యాలను పెంచడం వంటి కార్యక్రమాలను ఈ పథకం ద్వారా చేస్తామన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబులు పంచాయతీలను స్వయం ప్రభుత్వాలుగా తీర్చిదిద్దడానికి కృత నిశ్చయంతో ఉన్నారన్నారు.

ఈ నేపథ్యంలో అమలవుతున్న ఈ పథకం ద్వారా పంచాయతీరాజ్ సంస్థలు స్థానిక ప్రభుత్వాలుగా రూపాంతరం చెందడానికి కావాల్సిన అన్ని రకాలుగా సామర్థ్యాలు పెంపొందించడానికి రాబోయే అయిదేళ్ళలో అనేక కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు.

ఈ పథకం ద్వారా ప్రధానంగా గ్రామసభను పటిష్టం చేయడంతోపాటు, స్థానిక సంస్థలలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన ప్రజాస్వామ్యబద్ధమైన నిర్ణయాలు తీసుకునే విధంగా వాటిని పటిష్టపరచడం చేస్తామన్నారు.

ఇప్పటికే ఈ పథకం అమలుకు రూ.210 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. వీటితో ఆయా సంస్థలకు భవన వసతి వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతను ఇస్తామన్నారు. వీటితోపాటు ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ఆయా పంచాయతీరాజ్ సంస్థలకు వాటి పనితీరు ఆధారంగా 20 శాతం వరకు నిధులు మంజూరు చేస్తారు.

గ్రామ పంచాయతీలు తమ సొంత ఆదాయవనరులు పెంచుకొనే విధంగా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఇంటిపన్నులు వసూళ్ళలో కార్యదర్శులు, విస్తరణాధికారి (పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి) ప్రత్యేక చొరవ తీసుకోవాలని.

గ్రామపంచాయతీలు చట్టం ప్రకారం వసూలు చేయాల్సిన పన్నులు రూ.800 కోట్ల వరకు ఉన్నా, ఇంతవరకు రూ.180 కోట్లు మాత్రమే వసూలయ్యిందన్నారు. ప్రజలను బాధించని రీతిలో పన్నులను ఏర్పాటు చేసి, సక్రమంగా వసూలు చేయాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శుల మీద ఉన్నదనేది గుర్తు చేశారు.

రాజీవ్‌గాంధీ పంచాయతీ స్వశక్తీకరణ్ అభియాన్ రాష్ట్ర కన్సల్టెంట్ డి.రామకృష్ణ మాట్లాడుతూ, రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల మేరకు గ్రామస్వరాజ్య సాధనకు పంచాయతీలకు రాజ్యాంగ ప్రతిపత్తి లభించిందని. పంచాయతీరాజ్ సంస్థలు స్థానిక ప్రభుత్వాలుగా రూపాంతరం చెందడానికి అవసరమైన సాధన సంపత్తిని ఈ పథకం ద్వారా ప్రభుత్వం కల్పిస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం, విజనగరం, విశాఖపట్నం ముఖ్య కార్యనిర్వహణాధికారులు వసంతరావు, జి.రాజకుమారి, ఎం.మహేశ్వరరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారులు బి.ఎం.సిల్వియా, బి.మోహనరావు, వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ ఇంజనీరింగు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

*– జిల్లా ట్రైనింగు మేనేజరు, విజయనగరం జిల్లా*



# సమర్ధవంతమైన విపత్తుల నిర్వహణ ద్వారా ప్రాణ, ధన నష్టాలను అధిగమించడం

**మనదేశంలో రోజురోజుకు పర్యావరణ మార్పుల వలన అనేక రకాల విపత్తులకు ప్రజలు గురికావడం జరుగుతోంది. వీటన్నంటిని దృష్టిలో పెట్టుకొని అపార్డ్‌లోని సి.యమ్.ఇ.డి. సెంటర్ విపత్తుల యాజమాన్యం 3 రోజుల పాటు శిక్షణను నిర్వహించింది. దీనికిగాను తెలంగాణలోని 10 జిల్లాల నుండి మరియు ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల నుండి జిల్లా మరియు డివిజనల్ స్థాయిల నుండి వివిధ శాఖల అధికారులు పాల్గొనడం జరిగింది.**

డిసెంబర్ నెలలో ఈ విధంగా 5 బ్యాచ్‌ల శిక్షణ నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమం కొరకు తెలంగాణా రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ నుండి అసిస్టెంట్ కమీషనర్ శ్రీ వినోద్ కుమార్, ఫారెస్ట్ అకాడమీ, డైరెక్టర్ శ్రీ రఘువీర్ ఐ.ఎఫ్.ఎస్, ఇండియన్ మెట్రిలాజికల్ డిపార్ట్‌మెంట్ మాజీ డైరెక్టర్ శ్రీ. సత్యకుమార్, అగ్రికల్చర్ రిసర్చ్ ఇనిస్ట్యూట్ నుండి ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ జి. శ్రీనివాస్, గాంధీ మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్ డాక్టర్ విమలా థామస్, అపార్డ్ ఫ్యాకల్టీ శ్రీమతి మాధురి మరియు శ్రీమతి ఝాన్సీరాణి మొదలైన వారు రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారు.

ఈ శిక్షణా కార్యక్రమంలో విపత్తుల నిర్వహణ చట్టం -2005 లో గల అంశాలు, వ్యవస్థాగతమైన విషయాలు, కేంద్రస్థాయి నుండి గ్రామస్థాయి వరకు వున్న కమిటీలు, కార్యనిర్వహక వర్గం గురించి వివరించారు. ప్రస్తుతం పర్యావరణంలో వస్తున్న మార్పులు, పర్యావరణ దుష్ప్రభావాలు విపత్తులు పెరగడానికి ఏ విధంగా కారణం అవుతున్నాయో, చేయాల్సిన ప్రత్యామ్నాయాలు వివరించారు. తుఫాన్‌లు ఏ విధంగా ఏర్పడుతాయి, తుఫాన్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కరువు ఏవిధంగా సంభవిస్తుంది కరువు నివారణ చర్యలతో పాటు విపత్తుల వలన ప్రజలు ఏ విధంగా అనారోగ్యానికి గురౌతారు. ఆ సమయంలో వచ్చే జబ్బులు, ఇన్‌ఫెక్షన్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు కూడా శిక్షణలో వివరించారు.

శిక్షణా కార్యక్రమంలో విపత్తుల నిర్వహణలో ప్రభుత్వ పరంగా చేయాల్సిన విధి విధానాల గురించి ల్యాండ్ సెల్ సెంటర్ హెడ్ వెంకటేశ్వర్ రావు, ఫ్యాకల్టీలు సలీముద్దీన్, శ్రీ జయపాల్‌రెడ్డి, శ్రీ ఆంజనేయులు వివిధ అనుభవాలను వివరించారు.

ఈ శిక్షణ కార్యక్రమానికి పంచాయితీరాజ్ శాఖ, గ్రామీణాభివృద్ధి, రెవిన్యూశాఖ, అగ్నిమాపకదళంశాఖ, పశుసంవర్ధకశాఖ, వ్యవసాయ-ఉద్యానవనశాఖ, పోలీస్‌శాఖల తదితర శాఖల నుండి శిక్షణకు హాజరయ్యారు.

ఈ శిక్షణలో పర్యావరణలో వస్తున్న మార్పులపై జాయింట్ డైరెక్టర్ శ్రీ యాదయ్య ఆధ్వర్యంలో నిర్మించిన లఘుచిత్రం పార్టిసిపెంట్స్‌ను చాలా ఆకట్టుకుంది. అంతేకాకుండా ఈ శిక్షణ కార్యక్రమంలో అధికారులంతా వారి జిల్లాలకు జిల్లా విపత్తుల ప్రణాళికను తయారు చేశారు. తద్వారా ఆయా జిల్లాల్లో విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై వారికి స్పష్టమైన అవగాహన కల్గింది.

*- సి.ఎం.ఇ.డి.*






# ఎం.జి.ఎన్. ఆర్.ఇ.జి.యస్.లో 'శ్రామిక గ్రూపుల వ్యవస్థీకరణ' పై జాతీయ వర్క్‌షాప్

**గ్రామీణ ప్రజలకు వందరోజులు పనిని కల్పించటంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పలు రకాలుగా ముందంజలో ఉందని, ఇప్పటివరకు దేశం మొత్తం మీద 5 కోట్ల కుటుంబాలకు ఒక లక్షా ఏభై వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి పనిదినాలు కల్పించినట్లు, పోస్టాఫీసులు బ్యాంకు అకౌంట్ల ద్వారా వారికి వేతనాలను చెల్లించినట్లు జాతీయ కౌన్సిల్ ఫర్ గుడ్ గవర్నెన్స్ కేంద్ర శాఖాధిపతి మిస్ పూనమ్ సింగ్ అన్నారు.**

ఆమె డిసెంబర్ 12న ఎ.ఎం.ఆర్ - అపార్డులో నిర్వహించిన ఎం.జి.ఎన్. ఆర్.ఇ.జి.యస్ శ్రామిక గ్రూపుల వ్యవస్థీకరణ పథకం అనే జాతీయ వర్క్‌షాప్‌లో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఆయా రాష్ట్రాలలో శ్రామిక గ్రూపులను ఏర్పాటు చేసి ఉపాధి హామీ పథకాన్ని మరింత ముందుకు తీసుకెళుతూ ఎక్కువ పనిదినాలను కల్పించవలసి ఉందన్నారు. వ్యక్తిగతంతో పాటు సమిష్టిగా గ్రూపుల వారీగా వేతనం పొందుట, ప్రభుత్వం అందించే సహాయం నిర్దేశిత గ్రూపులకు చేరవేయడానికి మరింత సమర్ధతగా పనిచేయాలని పూనమ్ సింగ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో శ్రమశక్తి సంఘాలు పని బేషుగ్గా ఉందని ఆమె అభిప్రాయపడ్డారు.

తెలంగాణా రాష్ట్రంలో శ్రమశక్తి సంఘాల ద్వారా ఉపాధి హామీ పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి కమీషనర్ డి. వెంకటేశ్వర్లు, ఐ.ఎఫ్.ఎస్ అన్నారు. ఆయన ఈ రెండు రోజుల వర్క్ షాప్‌లో ప్రారంభోపన్యాసం చేస్తూ 2009-10 నుండి ఎం.జి.ఎన్.ఆర్.జి.యస్ అమలు చేయడం జరుగుతుందని, ప్రస్తుతం తెలంగాణలో 76 లక్షల మంది, 4.30 లక్షల గ్రూపులుగా పనిచేస్తున్నాయని, శ్రమశక్తి సంఘాలలో 2 నుండి 20 మంది సభ్యులుగా పనిచేస్తూ గ్రూపు నాయకుల ద్వారా కార్యక్రమాలు నడుస్తున్నాయని శ్రీ వెంకటేశ్వర్లు వివరించారు. గ్రూపుల సమైక్యత అంశం వలన పరస్పర సహకారాన్ని పొందుతున్నారని ఆయన అన్నారు.

అనంతరం తెలంగాణ ప్రొగ్రామ్ మేనేజరు వి. మురళీధర్, ఎల్. కృష్ణమూర్తి శ్రామిక శక్తి సంఘాల సమిష్టి బాధ్యతతో ఏ విధంగా పని చేస్తున్నాయో వివరించారు.

ఈ రెండు రోజుల జాతీయ వర్క్ షాప్‌లో తెలంగాణ రాష్ట్రం నుండే కాక, మహారాష్ట్ర, తమిళనాడు ఆంధ్రప్రదేశ్ రాష్టాల నుండి ఎం.జి.ఎన్.జి.ఆర్.ఇ.జి.ఎస్ ప్రొగ్రామ్ అధికారులు పాల్గొన్నారు. వీరు క్షేత్రస్థాయి వాస్తవిక అంశాలను గూర్చి వారి వారి రాష్ట్రాలలో ఉపాధి హామీ పథకాన్ని మరింత సమర్ధవంతంగా అమలు చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకొంటున్నారనే దానిపై చర్చించడం జరిగింది.

*- సి.ఎం.పి.*

# గ్రామ పారిశుద్ధ్య మెరుగుదలకై గ్రామ సర్పంచ్ విన్నపం

## (నమూనా సందేశం)

***గౌరవ సోదర, సోదరీ మణులారా !***

***ముందుగా మీ అందరికీ నా శుభాకాంక్షలు.***

మనమందరం ఎంతో ఉత్సాహంగా అక్టోబర్ 2, 2014 తేదీన 'స్వచ్ఛ భారత్' కార్యక్రమాన్ని ప్రారంభించుకున్నాం. అందరం కలిసి మెలిసి స్వచ్ఛతా కార్యక్రమాల్లో పాల్గొంటున్నాం. వచ్చే 5 సంవత్సరాలలో మన దేశంలోని గ్రామాల్లో స్వచ్ఛతను సాధించాలని కంకణం కట్టుకున్నాం. అదే మహాత్మాగాంధీకి మనం ఇవ్వబోయే బహుమతి.

అందుకే ఈ రోజు నుండి స్వచ్ఛ గ్రామం 'స్వచ్ఛ భారత్' కోసం కలలు కందాం. ఆ కలలను సాకారం చేసుకునేందుకు శ్రమిద్దాం. మనదేశం ప్రపంచ దేశాల సరసన సగర్వంగా తలెత్తుకునేలా చేద్దాం. అందుకు బీజం మన గ్రామం నుంచే మొదలుపెడదాం.

పారిశుద్ధ్యం / పరిశుభ్రత మనకు కొత్తేమి కాదు. ప్రపంచంలో ఎక్కడా వాటి ప్రస్తావనే లేక మునుపే మన నాగరికతలో పారిశుద్ధ్యం ఒక భాగమై ఉన్నది. వేల సంవత్సరాల క్రితమే మన పూర్వీకులు మరుగుదొడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను చక్కగా నిర్వహించారు. సింధూ నాగరికతలో ఈ విషయాలు రుజువయ్యాయి. మళ్లీ ఆ దిశలో ముందుకు సాగుదాం. మన గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం.

అందుకే, మనం ప్రారంభించిన 'స్వచ్ఛత' కార్యక్రమాన్ని సంతోషంగా ముందుకు తీసుకువెళదాం. అది ఎంతగా అంటే ఓ ఉద్యమంలా ముందుకు సాగుదాం. అలా అయితేనే –

★ 2019 నాటికి మన గ్రామాలలో ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వాడడం ద్వారా బహిరంగ మలవిసర్జనా రహిత గ్రామాలుగా అవతరించ గలుగుతాం.

★ వచ్చే సంవత్సరం ఆగష్టు 15 నాటికి (2015) స్వాతంత్ర్య దిన కానుకగా మన చిన్నారులకు ప్రతి బడిలో పారిశుద్ధ సౌకర్యాలు అందుబాటులోనికి తీసుకురాగలుగుతాం.

★ అలాగే మన బుడి బుడి అడుగుల చిన్నారుల అంగన్‌వాడీలలో మరుగుదొడ్లు వాడేందుకు ఆ సౌకర్యాన్ని కల్పించగలం.

★ మన గ్రామాలలో చెత్తాచెదారం, మురుగు నీటిని సమర్థవంతంగా నిర్వహించుకుంటూ, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ మన గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుకోగలం.

తద్వారా 'స్వచ్ఛ భారత్' ఆశయాలను సాధించగలం.

**మిత్రులారా !**

ఇప్పుడున్న పరిస్థితులలో మన గ్రామాలలో పారిశుద్ధ్య పరంగా ఉన్న సమస్యలలో అతి ముఖ్యమైన సమస్య 'బహిరంగ మల విసర్జన' ఈ సమస్య నుండి బయట పడాలంటే ప్రతి ఇంటా ఒక మరుగుదొడ్డి అందుబాటులో ఉండి, అది వాడకంలోనికి రావాలి.

***అయితే, మన గ్రామంలో –***

★ మరుగుదొడ్డి ఉండి, వాటిని పూర్తిగా వాడుతున్న కుటుంబాలు మీ అందరికీ తెలుసు. వారిని మనస్పూర్తిగా మనమందరం అభినందిద్దాం.



★ మరుగుదొడ్లు ఉండీ, అడపాదడపా వాడుకొనే కుటుంబాలు కొన్ని ఉంటే అసలు వాడని కుటుంబాలు మరికొన్ని ఉన్నాయన్న మాట మనందరికీ తెలుసు.

★ మరికొందరికి అసలు మరుగుదొడ్లే లేవు. వారందరు బయటకు పోవడం అతి సహజంగా జరుగుతుంది.

వెరశి మన గ్రామంలో బహిరంగంగా మల, మూత్రాదులను విసర్జించే వారే ఎక్కువున్నారు. దీనివలన –

★ మలంలో కోట్ల సంఖ్యలో ఉన్న బాక్టీరియా, వైరస్, సూక్ష్మ క్రిములు, వీటి గుడ్లు – బహిరంగంగా వదిలివేయబడుతున్నాయి.

★ అలా వదిలి వేయబడిన హానికరక క్రిములు గాలిద్వారా, నీటిద్వారా, పశుపక్ష్యాదుల, కీటకాల ద్వారా, పొలాల ద్వారా, మనచేతులు, కాళ్ళ ద్వారా, మోటారు వాహనాల ద్వారా మన ఇళ్ళలోకి, మన ఆహారంలోకి, మన పానీయాలలోనికి ప్రవేశిస్తున్నాయి.

★ వీటిని భుజించడం, త్రాగడం ద్వారా రకరకాలు రోగాలు సంక్రమిస్తున్నాయి. ముఖ్యంగా డయేరియా, టైపాయిడ్, జాండీస్ లాంటి వ్యాధులబారిన పడుతున్నాం.

★ ఫలితంగా శారీరక వైకల్యం, వైద్య ఖర్చులు, పని కోల్పోవడం ఆదాయం తగ్గడం, పిల్లలు బడికి పోకపోవడం వంటివి మనం అనుభవించ వలసి వస్తున్నాయి. ముఖ్యంగా పాలిచ్చే తల్లులు, గర్భంతో ఉన్న తల్లుల తమ అనారోగ్యం కారణంగా తమ పిల్లలపై ప్రభావం చూపుతున్నారు.

*ఇదంతా జరగకుండా ఉండాలంటే మనమందరం –*

★ మల, ముత్రాదులను బహిరంగంగా వదిలి వేయకూడదు.

★ మరగుదొడ్లను వాడడం ద్వారా మల వ్యాప్తిని అరికట్టడం.

★ దీంతో పాటు మలవిసర్జన తదుపరి చేతులు సబ్బుతో కడుక్కోవడం తప్పనిసరిగా అలవరచుకోవాలి.

*అందుకై మనమందరం కలిసి ఒక ప్రతిజ్ఞ తీసుకుందాం.*

★ మరుగుదొడ్లు ఉన్న కుటుంబాల నుండి (పిల్లలతో సహా) ఒక్కరు కూడా, ఈరోజు నుండి బయటకు వెళ్ళవద్దు. మరుగుదొడ్లు లేని మన ప్రక్కనే ఉన్న కుటుంబాల వారిని మన మరుగుదొడ్లను వాడుకునేందుకు ఆహ్వానిద్ధాం.

★ చిన్న పాటి మరమ్మత్తులు ఉంటే, వెంటనే ఎవరికి వారుగా వాటిని పరిష్కరించుకొని, అట్టి మరుగుదొడ్లను వాడకంలోనికి తెచ్చుకుందాం.

మరుగుదొడ్లు లేని కుటుంబాలను గుర్తించి, అర్హులైన వారికి వెంటనే మరుగుదొడ్లు మంజూరు చేయిద్దాం.

★ మంజూరైన మరుగుదొడ్ల త్వరగా నిర్మించుకొనేందుకు కావలసిన మేస్త్రీలను, ప్లంబర్లను, వస్తు సామాగ్రిని అందుబాటులోనికి తెచ్చుకుందాం.

★ అర్హత లేని కుటుంబాలు తక్షణం స్వంతంగా మరుగుదొడ్లు కట్టుకో వలసిందేనని తెల్చి చెప్తాం.

★ మరుగుదొడ్లు నిర్మించుకొని, అవి వాడకంలోకి వచ్చేవరకు తాత్కాలిక ఏర్పాట్లు చేసుకుందాం అంటే, 'కందకాలు తవ్వుకుందాం'.

మలాన్ని మట్టితో కప్పేద్దాం.

ఇందుకు మనందరం మనసా, వాచా కర్మణా మాటకు కట్టుబడి ఉందాం.

అలాగే మన గ్రామంలో ఉన్న అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీలలో మరగుదొడ్ల వాడేందుకు వీలుగా ఆయా శాఖాధికారులతో మాట్లాడదాం. యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేసేలా చూద్దాం. ఎందుకంటే,



'ఈనాటి చిన్నారులే, రేపటి భావి భారత పౌరులు' వారు ఆరోగ్యంగా, ఆహ్లాదంగా ఉంటేనే వారు ఉన్నతిలోకి వస్తారు. మంచిగా చదువుకుంటారు, ఆడుకుంటారు, ఆరోగ్యంగా ఉంటారు.

*ఇకపోతే, మరో అంశం,*

మనం ముందుగా చెత్తను తగ్గిద్దాం. ఎలా అంటారా, ప్లాస్టిక్ సంచులు మానేద్దాం, గుడ్డ సంచులు వాడదాం. ఎంత నీరు అవసరమో అంతే వాడుదాం.

వచ్చే చెత్తను మన ఇంట్లో మనమే రెండు సంచుల్లో వేర్వేరుగా వేసుకుందాం. కుళ్ళే చెత్తను ఎరువు గుంతలో వేద్దాం. కుళ్ళని చెత్తను పాతసామాన్ల వానికి అమ్మేద్దాం.

లేకుంటే స్నానాల గది వంటగది నీటిని (కాల్వ ఉంటే, కాల్వలోనికి) 'ఇంకుడు గుంత' ఏర్పరచి అందులోనికి మళ్ళిద్దాం. లేదంటే పెరటి తోటకు మళ్ళిద్దాం. గ్రామ స్థాయిలో ఉత్పన్నమయ్యే చెత్తను ఊరికి దూరంగా మళ్ళిద్దాం. దాని నిర్వహణకు ప్రతిపాదనలు రూపొందిద్దాం.

చివరిగా మన ఒళ్ళు, ఇల్లు శుభ్రంగా పెట్టుకుందాం. త్రాగేనీరు, తినేతిండి, పశువుల పాక, పెరడు, వీధులను శుభ్రంగా ఉంచుకుందాం.

ఇవన్నీ మనమందరం కలిసికట్టుగా చేద్దాం. ఇందుకు ఇంటింటికీ తిరుగుదాం.

వీధి వీధినా చాటుదాం అందుకై వారంలో ప్రతి శనివారం (మీ వీలును బట్టి ఎంపిక చేసుకొండి) మధ్యాహ్నం 3–5 గంటల మధ్య గ్రామ పంచాయితీ కార్యాలయం దగ్గర సమావేశమౌదాం. అందరం ఒక నిర్ణయానికి వద్దాం. 'స్వచ్ఛ గ్రామం' మన లక్ష్యం. అందరం కలిసి గ్రామాన్ని శుభ్రంగా ఉంచుకుందాం.

అందుకై మనమందరం ప్రతిజ్ఞ చేద్దాం.

*'జై స్వచ్ఛ గ్రామం – జై స్వచ్ఛ భారత్'*

*– పి. మాధురి,*
*నీరు మరియు పారిశుద్ధ్య కేంద్రం ఎవింఆర్ – అపార్డ్*

# సంక్రాంతి - సామాజిక క్రాంతి



**ఏదో ఓ విశేషం లేనిదే దాన్ని 'పండుగ రోజు' అని అనలేదు ప్రాచీనులు. కాబట్టి 'పండుగ' అనే పేరిట ఏ రోజొచ్చినా దానిలో దాగున్న రహస్యాలని తెలుసుకోవడం మన ధర్మం వాటిని తెలియజేయడం పెద్దల కర్తవ్యం.**

సహజంగా పండుగ అనగానే నూటికి 80 పాళ్లు దాంట్లో ఆధ్యాత్మిక విశేషం దాగుంటుంది కాబట్టి అంతా ప్రతి పండుగనీ దైవపరంగా అన్వయించుకుంటూ వెళ్లిపోతుంటారు. దేవాలయాలు కిటకిటలు, నైవేద్యాలు ఘుమ ఘుమలు, భక్తుల రద్దీలు, ఈ రెండ్రోజుల్లో ధరలు మోతలు... ఇలా సాగిపోతూంటుంది పండుగ.

అయితే పండుగ వెనుక దాగిన సామాజిక దృక్పథాన్ని పరిశీలిస్తే పండుగ అనేది మన సమాజాన్ని ఉద్ధరించేందుకు ఎలా తోడ్పడుతుందో అర్థమౌతుంది. ఆ దిశగా నాలుగడుగులు వేద్దాం!

### స్వచ్ఛ భారత్

సంక్రాంతి పండుగ ఇంకా రాకుండానే ఓ నెల ముందునుండీ (డిసెంబరు 16) ధనుర్మాసం పేరిట ముగ్గుల్ని వేయాలని ఓ నియమం పెట్టారు పెద్దలు.

దీంతో గృహిణులంతా కూడా తెల్లవారు ఝామునే లేవాల్సి రావడం, చలి బాగా కొరుకుతూ ఉండే కాలంలో, మంచు కూడా కురుస్తుండే వేళలో, నేలమీదికి వంగి రెండు కాళ్ళ మీదా శరీరపు బరువుని ఆన్చి నడుముని వంచి ముగ్గు వంకతో అటూ ఇటూ తిరగడమంటే అది గట్టి వ్యాయామం శరీరానికి, ఇది ఒక రహస్యం.

ప్రతి ఇంటి ముంగిలినీ తామే శుభ్రం చేసుకోవడం, మరింత ఆకర్షణీయంగా ఉండేందుకై ఆవుపేడతో అలకడం, దాని మీద అందంగా ఓ ముగ్గుని పెట్టడం, దాన్ని తొక్కరాదనే సూచనని మౌనంగా చేస్తూ ముగ్గుకి నాలుగు వైపులా నాలుగు నిలువు కర్రల్లాటి చక్కని లతల ముగ్గుని వేయడం..... వంటి ఇవన్నీ మన ప్రధానమంత్రి ఆశించిన 'స్వచ్ఛభారత్' కి సంబంధించిన కార్యక్రమాలే అనుకోవచ్చు. నెల రోజుల పాటు మన ముంగిలిని ఆకర్షణీయంగా ఉంచడానికి అలవాటు పడితే, సంక్రాంతి వెళ్లాక ఆ నేలని అందంగా లేకుండా అసహ్యంగా ఉంచ గలమా? కాబట్టి ముగ్గులనేవి మనలో పరిశుభ్రతా గుణాన్ని కలగజేసేందుకు తోడ్పడుతాయన్న మాట.

### శ్రమ యేవ జయతే

లోకంలో ఎందరో ఆ రోజు వార్తా పత్రికలో వచ్చిన వార్త గురించో, రాజకీయాల గురించో, సినిమాలని గురించో, క్రికెట్టు.... ఇలా ఏదో ఒక విషయాన్ని గురించి గంటల తరబడి చర్చించుకుంటూ (ప్రతి వార్తని గురించీ ఆలోచించడం అవసరం గాని గంటల తరబడి.....అనవసరం కదా!) వ్యర్థంగా సమయాన్ని పాడుచేసుకుంటూ ఉంటారు.

ఇలాంటి వారికి గంగిరెద్దు చక్కని ఉపదేశమిస్తుంది.

ఆషాఢమాసం తొలకరి చినుకు పడగానే భూజానికి తగిలించుకున్న నాగలిని పంట పండిన తర్వాత ధాన్యాన్ని గాదెలకి నింపేంత వరకూ ఆ పనో ఈ పనో చేస్తూనో ఉంటుంది ఎద్దు. గాదెలని ధాన్యంతో నింపడం పూర్తయ్యాక - పరీక్ష రాసేసిన విద్యార్థిలాగా - సెలవుల్ని అనుభవిస్తున్న ఉపాధ్యాయునిలాగా - ఆనందంగా ఇంటింటికీ వచ్చి 'అంబా' అని పలకరిస్తుంది గంగిరెద్దు.

'పని ఉన్నప్పుడు శరీరాన్ని వంచి పనిచేయాలనీ, పని దొంగగా ఉండనే కూడదనీ, పని అయిపోయిన పిమ్మట హాయిగా తన నుండి సహాయం పొందిన వారిని పరామర్శించడానికి వెళ్లొచ్చనీ - వాళ్లు ధన్యవాద పూర్వకంగా పాత బొంత ఇచ్చినా ఆనందపడాలనీ, ఇలా అహంకారం లేని జీవితం చేస్తూంటేనే ఆనందం తమ సొంతమవుతుందనీ పరోక్షంగా చెప్తుంది గంగిరెద్దు.

కాబట్టి శ్రమ అనేది మాత్రమే ఫలితాన్నిస్తుందనే విషయాన్ని (శ్రమ యేవ జయతే) సోదాహరణంగా చూపించేది గంగిరెద్దన్నమాట.

యజమాని తన పాలన పోషణ చూసుకుంటున్న కారణంగా, 'తనకి తోచిన (శక్తి ఉన్నంతలో సహాయాన్ని) రీతిలో అతనికి సహాయపడుతూండడం కృతజ్ఞత' అని తెలియజెప్తూ యజమాని పట్ల వినయ విధేయతలని చూపించడం ధర్మమని మౌనంగా చెప్తుంది గంగిరెద్దు.



## ఇంటింటా ఆరోగ్యం

వ్యవసాయానికి కావలసింది సరైన కాలంలో సరైన దిగుబడి రావడం కోసం అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతి కదా ! అదే తీరుగా వాతావరణంలో ఉండే కాలుష్యాన్ని నివారించడం కోసం ప్రాచీనులు ఏం చేస్తే బాగుంటుందా? అని ఆలోచించారు. చలీ దానితో పాటు మంచూ కూడా విజృభించే ఈ కాలంలో చలికీ మంచుకీ అనేక రోగ కారక క్రిములు వాటంతట అవే సంఖ్యలో వృద్ధి చెందిపోతూ ఉంటాయి. దాంతో శీత పైత్య వ్యాధులు పెరిగే అవకాశం మరింత ఎక్కువగా ఉంటుంది.

ఈ కారణంగా వాతావరణ పరిశుభ్రత కోసమూ, ఇంటింటా ఆరోగ్యం కోసమూ భోగి పండుగ నాడు ఎక్కడెక్కడి ఎండె కర్రల్నీ తెచ్చి నాలుగు మార్గాల కూడళ్లలోనూ వేసి మంట పెట్టవలసిందన్నారు పెద్దలు.

ఈ మంటలు గ్రామంలోని దాదాపు అన్ని కూడళ్లలోనూ వేయబడే కారణంగా మొత్తం క్రిమికీటక నాశనం జరిగి రోగ నిరోధకత పెరుగుతుంది ప్రజల్లో – ఇంటింటా ఆరోగ్యవంతుల సంఖ్య హెచ్చవుతుంది.

దీంతో పాటు ప్రతి ఇంటిలోనూ అనవసరంగా పడి ఉన్న కర్రముక్కలు (మా తాత వాడిన కుర్చీ ఫ్రేం – అమ్మమ్మ వాడగా విరిగిన చేతి కర్ర – మామయ్య మంచం కోడు... అని ఇలా) అంగ వైకల్యంతో ఉన్న చెక్కవస్తువులన్నీ ఈ మంటల్లో పడిపోయి ఇంటిలో బూజు తద్వారా ఎలర్జీ వ్యాధులు రాకుండా పోతాయి.

ఇల్లు కూడా ఈ వస్తువులని తీసివేసిన కారణంగా విశాలంగానూ పరి శుభ్రంగానూ కన్పిస్తుంది. పెద్దలు ఇలా చేస్తే ఇంట్లో ఉన్న పిల్లలు కూడా అదే మార్గాన్ని అనుసరిస్తూ ఇంటిని సౌకర్యవంతంగానూ, పరిశుభ్రంగానూ ఉంచుకునే అలవాటుని చేసుకుంటారు.

## ప్రాత కాల వ్యాయామం

సంక్రాంతి రావడానికి ముందు నెలరోజులపాటు చక్కని వేషంతో హరిదాసు వేగంగా అడుగులు వేసుకుంటూ మంచి హరి కీర్తనని పాడుకుంటూ వచ్చి, ఇంటి ముందుకి రాగానే ఒక్కసారిగా మోకాళ్ల మీద కూర్చుని తన తల మీది పాత్రలో బియ్యం పోయడమయ్యాక – తనంత తానే ఎవరి సహాయమూ లేకుండా లేచి మళ్లీ వేగంగా కదిలిపోతాడు.

తెల్లవారుఝామున బాగా చలీ, మంచూ ఉంటాయనే వంకతో దుప్పటీ ముసుగేసుకుని తన్ని పెట్టి పడుకోవడం సరి కాదనీ, చలికి భయపడితే అది పులిలా భయపెడుతుందనీ దాన్ని తనలా జయించి వడివడిగా అడుగులు వేయడం ప్రారంభిస్తే పిల్లిలా అదుపులో ఉంటుందనీ తెలియజేస్తాడు అనుభవపూర్వకంగా హరిదాసు.

ఎక్కడికక్కడ మోకాళ్ల మీద కూర్చోగలగడం, తనంత తానే లేవగలగడమనేది అందునా ప్రాత:కాలంలో అలా చేయడమనేది చక్కని ఆరోగ్య సూత్రం కదా!

తాను ఇంటింటికీ కదిలి వెళ్తూంటే తలమీద గిన్నెలో బియ్యపు బరువు పెరుగుతూంటే కూడ ఏ చేత్తోనూ పట్టుకోకుండా వేగంగా వెళ్తుండడమనేది ఏకాగ్రతకి నిదర్శనం కూడా !



## రైతు స్నేహితులు

ఈ సంక్రాంతి రోజుల్లో పాములవాళ్లు చక్కని జాతి పాముల్ని బుట్టలో తెచ్చి ఇంటింటికీ వచ్చి నాగస్వరం ఊదుతూ ఆడిస్తూ బహుమానాన్ని తీసుకుని వెడతాడు. ఇలా ఆడించడమనేది రెండు విధాలుగా మనకి మేలు చేసినట్లౌతుంది.

సాధారణంగా లోకంలో అందరికీ 'పాము' అనగానే ఓ భయం ఉంటుంది. పేరు తలుచుకోగానే కలిగే మనోభయం దాన్ని చూసినప్పుడు మరింత భయమౌతుంది. మనది వ్యావసాయకదేశం. అంటే వ్యవసాయం ఆధారంగా జీవనాన్ని గడిపే దేశం. వ్యవసాయ భూముల్లో నిరంతరం తిరుగాడుతూ ఉండేవి పాములే. పాముల్ని గురించిన భయమే వ్యక్తులకు ఉన్నట్లయితే వాళ్లు పొలంలోనికి దిగలేరు. – రైతులుగా వ్యవసాయాన్ని చేయలేరు. వాళ్లకి ఆ మనోభయం పోయేలా చేయాలంటే ఎప్పుడో అరుదుగా పొలాల్లో కన్పడే పాముల్ని ఎప్పుడూ చూపిస్తూ ఉంటే (కర్షకులకి ఎలాగూ భయం ఉండదు. ఉంటే వాళ్లు పొలం పనిని చేయనేలేరు) రైతుల గృహిణులకీ కుటుంబ సభ్యులకీ కూడ పాములంటే ఉండే భయం తగ్గుతుంది.

పాములవాడు రాగానే అందరూ ఆ పాముని చూస్తూ దాని వివరాలడుగుతారు. ఆ సందర్భంలో అతను ఇది ' నాగ దేవత' అంటూనే చెప్తాడు (తాను దాని మీద ఆర్జిస్తున్నాడు –తన వృత్తి అదే కాబట్టి) తప్ప. 'ఇది చంపేస్తుంది. జాగ్రత్త!' అని హెచ్చరికలు చేయడు. ఒకవేళ ఏ పాము ఏ విధంగా ఉంటుందో చెప్పినా, దాని జోలికి వెళ్లని పక్షంలో పారిపోతోందని ప్రతి పాములవాడూ ఖచ్చితంగా చెప్తాడు – దానిక్కారణం పాముకున్న స్వభావం అదే కాబట్టి.

నిజానికి పాముకి భయం చాలా ఎక్కువ. తాను పాకుతూ నేలవైపే చూస్తుంటే ఆకాశం నుండి ఏ పక్షి పట్టేస్తుందా? అనీ, తన తోకని పట్టుకుని ఎవరు తన కదలికని ఆపి వేస్తారోననీ (తోకని పట్టి గట్టిగా వేలాడదీసినట్లు తలకిందులు చేసి పైకీ కిందికీ అన్నట్లయితే పాము ఏమీ చేయలేదు. నడుములు జారిపోవడమంటారే అలా పాకలేకపోతుంది. మనిషికి చిక్కనంత

వరకే అది, దాని ప్రతాపం ధైర్యం కోపం రోషం చూపిస్తుంది. మనిషికి చిక్కాక ఎటు పారిపోవాలా? అని ప్రయత్నిస్తూనే ఉంటుంది. అందుకే పాముల్ని పట్టేవాడు బుట్టలో నుండి పైకి రావలసిందిగా పాము శరీరంమీద చేతితో అదిలించగానే ఒక్క పెట్టున పడగెత్తి లేచి ఎటు పారిపోవాలా? (ఎందరో తనని చూస్తూ ఉన్నారుగా! తన ప్రాణానికి భయం వాటిల్లింది) అని చూస్తూ వెంటనే ఒకవైపుకి తలదించి సాగిపో జూస్తుంది. దానికి మనం భయపడి కదిలిపోతాం తప్ప. అది భయపడుతుందో గమనించ(లే)ం.

అలాంటి పాముల్ని చూసి రైతు కుటుంబ సభ్యులందరూ భయపడకుండా ఉండడానికి, నాగ దేవత కరుణించాలని ప్రార్థించి – మన నాగ దేవతరాధన కారణంగా, మనని ఏమీ చేయదనే ధైర్యంతో ఉండడానికీ ఈ పాముల ఆటని చూపిస్తారు – ఈ రోజుల్లో . ఈ పండుగ కాలంలోనే పాముల్ని ఆడిస్తూ రావడానిక్కారణం పాములకి రక్తం చల్లగా ఉంటుంది కాబట్టి చలి, మంచూ ఉన్న కాలంలో ఆనందంగా తిరగడం వాటికిష్టం. అందుకే పాముల్ని పట్టే వాళ్లకీ పాములు దొరుకుతాయి. ఆడించి నాలుగు సొమ్ములు చేసుకోవడానికీ అవకాశమిస్తాయి.

అందుకే సుబ్రమ్మణ్య షష్ఠి – నాగ చతుర్థి – నాగ పంచమి...... ఇలాంటివన్నీ ఈ ఈ రెండు (కార్తిక, మార్గశిర) మాసాల్లోనే వస్తాయి. ఇదంతా ఒక దృక్పథం. ఇక రెండవ విధానం మరోటుంది.

ఒక ఎలక పంటపొలంలో చేరితే సంతానాన్ని పెడితే దాదాపు 6.7 బస్తాల పంటని పాడు చేస్తుంది. అంతటి శక్తివంతమైన ఎలుకల్ని పట్టాలంటే ఎలుక ఒక్కింటికి రూ. 20 ఇస్తే తప్ప రైతుకి ఈ రోజున పట్టడం సాధ్యం కావడంలేదు. ఇలా కొన్నింటిని కొట్టడం సాధ్యపడినప్పటికీ అన్నిటికీ అన్నిటినీ పట్టవీలు కాదు – పట్టిన ప్రతిసారీ ఇంతింత చొప్పున ఈయడం కుదిరే పనీ కాదు. కిట్టదూకూడా.

పాములు ఎలుక కన్నాల్లోకి వెళ్లి మరీ వాటిని తిని రైతుకి ఎంత మేలుని చేస్తున్నాయో గమనిస్తే రైతుకి మిత్రులు పాములని తెలుస్తుంది. ఆ విషయాన్ని తెలియజేస్తూ పాములవారి రాక ఈ పండుగ కాలంలో సాగుతుంది. మనం కూడా పాముల్ని చంపి పంటని పాడుచేసుకోవద్దు.





## మాటల్ని అమ్ముతారు జాగ్రత్త !

ఇదే పండుగ రోజుల్లో పిట్టల దొరలంటూ ఓ విచిత్ర వేషంలో వస్తారు కొందరు. మాటల్లో చెప్పలేని కోతల్ని కోస్తూ వినోదాన్ని పంచుతారు. ఇది మరింత గమనించాల్సిన విషయం.

అక్కడ ఏమీ లేకున్నా ఈ భూమికి దగ్గర్లో ఇది ఉంది – అది చేయిస్తాం– ఇది చేయిస్తామంటూ ప్రభుత్వ భూమిని అమ్మే ప్రబుద్ధులూ, చిట్‌ఫండ్ల పేరిట టోపీ వేసే మహానుభావులూ, ఉద్యోగాల పేరిట వసూలు చేసి తప్పించుకు తిరిగే పుణ్యాత్ములూ.... ఇలా కన్పించే ఈ అందరూ ఆ పిట్టల దొరలాంటి వాళ్లే. 'చెప్పే మాటలన్నింటినీ నమ్మవద్దని సూచించే విచిత్ర వేషం ఇది' అని గమనింపజేసే పండుగ సంక్రాంతి అవుతుంది కదా ఈ వేషం ద్వారా!

## కనుము

పశువుల్ని బాగా కడిగి పూలతో అలంకరించి ఊళ్లో ఊరిగేంపుగా తిప్పుతారు ఈ రోజున. ఇది ఓ తీరు సంమానమన్నమాట వాటికి. నిజానికి ఈ పశుజాతిగాని లేనట్లయితే మానవుడు చేయగలిగింది సున్న. కాబట్టి కృ తజ్ఞతా భావాన్ని చూపాలని చెప్తూ చేసే పండుగ రోజు 'కనుమ'.

కాకికి అన్నపు ముద్ద ఆహారం, పిచ్చుకలకి గాదెలకి కట్టిన ధాన్యపు కంకుల ఆహారం, కుక్కలకి గారెల ఆహారం, పశువులకి పొలంలోన ఎండుగడ్డి ఆహారం, మనుష్యులకి పిండి వంటల భోజనం.... ఇలా అన్ని తీరుల ప్రాణులకీ కడుపుని నింపే ఈ పండుగ ఎంత గొప్పది!

ఇంతకీ ఈ పండుగ ఏ దైవానికి సంబంధించినదని పరిశీలిస్తే ఇది సూర్యుని (సంక్రమణం) కి సంబంధించిన పండుగ. సూర్యుడు లేనిదే జగత్తే లేదు కాబట్టి సంపూర్ణంగా కలిగిన వాళ్లనే విషయం సంక్రాంతి ద్వారా మరింతగా తెలుస్తుందన్నమాట.

*సంక్రాంతి లక్ష్మీ ! సిరులనియ్యమ్మా !*

– మైలవరపు శ్రీనివాసరావు

# గ్రామ పంచాయతీల బలోపేతానికి రాజీవ్ గాంధీ సశక్తీకరణ అభియాన్

**సామర్లకోట, గ్రామపంచాయతీల బలోపేతం, స్థానిక స్వయం పాలన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ గాంధీ సశక్తీకరణ అభియాన్ పథకం ఉపకరిస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ ఉపాధి అడిషనల కమిషనర్ డాక్టర్ సుధాకరరావు, మాజీ కమిషనర్, రిటైర్డు ఐఎస్ అధికారి, ఆర్జీపిఎస్ఎ కన్సల్టెంట్ డి రామకృష్ణ పేర్కొన్నారు.**

సామర్లకోట ఇటిసిలో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన ఎంపిడిఓలు, ఇఒపిఆర్‌డిలు, పిఆర్ఇలకు ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించారు. రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ హాజరుకావల్సినప్పటికీ చివరి క్షణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం కారణంగా ఆయన రాక వాయిదా పడింది. ముఖ్య అతిథులుగా హాజరైన పంచాయతీరాజ్ రాష్ట్ర అడిషనల్ కమిషనర్ డాక్టర్ సుధాకరరావు, పంచాయతీరాజ్ మాజీ కమిషనర్ డి రామకృష్ణలు మాట్లాడుతూ, పంచాయతీ సశక్తీకరణ అభియాన్ పథకంపై అవగాహన కల్పించారు.

ఈ పథకం ద్వారా గ్రామాల్లో స్వయంగా ప్రభుత్వ పరిపాలనను అభివృద్ధి చేసి తద్వారా గ్రామ పంచాయతీల అభివృద్ధికి తోడ్పాటు అవుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో విస్తరణ శిక్షణ కేంద్రాలున్న జిల్లాలు మినహా మిగిలిన చోట్ల జిల్లా వనరుల కేంద్రాలు ఏర్పాటు చేసి పంచాయతీరాజ్ ఉద్యోగులకు, సర్పంచ్‌లకు నైపుణ్యంగా శిక్షణలు ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామ సభల నిర్వహణతోపాటు, ప్రతీ పంచాయతీలో నూతన పంచాయతీ భవనం నిర్మించడం, అలాగే పాత భవనాలకు మరమ్మత్తులు చేసేందుకు నిధులను కేంద్రం ఏటేటా విడుదల చేస్తోందన్నారు.

ఈ పథకం కింద ప్రతీ మండల కేంద్రంలో ఒక్కో గ్రామస్థాయి వనరుల కేంద్రం రూ. 10 లక్షలతో నిర్మించి, ఒక్కో భవనంలో సుమారు నలుగురు ఉద్యోగులు ఒక్క సోషల్ ఫెసిలిటేటర్, కంప్యూటర్ ఆపరేటర్, బిల్డింగ్ ఓవర్‌సీర్ తదితర నలుగురు ఉద్యోగులను నియమిస్తారన్నారు. ఇప్పటి వరకూ అమలుచేస్తున్న ఈ పంచాయతీ, స్వరోజ్‌గార్ యోజన వంటి పథకాలు రద్దయ్యి అన్నీ ఆర్‌జిపిఎస్ఎలో విలీనమవుతాయన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రత్యేక శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతీ ఏటా రాష్ట్ర వ్యాప్తంగా విడుదలైన నిధులు ఖర్చు చేసిన విధానాన్ని బట్టి తిరిగి నిధులు విడుదల చేయడం జరుగుతుందన్నారు. గత ఏడాది విడుదలైన నిధులు ఖర్చు చేయకుండా, తిరిగి కొత్త ఏడాది నిధులు అడిగితే మంజూరు చేయరని చెప్పారు. నిత్యం పంచాయతీల సమాచారాన్ని ఒక రోజు ఒకో పేజీ చొప్పున ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు.

గ్రామ సభల నిర్వహణ జిఓ 791 ప్రకారం ఎలా నిర్వహించాలి, పంచాయతీలకు గ్రామసభల నిర్వహణకు అనువైన పరిస్థితులు, మౌలిక వసతుల కల్పన ద్వారానే గ్రామాల అభివృద్ధి ముడిపడి ఉంటుందన్నారు.

ఈ పథకం లక్ష్యం నెరవేరేందుకు మండల స్థాయిలో ఎంపిడిఓలు, ఇవోపి ఆర్డీలు, గ్రామస్థాయిలో గ్రామ కార్యదర్శులు వ్యవస్థాపరంగా కృషిచేయాలన్నారు. రాజ్యాంగంలోని 243బి అధికరణం ప్రకారం పంచాయతీరాజ్ గ్రామపరిపాలన వ్యవస్థలో రావాల్సిన మార్పులు, పథకం ఆవశ్యకత, లక్ష్యాలు, వర్తింపు, పథకం విధి విధానాలు, వ్యూహాత్మక ప్రణాళిక, పనితీరు ఆధారంగా నిధుల కేటాయింపు, నిధులు పొందడానికి పాటించాల్సిన షరతులు, వార్షిక ప్రణాళికల స్వరూపం, సాంకేతిక సహాయం, నిధుల సమీకరణ, పాలనా పరమైన మార్పులు, ఈ పంచాయతీల నిర్వహణ, గ్రామ పంచాయతీల భవనాలు, ఎన్నికైన ప్రజాప్రతినిధుల, సిబ్బంది

గైడ్ లైన్స్‌ను వివరిస్తున్న స్పెషల్ కన్సల్టెంట్ **శ్రీ డి.రామకృష్ణ, ఐ.ఎ.ఎస్ (రిటైర్డ్) గారు**




సామర్థ్యం పెంపు శిక్షణలు, ఆర్థికంగా బలహీనంగా ఉన్న పంచాయతీల్లో పంచాయితీ ప్రక్రియలు, కార్యవిధానాలకు మద్దతు, పీసా ఈశాన్య, గిరిజన గ్రామాల్లో చేపట్టాల్సిన చర్యలపై పంచాయతీరాజ్ అడిషనల్ కమిషనర్ డాక్టర్ సుధాకరరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

ఈ వర్క్‌షాపులో ఆర్జీపిఎస్ఎ కన్సల్టెంట్, రిటైర్డు సిఇఒ సిహెచ్ కుమారస్వామి, పశ్చిమగోదావరి జిల్లాపరిషత్ సిఇఒ డి సత్యనారాయణ, డిపిఒల్ శ్రీధర్‌రెడ్డి, తూర్పుగోదావరి డిపిఒ ఆనంద్, విస్తరణ శిక్షణ కేంద్రం డిపిఒ సుధాకర్, పశ్చిమగోదావరి జిల్లా పంచాయతీరాజ్ ఎస్ఇ రాజ్‌కుమార్, తూర్పుగోదావరి జిల్లా ఇన్‌ఛార్జి ఎస్ఇ దుర్గాప్రసాద్, డివిజనల్ పంచాయతీ అధికారులు నాగలత (కాకినాడ), చంద్రశేఖర్ (రాజమండ్రి), కృష్ణకుమారి (పెద్దాపురం), సత్యనారాయణ (నర్సాపురం), జడ్పీ ఇఇలు, డిఇలు, ఉభయగోదావరి జిల్లాలకు చెందిన ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌పిడిలు, పిఆర్ ఇంజనీర్లు, సామర్లకోట ఎంపిడిఓ అడపా వెంకటలక్ష్మి, ఇఒపిఆర్‌డి సిహెచ్ జగ్గారావు, సామర్లకోట మండల పరిషత్ సిబ్బంది, విస్తరణ శిక్షణ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. ◆

Printed & Published by: J. Raymond Peter, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. **Editor : J. Raymond Peter**